


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



‘ఓటుచోరీ’పై దర్యాప్తు చేయాల్సిందెవరు? 06

పిఎం, సిఎం సిగ్గుపడాలి
న్యూస్‌పేపర్‌లో మధ్యాహ్న భోజనం వడ్డింపుపై రాహుల్‌గాంధీ మండిపాటు 05

ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం



సంపుటి 08, సంచిక: 338 | ఆదివారం | 09-11-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను గెలిపించండి

### ఉప ఎన్నికలో బిజెపి, బిఆర్‌ఎస్‌ను మట్టికరిపించాలి

- బిజెపి పట్ల మెతకవైఖరితో ముందుకెళ్తున్న గులాబీ పార్టీ
- మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, ఓట్ చోరీని తిప్పికొట్టాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు
- సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఈనెల 15 నుంచి వారం రోజులు జాతాలు




ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ గెలిస్తే బిజెపికి ఉపయోగం జరుగుతుందని, బిజెపి అసలు గెలవ వద్దనేది తమ లక్ష్యమని, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో బిజె పి, బిఆర్‌ఎస్ రెండు పార్టీలను ఓడించి కాంగ్రెను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎం ఎల్ ఎ కూనంనేని సాంబశివరావు జూబ్లీహిల్స్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్ధూంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహలతో కలిసి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బిఆర్‌ఎస్‌కు సొంత వ్యూహం లేదని, బిజెపితో ఘర్షణ ఎందుకనే వైఖరితో బిజెపికి అనుకూలంగా ముందుకు వెళుతున్నదని, అందులో భాగంగానే గతంలో కేసులు ఉన్నాయని ఉద్దేశంతో కీలక ఎన్నికల్లో బిజెపికి అనుకూల వైఖరిని బిఆర్‌ఎస్ వహించిందన్నారు. ఇప్పుడు కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిఆర్‌ఎస్ అదే వైఖరిని అవలంబిస్తే సైద్ధాంతికంగా బిజెపికి అవకాశం ఇచ్చినట్లు అవుతుందని, అందుకే బిజెపిని, దానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న బిఆర్‌ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ ను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. బిఆర్‌ఎస్ విధానాలు నిలకడగా లేవని, అవసరాన్ని బట్టి అప్పటికప్పుడు మార్చుకుంటున్నారని, లౌకిక విధానం, సామ్రాజ్యవాదం, మతపరమైన తదితర అంశాల విషయంలో బిజెపికి అనుకూలమైన వైఖరిని బిఆర్‌ఎస్ అవలంబిస్తున్నదన్నారు. శత్రువు శత్రువు మిత్రుడు అనే సూత్రంతో బిజెపికి అనుకూలంగా, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బిఆర్‌ఎస్ వ్యవహరిస్తున్నదని ఆయన విమర్శించారు. బిజెపి, బి ఆర్ ఎస్ దోస్తీ ఏమిటో తెలియదు కానీ అంతర్గతంగా రెండు పార్టీల మధ్య ఏదో స్నేహం ఉన్నట్లు కనబడుతున్నదన్నారు.

**కుట్రలపై ఆధారపడి అధికారం నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న మోదీ**

బిజెపి అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాల వల్ల దేశానికి నష్టం జరుగుతున్నదని, మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను, ఓట్ చోరీని తిప్పికొట్టాలని కూనంనేని సాంబశివ రావు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఓటర్ల ప్రక్షాళన పేరుతో

తరువాయి 2లో

> **సమస్యలపై ‘తెలంగాణ దిగ్బంధనం’**
>
> రానున్న మూడేళ్ల కాలం ఉద్యమాల కాలమని, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలపై ఉద్యమాలు, పోరాటాలు ఉంటాయని, ఈ సమస్యల పరిష్కారం కోసం ‘తెలంగాణ దిగ్బంధనం’ కార్యక్రమానికి కూడా రూపకల్పన చేయనున్నట్లు సాంబశివరావు వెల్లడించారు. ఇప్పటికే ప్రజాసమస్యలపై ఎక్కడికక్కడ తమ గొంతు వినిపిస్తున్నామని, భవిష్యత్‌లో ప్రత్యక్ష మిలిటెంట్ పోరాటాలకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు.



## డిసెంబరు 1 నుంచి పార్లమెంట్

- 19 వరకు జరగనున్న శీతాకాల సమావేశాలు
- అసాధారణ ఆలస్యం, కుదించివేశారని ప్రతిపక్షాలు మండిపాటు

**న్యూఢిల్లీ :** పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1 నుండి 19 వరకు జరగనున్నాయి. మూడు వారాల పాటు జరిగే ఈ సమావేశాల్లో మొత్తం 15 సిట్టింగ్‌లు ఉండనున్నాయి. ఈ మేరకు శనివారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు శనివారం ప్రకటించారు. అయితే సమావేశాల నిర్వహణపై ప్రతిపక్షాలు స్పందిస్తూ ఇవి అసాధారణంగా ఆలస్యమని, సమావేశాలను కుదించారని మండిపడ్డాయి. 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) చేపడుతున్న తరుణంలో పార్లమెంట్ సమావేశాలు జరుతుండడంతో ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడే అవకాశముందని పలువురు భావిస్తున్నారు. సర్‌పై అనేక ప్రతిపక్ష పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న

తరువాయి 2లో

## ఒకేసారి రూ.60,799కోట్లతో రోడ్ల నిర్మాణం

- మరో రూ.28 వేల కోట్లతో మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ సిటీ వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల ప్రతిపాదనలు
- అబ్దుల్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ నుంచి విజయవాడ వరకు 8 లేన్లుగా జాతీయ రహదారి విస్తరణ
- రూ.లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షలాదిమంది యువతకు ఉపాధి
- రోడ్ల నిర్మాణంలో రాష్ట్రం రికార్డు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం, జిడిపి పెరుగుదల లక్ష్యంగా, ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి రాష్ట్ర చరిత్రలోనే కనీ విని ఎరగని రీతిలో ఒకేసారి రూ.60,799 కోట్లతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. వీటితోపాటు మరో 28 వేల కోట్ల తో చేపట్టనున్న మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు, ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్ట్ వరకు చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు ప్రతిపాదనలో ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ‘మౌలిక సదుపాయాల కల్పనతో బహుళ జాతి సంస్థలకు తెలంగాణ కేంద్రంగా మారబోతోంది. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి, లక్షలాదిమంది గ్రామీణ యువతకు ఉపాధి కలగనుంది’ అని తెలిపారు. ప్రపంచంలోని పెట్టుబడిదారులు అంతా తెలంగాణ రాష్ట్రానికి తరలివచ్చేలా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు రహదారుల నిర్మాణంతో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోకి పెద్ద సంఖ్యలో పరిశ్రమలు రానున్నాయి అని ఆ ప్రకటనలో వివరించారు. ఫలితంగా లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షలాదిమంది రాష్ట్ర యువతకు ఉపాధి లభించనుందనీ తెలిపారు. అబ్దుల్లాపూర్ ఇండస్ట్రియల్ పార్కు నుంచి విజయవాడ

తరువాయి 2లో

## అగ్గికి పత్తి ఆహుతి

ప్రమాదవశాత్తు మంటలు

300 క్వింటాళ్ల తెల్లబంగారం దగ్ధం

బోరున విలపించిన రైతు బండి ఐలయ్య

సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో ఘటన



12

## స్వతంత్ర సంస్థలు దుర్వినియోగం

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మండిపాటు
- మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో జనాభిప్రాయం మేరకు ఫలితం రాలేదని ధ్వజం
- ఓట్ చోరీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సంతకాల సేకరణ చేపడతామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్




స్వతంత్ర సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ విమర్శించారు. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో జనాభిప్రాయం ప్రకారం ఫలితం లేదని ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకుడు వి.హనుమంతరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ అనేక విషయాలు బయటపెట్టారని బిహార్‌లో కూడా ఓటు చోరీ జరుగుతోందని మీనాక్షి ఆరోపించారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సంతకాల సేకరణ జరుగుతోందని ఈ ఎన్నికలు ముగిశాక లక్షలాది మంది ప్రజల వద్దకు వెళ్లి సంతకాల సేకరణ చేపడతామన్నారు. నవంబర్ ఆఖరి వారంలో సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న లక్షలాది మందితో కలిసి ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఖర్గే, రాహుల్ గాంధీ నేతృత్వంలో ర్యాలీ నిర్వహించబోతున్నట్లు ఆమె ప్రకటించారు.

**ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిజెపి**

దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తూ బిజెపి అవకతవకలకు పాల్పడుతోందని టిపిసిసి అధ్యక్షులు

తరువాయి 2లో



## భావప్రకటన స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్యం నిలవదు

- ఇది కేవలం న్యాయసూత్రం కాదు, జీవనసత్యం
- మీడియా చేతులు దాటిన సోషల్ మీడియా
- కొద్దిమంది సంపన్నుల చేతుల్లో కేంద్రీకరణ
- అక్షరశస్త్రధారి సి. రాఘవాచారి 6వ స్మారకోపన్యాసంలో భారత సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి
- ప్రజల పక్షాన పనిచేసేందుకే మీడియాను రాజ్యాంగంలో చేర్చలేదు : కె. శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

‘భావప్రకటన స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్యం నిలవదు’ అని భారత సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. ‘విశాలాంధ్ర మాజీ సంపాదకులు సి.రాఘవాచారికి భయమనే పదం తెలియదు. సత్యం పట్ల ఎన్ని కష్టాలు వచ్చినా వెనక్కు తగ్గకుండా ‘విశాలాంధ్ర’ను నిలబెట్టారు. విశాలాంధ్రను కేవలం పత్రికగా కాకుండా, ఒక విలువల వేదికగా నిలబెట్టిన మహానుభావుడు రాఘవాచారి’ అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి కొనియడారు. అటువంటి మహనీయుని స్మారకోపన్యాసంలో పాల్గొనడం నా అదృష్టం’ అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. సి.రాఘవాచారి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ జర్నలిస్ట్, విశాలాంధ్ర పూర్వ సంపాదకులు అక్షరశస్త్రధారి సి.రాఘవచారి 6వ స్మారకోపన్యాసం సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ‘ప్రసార మాధ్యమాలు న్యాయ వ్యవస్థ’ అనే అంశంపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రసంగిస్తూ మూడు దశాబ్దాల పాటు సంపాదకుడిగా

తరువాయి 12లో

## ఆర్థికపర అంశాలలో ‘సుప్రీం’ జోక్యం చేసుకోదు


సిజెఐ బి.ఆర్.గవాయ్ స్పష్టీకరణ

‘వాణిజ్య కోర్టుల స్టాండింగ్ ఇంటర్నేషనల్ ఫోరం’ ఆరవ పూర్తి సమావేశంలో ప్రసంగం



**న్యూఢిల్లీ :** న్యాయవ్యవస్థ చట్ట పాలనకు స్థిరమైన సంరక్షకుడిగా ఉన్నదని, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన లేదా రాజ్యాంగంలోని ఇతర నిబంధనల ఉల్లంఘన జరిగితే తప్ప ఆర్థిక అంశాలకు సంబంధించిన విధానపరమైన విషయాలలో అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకోబోదని హామీ ఇచ్చిందని భారత ప్రధానన్యాయమూర్తి (సిజెఐ) బి.ఆర్.గవాయ్ స్పష్టంచేశారు. శనివారం ఇక్కడ జరిగిన ‘వాణిజ్య న్యాయస్థానాల స్టాండింగ్ ఇంటర్నేషనల్ ఫోరం’ ఆరవ పూర్తి సమావేశంలో ఆయన కీలక ప్రసంగం చేశారు. వాణిజ్య, కార్పొరేట్ విషయాలలో సుప్రీంకోర్టు పారదర్శకత, సమగ్రతను నిర్ధారించడంలో అప్రమత్తంగా ఉందని, చట్టపరమైన లేదా కార్పొరేట్ నిర్మాణాలను మోసపూరిత లాభం కోసం దుర్వినియోగం చేసే ప్రయత్నాలను తప్పక తిరస్కరిస్తుందని బి.ఆర్.గవాయ్ అన్నారు. ‘రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు లేదా ఇతర నిబంధనల

తరువాయి 2లో



జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన పలువురు మంత్రులు, సినీ, రాజకీయ నేతలు

## ‘విశ్వగురు’వెళ్ళడం ఖాయం

జి–20 సదస్సుకు ప్రధాని మోదీ హాజరుపై కాంగ్రెస్ ఎద్దేవా



**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జి–20 సదస్సుకు వెళ్ళడం లేదు కాబట్టి, ఇక ‘విశ్వగురు’ (ప్రధానమంత్రి నరేంద్రమోదీ)ఆ సదస్సుకు వెళ్ళడం ఖాయమని కాంగ్రెస్‌పార్టీ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. కౌలాలంపూర్‌లో గతనెల జరిగిన ‘ఏసియన్’ సదస్సులో ట్రంప్ పాల్గొన్నందువల్ల నరేంద్రమోదీ వెళ్ళలేదని, ఇక ఇప్పుడు జి–20 సదస్సును బహిష్కరిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు కాబట్టి జోహన్నెస్‌బర్గ్‌లో జరిగే సమావేశాలకు మోదీ ఖాయంగా వెళతారని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ కమ్యూనికేషన్ల

తరువాయి 12లో

## జి–20 సదస్సు అమెరికా బహిష్కరణ

డొనాల్డ్ ట్రంప్ ఉద్ఘాటన

తమదేశం నుంచి ఎవరూ హాజరుకాబోరని స్పష్టీకరణ

సదస్సు దక్షిణాఫ్రికాలో జరగడం పూర్తి అవమానకరమని వ్యాఖ్య



**న్యూయార్క్/వాషింగ్టన్:** దక్షిణాఫ్రికాలో జరిగే జి–20 సదస్సుకు అమెరికా బహిష్కరించిందని ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి ఉద్ఘాటించారు. ఈ సదస్సుకు తమదేశం నుండి తానుగానీ, తమ దేశ ప్రతినిధులుగానీ హాజరుకాబోరని స్పష్టం చేశారు. జి–20 సదస్సు దక్షిణాఫ్రికాలో జరగడం పూర్తి అవమానకరమైనదిగా పేర్కొన్నారు. దక్షిణాఫ్రికాలో జాతిపరంగా మైనారిటీలుగా ఉన్న గ్రూపుపై నిరంతరాయంగా ఈనాటికి మానవ హక్కుల దోపిడీ కొనసాగుతోందని ట్రంప్ మండిపడ్డారు. ఈవారారంభంలోనే ఆయన స్పందిస్తూ ఈ సదస్సుకు తాను వెళ్ళడంలేదని చెప్పారు. డచ్‌దేశీయులు, ఫ్రెంచ్, జర్మన్ దేశీయులు దక్షిణాఫ్రికాలో జీవిస్తున్నారని, వారిపట్ల తీవ్ర వివక్ష చూపిస్తూ వారిని హతమారుస్తున్నారని ట్రంప్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన ట్రూత్ సోషల్‌లో పోస్టింగ్ పెట్టారు. ఆ దేశంలో మానవ హక్కుల దోపిడీ కొనసాగినంతకాలం తమ దేశీయులు అక్కడికి వెళ్ళరన్నారు. ఫ్లోరిడా రాష్ట్రం

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## గాజాకు మరో 15 మృతదేహాలు అప్పగించిన ఇజ్రాయెల్

**ఖాన్‌యూనిస్:** పశ్చిమ ఆసియాలో శాంతి ఒప్పందం ప్రకారం హమాస్ సంస్థ నెలరోజులుగా ఇప్పటివరకూ 23 మంది బందీల మృతదేహాలను ఇజ్రాయెల్‌కు స్వాధీనం చేయగా, నెతన్యాహూ ప్రభుత్వం శనివారం 15 మంది పాలస్తీనియన్ల మృతదేహాలను గాజా ప్రభుత్వానికి అప్పగించింది. హమాస్ సంస్థ ఇంకా ఐదుగురు బందీల మృతదేహాలను లేదా వారి అస్థికలను ఇజ్రాయెల్‌కు స్వాధీనం చేయాల్సి ఉంది. ఒక్క బందీని అప్పగిస్తే 15 మంది పాలస్తీనియన్లను తిరిగి అప్పగిస్తామన్నది ఇజ్రాయెల్ చేసుకున్న ఒప్పందం. ఈ మేరకు రెండు వైపులా అధికారులు మృతదేహాలను అప్పగించుకుంటున్నారు. ట్రంప్ మధ్యవర్తిత్వంతో అక్టోబరు 10వ తేదీ నుండి గాజాలో శాంతి ఒప్పందం అమలులోకి వచ్చింది. ఇప్పటివరకూ ఇజ్రాయెల్ 300 మంది పాలస్తీనియన్ ఖైదీల మృతదేహాలను గాజాలో ప్రభుత్వానికి అప్పగించింది.

## జన్యుశాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత జేమ్స్ వాట్సన్ మృతి



**న్యూయార్క్:** నోబెల్ బహుమతి గ్రహీత జేమ్స్ వాట్సన్ మరణించారు. ఆయన వయసు 97 సంవత్సరాలు. ఆయన ప్రధానంగా జన్యుశాస్త్ర రంగంలో పనిచేశారు. ఆయన ఎన్నో వివాదాలలో చిక్కుకున్నప్పటికీ, జన్యు రంగంలో ఆయన చేసిన కీలక ఆవిష్కరణల ఆధారంగా జన్యుశాస్త్ర అధ్యయనం ముందుకు కొనసాగుతున్నది. 2014లో ఆయన తన నోబెల్ పతకాన్ని 4.8 మిలియన్ డాలర్లకు విక్రయించి వార్తల్లో నిలిచారు. దీర్ఘకాలం గా అనారోగ్యంతో బాధపడుతున్న జేమ్స్ వాట్సన్ న్యూయార్క్‌లోని ఒక ఆసుపత్రిలో మరణించారు. ఆయన భార్య ఎలిజిబెత్ లెవిస్. వారికి ఇద్దరు పిల్లలు. డిఎన్‌ఎ అణువులో ఉన్న డబుల్ హెలిక్స్ నిర్మాణాన్ని ప్రతిపాదిస్తూ ఫ్రాన్సిస్ క్రిక్, మారిస్ విల్కిన్స్‌లతో కలిసి 1953లో ఆయన ఒక పరిశోధనా పత్రాన్ని ప్రచురించారు. న్యూక్లియక్ ఆమ్లాల పరమాణు నిర్మాణం, జీవ పదార్థంలో సమాచార బదిలీకి సంబంధించి దానికి ఉన్న ప్రాముఖ్యతను వివరిస్తూ జేమ్స్ వాట్సన్ చేసిన సంచలనాత్మకమైన ఆవిష్కరణ పరమాణు జీవశాస్త్రంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. ఈ ఆవిష్కరణకుగాను 1962లో శరీర ధర్మశాస్త్రం(మెడిసిన్)లో ఆయనకు నోబెల్ బహుమతి లభించింది. ఆయన అనేక సైన్స్ పుస్తకాలు రాశారు. వాటిల్లో ''మాలిక్యులర్ బయాలజీ ఆఫ్ ద జీన్'' 1965లో అత్యుత్తమమైన పాఠ్యపుస్తకంగా విరాజిల్లింది. ఆయన రాసిన ''డబుల్ హెలిక్స్'' అనే పుస్తకం ప్రపంచవ్యాప్తంగా భారీగా అమ్ముడుపోయి 1968లో సంచలనం సృష్టించింది. హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్టును స్థాపించడంలో ఆయన ఎంతగానో కృషి చేశారు. ఆ తర్వాత 2003లో ఆ ప్రాజెక్టు ''మానవ జన్యువు మ్యాపింగ్'' పనిని విజయవంతంగా పూర్తిచేసింది. జేమ్స్ డ్యూయి వాట్సన్ 1928లో ఏప్రిల్ 6వ తేదీన చికాగోలో జన్మించారు.

అమెరికన్ మాలిక్యుయర్ శాస్త్రవేత్త, జన్యుశాస్త్రవేత్త, జంతుశాస్త్రవేత్తగా ఆయన పేరుగాంచా రు. 1947లో ఆయన చికాగో యూనివర్సిటీలో బ్యాలర్ డిగ్రీలు సంపాదించారు. ఇండియానా యూనివర్సిటీ బ్లూమింగ్టన్‌లో పిహెచ్‌డి చేశారు. కొపెన్‌హాగన్ విశ్వవిద్యాలయంలో పోస్ట్ డాక్టోరల్ చేశారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం కావెండిష్ ప్రయోగశాలలో పనిచేశారు. అక్కడే ఆయన ఫ్రా న్సిస్ క్రిక్‌ను కలిశారు. 1956 నుండి 1976 వరకూ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జీవశాస్త్ర అధ్యాపకుడుగా పనిచేశారు. పరమాణు జీవశాస్త్రంలో పరిశోధనలకు అందరినీ ప్రోత్సహించారు. 1968 నుండి కోల్డ్ స్ప్రింగ్ హార్బర్ లేబొరేటరీ (సిఎస్‌హెచ్‌ఎల్) డైరెక్టర్‌గా పనిచేశారు. తర్వాత ఛాన్సలర్ స్థాయికి ఎదిగారు. ఈ లేబొరేటరీని మాలిక్యులర్ బయాలజీలో ప్ర పంచ ప్రసిద్ధ పరిశోధనా కేంద్రంగా తీర్చిదిద్దారు. తర్వాత కేన్సర్ పరిశోధనలపై దృష్టి మళ్ళించారు. జాతి–మేధస్సు మధ్య జన్యుపరమైన సంబం ధం ఉందని ఆయన వివాదాస్పద ప్రకటనలు చేసి వాటిని పునరుద్ఘాటించడంతో సిఎస్‌హెచ్‌ఎల్ అప్పటివరకూ ఆయనకు ఇచ్చిన గౌరవ బిరుదులను రద్దుచేసుకుంది. ఛాన్సలర్ పదవి నుండి తొలగించింది.

## మాలీలో ఐదుగురు భారతీయ కార్మికుల కిడ్నాప్

**కోబ్రి:** పశ్చిమ ఆఫ్రికాదేశం మాలీలోని ఒక కంపెనీలో పనిచేస్తున్న ఐదుగురు భారతీయ కార్మికులను ఇస్లామిస్టు ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారు. ఆ దేశంలో అల్‌ఖైదా, ఐఎస్‌ఐఎస్ అనుబంధ ఉగ్రవాదుల కార్యకలాపాలు రోజు రోజుకూ ఉద్ధృతమవుతున్న తరుణంలో భారతీయులు అపహరణకు గురయ్యారు. విదేశీయులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాద మద్దతుగల నేర ముఠాలు రెచ్చిపోతున్నాయి. పశ్చిమ మాలీలోని కోబ్రిలో గురువారం ఈ కిడ్నాప్ ఘటన జరిగినట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని సంబంధిత కంపెనీ ప్రతినిధి ఒకరు శనివారం చెప్పారు. భారతీయుడికి చెందిన ఈ కంపెనీలో అనేకమంది భారతీయ కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ ఘటన తర్వాత కంపెనీలో ఉన్న మిగిలిన కార్మికులు, ఉద్యోగులను రాజధాని బొమాకోకి తరలించారు. అపహరణకు గురైన కార్మికులు అందరూ విద్యుద్దీకరణ నిర్మాణ కార్యక్రమాల్లో శారీరక శ్రమచేస్తుండగా సాయుధులైన ఉగ్రవాదులు వారిని అపహరించారు. ఐతే తామే ఈ కిడ్నాపులు చేశామని ఏ ఉగ్రవాద సంస్థా ఇప్పటివరకూ ప్రకటన విడుదల చేయలేదు. ఐతే అల్ ఖైదా, ఐఎస్‌ఐఎస్ సంస్థ అనుబంధ ఉగ్రవాద నేరస్థులే ఈ చర్యకు పాల్పడ ఉంటారని అనుమానిస్తున్నారు. విదేశీయులను అపహరించడం, వారిని సమస్యల్లోకి నెట్టడం మాలిలో 2012 నుండీ నిత్యకృత్యంగా సాధారణ విషయంగా మారిపోయింది. గడచిన సెప్టెంబరు నెలలో కూడా ఇద్దరు ఎమిరిటస్ జాతీయులను, ఒక ఇరాన్ జాతీయుణ్ణి కూడా ఉగ్రవాద నేర ముఠాలు అపహరించాయి. ఐతే వారికి 50 మిలియన్ డాలర్ల ధనం ముట్టజెప్పడంతో ఇటీవలే వారు ముగ్గురినీ ఉగ్రవాదులు విడుదల చేశారు.



### తీవ్రరూపం దాల్చిన చమురు సంక్షోభం

మాలీదేశం ప్రస్తుతం సైనిక నియంతల పరిపాలనలో ఉంది. అల్‌ఖైదీ, ఇస్లామిస్టు ఉగ్రవాద గ్రూపులు, నేరముఠాలు సాగిస్తున్న తీవ్ర హింసాకాండతో మాలీ దేశం అతలాకుతలమవుతున్నది. మాలీ రాజధాని బొమాకోలో గడచిన రెండు నెలలుగా తీవ్రమైన ఇంధన కొరత ఉంది. అల్‌ఖైదా ఉగ్రవాద ముఠాలు మాలీలోకి వస్తున్న ఇంధన వనరులను రానివ్వకుండా అడ్డుపడుతున్నాయి. అరాచకాలు సృష్టిస్తున్నాయి.దీంతో దిగుమతి ఇంధన వనరులు దేశంలోకి ప్రవేశించడంలేదు. ఇస్లాం–ముస్లిం జీహాదిస్టుల మద్దతుగల ముఠాలు ఈ దారుణాలకు పాల్పడుతున్నాయి.

## నైజీరియాలో ట్రంప్ సైనికచర్య హెచ్చరిక

క్రైస్తవుల మనుగడకు ప్రమాదం!



**అబూజా:** పశ్చిమ ఆఫ్రికాదేశం నైజీరియాలో సైనిక చర్య చేపడతామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక చేశారు. నైజీరియాలో క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని దాడులు, హత్యలకు పాల్పడుతున్న ఘటనల నేపథ్యంలో ట్రంప్ పైవిధంగా హెచ్చరిక చేశారు. ఉత్తర నైజీరియాలో ముస్లిం జనాభా అత్యధికంగా ఉండగా, దక్షిణ నైజీరియాలో క్రైస్తవులు అత్యధికంగా ఉన్నారు. ఈ రెండు ప్రాంతాలమధ్యా తీవ్ర విభజన ఏర్పడింది. క్రైస్తవ మస్తులను హత్య చేస్తున్నారని, ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తూ క్రైస్తవుల హత్యలకు అవకాశం ఇస్తోందని, ఆ దేశంలో క్రైస్తవుల మనుగడకు ప్రమాదం వాటిల్లిందని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఒక పోస్టింగ్ పెడుతూ, పరిస్థితి ఇదేవిధంగా కొనసాగి క్రైస్తవుల హత్యలకు ప్రభుత్వం అవకాశం కలిగిస్తే నైజీరియాకు అమెరికా అందిస్తున్న సహాయాన్ని తక్షణం నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ దారుణాలకు కారణమైన ఇస్లామిస్టు ఉగ్రవాదాన్ని నైజీరియాలో పూర్తిగా తుడిచిపెడతామని హెచ్చరించారు. సైనిక చర్యకు సిద్ధంగా ఉండాల్సిందిగా అమెరికా 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్'కు ఆదేశాలిస్తున్నానన్నారు. నైజీరియాలో మతపరమైన వైరుధ్యాలపై మళ్ళీ విస్తారంగా చర్చ ప్రారంభమైన తరుణంలో ట్రంప్ పైవిధంగా స్పందించారు. ఒక్క నైజీరియాలోనే 3,100 మంది క్రైస్తవులను హతమార్చారనీ, ప్రపంచవ్యాప్తంగా 4,426 మంది క్రైస్తవులు హతులయ్యారని, నైజీరియాలో క్రైస్తవ మత మనుగడకు ఇది పెద్ద ప్రమాదంగా పరిణమించిందని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. రాడికల్ ఇస్లామిస్టు గ్రూపులే ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నాయని, అందువల్ల నైజీరియాలో తక్షణం సైనిక చర్య చేపట్టాల్సిన ఆవశ్యకత వచ్చిందని అన్నారు. నైజీరియాలో మతస్వేచ్ఛలేదని, అక్కడ క్రైస్తవుల ఊచకోత పెరిగిందని ఇటీవల అనేక ఇంటర్వ్యూలలో ట్రంప్ చెబుతూ వస్తూ ఉండటంతో నైజీరియా దేశాన్ని అమెరికా రక్షణశాఖ తన నిశిత పర్యవేక్షణా జాబితాల దేశాలలో చేర్చింది. ఐతే ఈ విషయంలో ఇతర దేశాల సహాయాన్ని అర్థించినప్పుడు నైజీరియా సార్వభౌమాధికారాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని గౌరవిస్తామని అన్నారు.

## పాకిస్థాన్ సైనిక వ్యవస్థ పునర్వ్యస్థీకరణ

ఆసిఫ్ మునీర్‌కు తిరుగులేని అధికారాలు!



**ఇస్లామాబాద్:** భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్, సైనిక సంఘర్షణ తర్వాత పాకిస్థాన్ తన సైనిక వ్యవస్థను పునర్వ్యవస్థీకరించే పనిలో నిమగ్నమైంది. ఆ దేశంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజ్యాంగ 27వ సవరణ కార్యక్రమంలో న్యాయ వ్యవస్థలో మార్పులతోపాటు సైన్యాన్ని కూడా సంస్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు కమాండర్ ఆఫ్ ద నేషనల్ స్ట్రాటజిక్ కమాండ్ పదవి పుట్టుకొస్తుంది.పదాతిదళం, వైమానిక, నావికాదళాల అధికారాలను ఏకం చేస్తూ యూనిఫైడ్ కమాండ్ ఏర్పాటు ద్వారా ఆసిఫ్ మునీర్‌కు తిరుగులేని అధికారాలు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఆర్థికంగా దేశీయంగా అప్పుల ఊబిలో కూరుకున్నప్పటికీ, భారతదేశంపై పైచేయి సాధించేందుకు సైన్యంలో సంస్కరణలు చేపడుతున్నది. యూనిఫైడ్ కమాండ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఆసిఫ్ మునీర్‌కు సూపర్ పవర్స్ లభిస్తాయి. ఈ 27వ రాజ్యాంగ సవరణ బిల్లును శనివారం మధ్యాహ్నం సెనేట్‌లో ప్రవేశపెట్టారు. సవరణ ద్వారా రాజ్యాంగంలోని 243వ నిబంధనను పునర్లిఖిస్తున్నారు. ఈ ప్రకారం పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఇకమీదట 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్' స్థాయికి ఎదుగుతారు. ఈ మేరకు సిజెసిఎస్‌సి (ఛైర్మన్ ఆఫ్ ద జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ) రద్దు అవుతుంది.243వ అధికరణలో మార్పుల ప్రకారం ప్రధానమంత్రి సలహా మేరకు రాష్ట్రపతి త్రివిధ దళాధిపతులను నియమిస్తారు. ఫైవ్ స్టార్ ర్యాంక్ ఆఫీసర్లకు జీవితకాల రక్షణ ఉంటుంది. భారత్ నుండి గుణపాఠాలు నేర్చుకున్న పాకిస్థాన్ ఇప్పుడు కమాండర్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ అనే పదవి ఏర్పాటు చేసే విషయం పరిశీలిస్తోంది.

## దుర్వినియోగం
(మొదటి పేజీ తరువాయి)

బి.మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో గతంలో పక్క జిల్లాల ఓటర్లను నమోదు చేసి, బిజెపి సహకారంతో బిఆర్ఎస్ గెలిచిన ఉదాహరణను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన ఓటు చోరీలను ప్రజలు అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలో జరుగుతున్న ఓటు చోరీలపై రాహుల్ గాంధీ ఎనలేని పోరాటం చేస్తున్నారని, లోక్‌సభతోపాటు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చేసిన అవకతవకలను కాంగ్రెస్ ఆధారాలతో సహా నిరూపిస్తోందన్నారు. కర్ణాటకలోని మహదేవ్పుర నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో జరిగిన భారీ తప్పిదాలు, బీజేపీ మోసాలను రాహుల్ గాంధీ ఆధారాలతో సహా బయటపెట్టినా ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బిజెపి చేసిన కుట్రలను రాహుల్ గాంధీ స్పష్టమైన రుజువులతో నిరూపించారని తెలిపారు. హర్యానాలో 25 లక్షలకుపైగా నకిలీ ఓటర్లు, 5 లక్షల డూప్లికేట్ ఓటర్లు, వందలాది తప్పుడు చిరునామాలు, వేలాది తప్పు ఫోటో వివరాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒకే మహిళ ఫొటోతో 22 ఎంట్రీలు, 100 ఓటరు కార్డులు ఉన్నట్టుగా రాహుల్ గాంధీ గుర్తించారని చేశారని చెప్పారు. బిహార్‌లో కూడా బిజెపి సహకారంతో 'సర్' పేరుతో సంబంధం లేని ఓట్లను తొలగించిందని విమర్శించారు.

ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యగా అభివర్ణించారు. ఎన్నికల సంఘం ప్రస్తుతం బిజెపి చెప్పుచేతుల్లో ఉందని, ఏకపక్షంగా వ్యవహరిస్తోందని మహేష్‌కుమార్ ఆరోపించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాహుల్ గాంధీ బీహార్‌లో ప్రారంభించిన 'ఓటు అధికార్ ర్యాలీ' బిజెపిలో వణుకు పుట్టించిందని మహేష్ గౌడ్ అన్నారు. హర్యానా ఫార్ములాను అనుసరించి బిజెపి ఇప్పుడు బీహార్‌లో గెలవాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇందిరా గాంధీ ఏనాడు అవకతవకలకు పాల్పడలేదు. ఓటు హక్కు కాలరాసే హక్కు ఎవరికీ లేదు అని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## 'సుప్రీం' జోక్యం చేసుకోదు
(మొదటి పేజీ తరువాయి)

ఉల్లంఘన వరకూ ఆర్థిక పరిగణనలు ఉన్న విధానపరమైన విషయాలను సుప్రీంకోర్టు జోక్యం చేసుకోబోదని నిర్ధారించింది' అదేవిధంగా, ఏదైనా వాణిజ్య చట్టాన్ని వ్యాఖ్యానించడం న్యాయంగా, ప్రజాప్రయోజనాలను కాపాడుకోవడానికి శాసనసభకు అనుగుణంగా ఉండాలని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది' అని సిజెఐ తెలిపారు. ఆర్థిక స్వేచ్ఛ, నియంత్రణ క్రమశిక్షణ, న్యాయబద్ధత మధ్య సున్నితమైన సమతుల్యతను సుప్రీంకోర్టు స్థిరంగా సమర్థించిందని గవాయ్ వివరించారు. 'రాష్ట్ర అధికారం, నియంత్ర ణ, పన్నులు వంటి ప్రత్యేక అంశాలు స్పష్టమైన శాసనంపై ఆధారపడి ఉండాలని, రాజ్యాంగ పరిమితుల్లో పనిచేయాలన్నది ఇది బలోపేతం చేసింది. నియంత్రణ సంస్థలు ఆర్థిక స్థిరత్వాన్ని, ప్రజల విశ్వాసాన్ని పరిరక్షిస్తున్నప్పటికీ వారి చర్యలు ఎల్లప్పుడూ దామాషా ప్రకారం సహేతుకంగా ఉంటాయని కోర్టు నొక్కిచెప్పింది' అని ఆయన చెప్పారు. వాణిజ్య, కార్పొరేట్ విషయాలలో కోర్టు పారదర్శకత, సమగ్రతను నిర్ధారించడంలో, మోసపూరిత లాభం కోసం చట్టపరమైన లేదా కార్పొరేట్ నిర్మాణాల ప్రయత్నాలను తిరస్కరించడంలో అప్రమత్తంగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యానికి సకాలంలో పరిష్కారం, జవాబుదారీతనం అనే క్రమశిక్షణ చాలా ముఖ్యమైదని ఇది నొక్కిచెప్పింది. అంతేకాకుండా వాణిజ్యం అంతిమంగా మానవ సంక్షేమం, సామాజిక న్యాయానికి సేవ చేయాలని కూడా గుర్తిస్తున్నట్లు ఆయన అన్నారు. కార్పొరేట్ పాలన, దివాలా, మధ్యవర్తిత్వం, పర్యావరణ జవాబుదారీతనం వంటి విభిన్న రంగాలలో కోర్టు విధానం జోక్య వాదం కంటే సూత్రప్రాయంగా ఉన్నదని భారత ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. భారతదేశం డిజిటల్ మరియు గ్రీన్ ఎకానమీ వైపు అడుగులు వేస్తున్నందున వాణిజ్య చట్టం స్థిరత్వం, నైతిక సంస్థను తప్పక ప్రోత్సహించాలని బి.ఆర్.గవాయ్ సూచించారు. 'భారతీయ కంపెనీలు కార్పొరేట్ రిపోర్టింగ్‌లో ఇఎస్‌జిని అనుసంధానించడం పెరుగుతోంది. ఇది స్వాగతించదగిన ధోరణి. ఎందుకంటే మార్కెట్లు బాధ్యతలో లంగరు వేయబడినప్పుడు పనిచేస్తాయి. లాభం లక్ష్యంతో అనుసంధానించబడాలి' అని సిజెఐ చెప్పారు.

## ఈశాన్యరాష్ట్రాల్లో విద్యారంగంపై 11 ఏళ్ళల్లో రూ.21వేలకోట్ల పెట్టుబడి

**గోహ్పూర్ (అసోం):** ఈశాన్యప్రాంత రాష్ట్రాలలో విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం గడచిన 11 సంవత్సరాలలో రూ.21,000కోట్లు పెట్టుబడిగా సమకూర్చిందని ఆర్థికశాఖామంత్రి నిర్మలాసీతారామన్ చెప్పారు. ఇదేకాలంలో కొత్త రైల్వే స్టేషన్లు, పలు గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల నిర్మాణం జరగడంతో ఈ ప్రాంతంలో అనుసంధాన కార్యకలాపాలు కూడా బ్రహ్మాండంగా ఊపు అందుకున్నాయని చెప్పారు. శుక్ర–శనివారాలు అసోంలో నిర్మలాసీతారామన్ పర్యటించారు. అసోం బిశ్వంత్ జిల్లాలోని గోహ్పూర్‌లో భోలాగురి వద్ద మొట్టమొదటి సాంకేతిక–వృత్తి నైపుణ్య శిక్షణ విశ్వవిద్యాలయ నిర్మాణానికి పునాదిరాయి వేసిన సందర్భంగా శనివారం ఆమె మాట్లాడారు. ఈ స్టేట్ యూనివర్సిటీకి స్వాతంత్ర్య సమరయోధురాలు స్వాహిద్ కనక్‌లత బారువా పేరు పెట్టారు. రూ.415 కోట్ల ఖర్చుతో 241 ఎకరాల విస్తీర్ణంలో ఈ విశ్వవిద్యాలయాన్ని నిర్మిస్తారు. మొత్తం ఏడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణాలు జరుగుతాయి. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి ఈశాన్యప్రాంత రాష్ట్రాలకు రూ.21వేలకోట్లు విద్యారంగంకోసం పెట్టుబడిగా సమకూర్చామనీ, 850 కొత్త పాఠశాలలను ప్రారంభించామని చెప్పారు. ఈ ప్రాంతంలో మొట్టమొదటి 'ఎయిమ్స్ (అఖిలభారత వైద్యవిజ్ఞాన సంస్థ) ప్రజల సేవల నిమిత్తం అందుబాటులోకి వచ్చిందని, మరో 200 నైపుణ్యాభివృద్ధి సంస్థలు కూడా కొత్తగా అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. దేశంలోనే మొదటి క్రీడా విశ్వవిద్యాలయం కూడా ఈ ప్రాంతంలోనే వస్తోందని చెప్పారు. ఒక్క అసోం రాష్ట్రంలోనే 15 కొత్త వైద్య కళాశాలు నిర్మించామని, దక్షిణాసియాలోనే అతిపెద్ద క్యాన్సర్ నియంత్రణ సంరక్షణ కేంద్రం అసోంలోనే పెడుతున్నామని, రాష్ట్రంలో రెండవ ఐఐఎం కూడా త్వరలో వస్తుందని అన్నారు. విద్యారంగానికిప్రోత్సాహం ఇవ్వడానికి కేంద్రం కూడా ఈ ప్రాంతంలో రైల్వే, గగనతల రవాణా మార్గాలనుఅభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. గడచిన 11 సం.లలో ఈ ప్రాంతంలో పది గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు నిర్మించామని నిర్మలాసీతారామన్ చెప్పారు.

## డిసెంబరు 1 నుంచి పార్లమెంట్
(మొదటి పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనూ బిహార్‌లో చేపట్టిన సర్‌పై అనేక ప్రతిపక్ష పార్టీలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేశాయి. ఫలితంగా పార్లమెంటులో రోజువారీ అంతరాయాలు ఏర్పడ్డాయి. కాగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డిసెంబర్ 1, 2025 నుండి డిసెంబర్ 19, 2025 వరకు (పార్లమెంటరీ వ్యవహారాల అత్యవసర పరిస్థితులకు లోబడి) పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదనను ఆమోదించిట్లు కిరణ్ రిజిజు ఎక్స్‌లో పోస్టు చేశారు. మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే, పజల ఆకాంక్షలకు సేవ చేసే నిర్మాణాత్మక, అర్థవంతమైన సమావేశాలు జరుగుతాయని ఆశిసున్నామన్నారు. ఈ నెల 14న వెలువడే బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను బట్టి పార్లమెంట్ సమావేశాల్లో ఆయా పార్టీలు తమ ఎజెండాలను ఖరారు చేయనున్నాయి. భారతదేశం 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించిన తర్వాత, వాణిజ్యంపై భారతదేశం, పాకిస్తాన్ మధ్య వైరుధ్యాలను అంతం చేయడంలో సహాయపడటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చేసిన వాదనలపై అనేక ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వం నుండి సమాధానాలు కోరే అవకాశం ఉంది. సెషన్ తేదీలను ప్రకటించిన వెంటనే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సెషన్ అసాధారణంగా ఆలస్యమని, సమావేశాలను కుదించారని పేర్కొన్నారు. కేవలం 15 పని దినాలు మాత్రమే సభలు సమావేశం కానున్నాయని, ప్రభుత్వానికి లావాదేవీలు నిర్వహించాల్సిన పని లేదు, బిల్లులు ఆమోదించాల్సిన అవసరం లేదు, చర్చలు అనుమతించాల్సిన అవసరం లేదు అని రమేష్ ఎక్స్‌లో పోస్ట్‌లో చేశారు. అదే విధంగా ప్రభుత్వానికి 'పార్లమెంట్–ఓఫోబియా' ఉందని తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరెక్ ఓ బ్రెయిన్ ఆరోపించారు. దీనిని పార్లమెంటులో ప్రతిపక్షాలను ఎదుర్కోవడానికి భయపడుతోందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆయన బృందం పార్లమెంటు–ఓఫోబియా అనే తీవ్రమైన పరిస్థితితో బాధపడుతుందని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా, గత సంవత్సరం పార్లమెంటు శీతాకాల సమావేశాలు నవంబర్ 25 నుండి డిసెంబర్ 20 వరకు జరిగాయి. ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో సహా 12 రాష్ట్రాలు , కేంద్రపాలిత ప్రాంతాలలో ఎన్నికల కమిషన్ రెండవ దశ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఓటరు జాబితాలను ప్రారంభించింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ రెండవ దశ ఈనెల 4న గణన స్థితితో ప్రారంభమైంది, డిసెంబర్ 4 వరకు కొనసాగుతుంది. డిసెంబర్ 9న ఇసి ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తుంది. తుది ఓటర్ల జాబితాను ఫిబ్రవరి 7న ప్రచురించబడుతుంది.

## రోడ్ల నిర్మాణం
(మొదటి పేజీ తరువాయి)

వరకు ఉన్న హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని 8 లైన్లు రహదారిగా విస్తరించనున్నాం అని ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగు లైన్లుగా ఉన్న జాతీయ రహదారిని ఎనిమిది లైన్లుగా విస్తరిస్తున్నాం అన్నారు, ఇందులో ఆరు లైన్లు ప్రధాన రహదారి కాగా రెండు సర్వీసు రోడ్ల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. రహదారి వెంట ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం, రోడ్డు ప్రమాదాలు నివారించడమే లక్ష్యంగా సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.10,400 ఖర్చు చేయనున్నట్టు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర గతిని మార్చే రీజనల్ రింగ్ రోడ్డు ( త్రిబుల్ ఆర్) నిర్మాణానికి రూ.36,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆరు లైన్లుగా నిర్మించబోతున్న రీజినల్ రింగ్ రోడ్డు అన్ని జిల్లాలను కలుపుతుందని వివరించారు. ఈ రహదారి నిర్మాణానికి 50 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. రహదారులు లేని గ్రామీణ ప్రాంతాల్లో కొత్త రోడ్ల నిర్మాణం.

సింగిల్ రోడ్డు ఉన్నచోట డబుల్ రోడ్ల నిర్మాణం.హెచ్ఎఎం ప్రాజెక్టుకు రూ.11,399 కోట్లు.. కొద్ది రోజుల్లో టెండర్లు పిలుస్తున్నాం అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని రహదారుల నిర్మాణానికి అనుమతులు ఇస్తామన్నారు. వీటితో పాటుగా అదనంగా మరో 28 వేల కోట్లతో చేపట్టనున్న పనులు ప్రతిపాదనలో ఉన్నాయని మంత్రి వెంకటరెడ్డి తెలిపారు.

**రూ.8,000 కోట్లతో..**

మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు 52 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు తుది దశకు చేరాయి అన్నారు. దేశానికే తలమానికంగా మారనున్న ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే. 20 వేల కోట్లతో నిర్మించనున్న ఈ రహదారి నిర్మాణంతో రాష్ట్ర ముఖచిత్రమే మారుతుందనీ తెలిపారు. భవిష్యత్తులో రహదారులపై ప్రమాదాలు జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. న భూతో న భవిష్యత్తు అన్న రీతిలో రహదారుల నిర్మాణానికి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నల్గొండ నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు.

ఈ పనులకు సంబంధించి ప్రతి 15 రోజులకు ఒకసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు అని తెలిపారు. ముఖ్యమంత్రి, ఒక ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లిన ప్రతి సందర్భంలోను రహదారులకు సంబంధించిన అంశాలపై సంబంధిత మంత్రులను కలిసి ఒత్తిడి తీసుకురావడం మూలంగా రహదారుల విషయంలో గొప్ప ప్రగతి కనిపించిందని మంత్రి వెంకటరెడ్డి తెలిపారు.

నా రాజకీయ జీవితంలో ఒక గొప్ప అవకాశాన్ని కల్పించిన అందరికీ ధన్యవాదాలు అని ప్రకటనలో పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌ను గెలిపించండి
(మొదటి పేజీ తరువాయి)

ప్రజల సార్వత్రిక ఓటింగ్ హక్కుకు భంగం కలిగిస్తున్నదని, బిజెపికి అనుకూలంగా లేని వారికి ఓటు హక్కు ను తిరస్కరిస్తున్నారని, ఇలాంటి అనేక అంశాలతో కుట్రలపై ఆధారపడి అధికారం నిలబెట్టుకునేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కూడా బిజెపి దానికి అనుకూలంగా వివరిస్తున్న బిఆర్ఎస్ ను ఓడించాలని ప్రజలను కోరారు.

**మోదీ వైఖరి గర్హనీయం**

పాకిస్థాన్‌తో భారత్ యుద్ధాన్ని తామే ఆపామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నప్పటికీ భారత ప్రధాని మోదీ దానిని ఖండించకపోవడమే కాకుండా కనీసం స్పందించకపోవడం గర్హనీయమని కూనంనేని సాంబశివరావు అన్నారు.

దేశ విధానాలను ప్రభావితం చేస్తున్న ట్రంప్ ప్రకటనలతో తమకు సంబంధం లేదని ఎందుకు చెప్పడం లేదని, అమెరికా విధిస్తున్న టారిఫ్‌లకు వ్యతిరేకంగా మోడీ ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడడం లేదని ఆయన ప్రశ్నించారు. అమెరికా ట్రంప్ కు వ్యతిరేకంగా మాట్లాడకపోవడం వ్యూహాత్మక ఎత్తుగడ అని బిజెపి ప్రచారం చేస్తుందని, అసలు ఆ ఎత్తుడగ ఏమిటో వెల్లడించాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ మౌనం గతంలో భారత్ ఏర్పాటు చేసుకున్న విదేశాంగ విధానాలను, సాంప్రదాయాలను, పద్ధతులను మంటగలుపుతున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో వైపు అమెరికాలో భారత విద్యార్థుల భవిష్యత్తును ట్రంప్ ఆగమాగం చేస్తున్నా మోదీ మాట్లాడడం లేదని విమర్శించారు. న్యూయార్కులో సోషలిస్టు భావజాలం కలిగిన జోహరాన్ మమ్దానీని ఓడించాలని ట్రంప్‌తో పాటు బిల్ క్లింటన్ లాంటి వారు కూడా ప్రయత్నించినప్పటికీ, జాతి అహంకారానికి, దేశ, ప్రాంతీయ అహంకారానికి వ్యతిరేకంగా న్యూ యార్క్ మేయర్‌గా మమ్దానీ గెలవడం ద్వారా మంచిని గెలిపిస్తారని అక్కడి ప్రజలు రుజువు చేశారన్నారు.

**15 నుంచి సిపిఐ జాతాలు**

సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఈనెల 15వ తేదీ నుంచి మూడు జాతాలను వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు సాంబశివరావు చెప్పారు. జోడేఘాట్ జాతాకు సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు, కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, బాసర జాతాకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా, గద్వాల్ జాతాకు సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహా నాయత్వం వహిస్తారని వివరించారు. అనంతరం 'ఇంటింటికి సిపిఐ' కార్యక్రమంలో భాగంగా జిల్లాల వారీగా జాతాలనుర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

**మావోయిస్టులకు విజ్ఞప్తి**

''కొంతమంది మావోయిస్టులు మంచి ఉద్దేశంతో లొంగిపోతున్నారు. ఇది మంచి సమయం. ఇప్పటికీ మావోయిస్టుల పట్ల ప్రజల కు అభిమానం ఉంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ, అనంతరం పునర్ విమర్శ చేసుకుని సాయుధ పోరాటాన్ని విరమించింది. అనంతరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టులను అత్యంత భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించారు. మావోయిస్టులు కూడా మంచి ఆలోచన చేసి సాయుధ పోరాటాన్ని విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. మావోయిస్టుల త్యాగాలు వృథా కావద్దు. కమ్యూనిస్టులందరూ కలిస్తేనే దేశానికి ప్రత్యామ్నాయం చూపగలుగుతాం'' అని కూనంనేని సాంబశివరావు అన్నారు.

**కమ్యూనిస్టుల ప్రాధాన్యత పెరుగుతున్నది**

దేశంలో,ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రాధాన్యత నిత్యం పెరుగుతున్నదని, నేపాల్ లో 11 కమ్యూనిస్టు పార్టీలు ఒకటయ్యాయని, ఇది భారత్‌కు మంచి సంకేతమని, భారతదేశంలో కూడా అలాంటి పరిస్థితి రావాలని కోరుకుంటున్నామని కూనంనేని సాంబశివరావు అన్నారు. శ్రీలంకలో, అమెరికా ఉప ఖండంలోని అనేక దేశాలలో కమ్యూనిస్టులు, వామపక్షాలు అధికారంలోకి వచ్చాయన్నారు. ప్రజలు వామపక్షాల వైపు ఉన్నారని, ప్రపంచంలోని మూడవ వంతు దేశాలలో వామపక్షాలు,కమ్యూనిస్టు జండాలు ఎగురుతున్నాయి.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మూడో మహాసంగ్రామం ప్రసక్తేలేదు
### 'ముఖాముఖి'లో జయప్రకాశ్ నారాయణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వేగంగా మారుతున్న ప్రపంచ పరిణామా లు మూడో మహా సంగ్రామానికి దారితీస్తాయన్న వాదనను లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ తిరస్కరించారు. సామాజిక విశ్లేషకులు, మోటివేషనల్ స్పీకర్ సుంకవల్లి సత్తిరాజు శనివారం హైదరాబాద్‌లో డా.జయ ప్రకాశ్ నారాయణ్‌తో ముఖాముఖి నిర్వహించారు. ఏడు రెట్లు అధిక జిడిపి కలిగి, ఆయుధ సంపత్తిలో అ గ్రగామిగా ఉన్న అమెరికా , భారత్‌ను దెబ్బతీయడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నదన్న సుంకవల్లి ప్రశ్నకు జయప్రకాశ్ నారాయణ్ సమాధాన మిస్తూ, డోనాల్డ్ ట్రంప్ నిలకడ లేని, చాదస్తపు వైఖరిని గురించి భారత్ పట్టించుకోనవసరం లేదన్నారు. భారత్ అనవసరమైన విషయాల జోలికి పోకుండా ఆర్థికంగా బలోపేతం కావడానికే ప్రయత్నించడం ఉత్తమమన్నారు. వ్యవసాయ రంగం,రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, భారత దేశంలో ఆహారభద్రత సమస్య తలెత్తబోదని వివరించారు. ఈ సందర్భంగా సుంకవల్లి సత్తిరాజు రాసిన 'అవనికి ఊపిరి అరణ్యమే' అనే ఒక దినపత్రికలోని ముఖచిత్ర కథనాన్ని పరిశీలించారు.

# అన్ని వర్గాలకు అభివృద్ధిలో భాగస్వామ్యం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలి

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లౌకికవాద పునాదులపైన కాంగ్రెస్ పార్టీ ఏర్పడిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా శనివారం క్రైస్తవ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ సమాజం కోసం పని చేస్తున్న 'ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని' ఆశీర్వదించేందుకు క్రైస్తవ ప్రతినిధులు ముందుకురావడం శుభ పరిణామమని అన్నారు. పేదరికంలో ఉన్న ప్రతి వ్యక్తి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు,వారిని ముందుకు నడిపించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను పెద్ద మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత అందరి పైనా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి నాయకత్వంలోని క్యాబినెట్ మొత్తం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ సమాజ హితం కోసం ప్రజా ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. సమాజానికి సంబంధించి ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని భట్టి భరోసానిచ్చారు.



## తెలంగాణాలో బిజెపి సత్తా ఏమిటో చూపిస్తాం



### కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :**'ఆట ఇంకా మొదలు కాలేదు .. రానున్న రోజుల్లో ఆట మొదలు పెట్టినప్పుడు తానేంటో చూపిస్తానని, బిఆర్ఎస్, కాంగ్రెస్ కాళ్ల కింద భూమి కదలాలి' అని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణలో బిజెపి సత్తా ఏమిటో చూపిస్తాం అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రం తెలంగాణ అభివృద్ధికి పనిచేస్తోందని, రేవంత్ రెడ్డి, కెసిఆర్‌లకు ధైర్యం ఉంటే కేంద్రం ఇచ్చిన ప్రాజెక్టులు, నిధులపై బహిరంగ చర్చకు రండి అని సవాల్ విసిరారు. కెటిఆర్, కిషన్‌రెడ్డిని ఉద్దేశిస్తూ బ్యాడ్ బ్రదర్స్ అంటూ సిఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కూడా కేంద్రమంత్రి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎవరు ఎవరికి బ్రదర్స్ అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పెద్ద బ్రదర్ కెసిఆర్, తర్వాత చిన్న బ్రదర్ హరీశ్ రావు అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి, కెసిఆరే బ్యాడ్ బ్రదర్స్ అని, వారిద్దరు రాష్ట్రానికి పట్టిన శాపం అని మండిపడ్డారు. తెలంగాణను మద్యం, అవినీతి, అబద్ధాలతో నడిపించే ఈ బ్యాడ్ బ్రదర్స్‌కు ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారు అని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలకే తాము బ్రదర్స్ అని చెప్పుకొచ్చారు. కెసిఆర్, రేవంత్ రెడ్డి, ఓవైసీ ఈ ముగ్గురు కలిసి తెలంగాణను మోసం చేశారని ఆరోపించారు. మజ్లీస్ ఆదేశాలు పాటించే ప్రభుత్వం ఇప్పుడు కూడా కాంగ్రెస్సే అన్నారు. పేదల ఇళ్లు కూల్చి, నేతల భవనాలను వదిలేస్తున్నారని ఆరోపించారు. మూసీ పేరుతో పేదల గూడు కూల్చితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పాలన ఏవిధంగా ఉందో రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. వాళ్ల కన్నెర్ర చేస్తే ఆ రెండు పార్టీల పునాదులు కదులుతాయన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తే భయపడను అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ ఫేక్ ఫొటోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ఓటమి భయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజెపి, ప్రధాని మోదీపై అబద్ధపు ప్రచారానికి దిగుతున్నారని విమర్శించారు. తెలంగాణ బిడ్డలు బలిదానం చేసింది కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కాదా అని ప్రశ్నించారు. బలిదానం చేసుకున్నది కెసిఆర్ కుటుంబానికి బానిసలుగా ఉండటం కోసం కాదన్నారు. తెలంగాణ ప్రజలు అసలైన మార్పు కోరుకున్నారన్నారు.

## బిసివాదం బలోపేతానికి నవీన్‌కు మద్దతు
### కాంగ్రెస్ ప్రతినిధుల బృందంతో చిరంజీవులు, బాల్‌రాజ్ గౌడ్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** బిసి వాదాన్ని బలపరచడంలో భాగంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతు ఇస్తున్నట్టు బిసి ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ టి.చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షులు బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ స్పష్టంచేశారు. నవీన్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు, ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నేత డాక్టర్ వినయ్‌కుమార్‌లు కలిసి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని శనివారం హైదరాబాద్‌లోని బిసి ఇంటెలెక్చువల్ ఫోరం కార్యాలయంలో చిరంజీవులు, బాల్‌రాజ్‌గౌడ్‌లను కోరారు. ఈ సందర్భంగా చిరంజీవులు, బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానితో చర్చించి, పార్లమెంటులో బిసి బిల్లు పెట్టేందుకు కృషిచేయాలని కోరారు. కామారెడ్డి డిక్లరేషన్ హామీల అమలుకు చొరవ చూపాలని కాంగ్రెస్ ప్రతినిధుల బృందానికి విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లను కాంగ్రెస్ అధిష్టానానికి దృష్టికి తీసుకెళ్తామని పార్టీ నేతలు తెలిపారు. నవీన్ యాదవ్ గెలుపునకు బిసిలంతా కృషిచేయాలని కోరారు. ఈ భేటీలో బిసి పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, ఎస్ దుర్గయ్య గౌడ్, అంబాల నారాయణ గౌడ్, యెలికట్టె విజయ్ కుమార్ గౌడ్, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం నేతలు చామకూర రాజు ,కెవి గౌడ్,ఎర్రమాద వెంకన్న ,రాపోలు జ్ఞానేశ్వర్ ,ఒంటెద్దు నరేందర్ ,అవ్వారు వేణు తదితరులు పాల్గొన్నారు.



# చలో ఖమ్మం
## సిపిఐ శతవార్షికోత్సవ మహోత్సవం
**26 డిసెంబర్ - ముగింపు సభ**

CENTENARY OF STRUGGLES & SACRIFICES

## ఆర్థిక సహాయం అందించిన దాతలు

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ జరగనున్న విషయం విదితమే. ఇది ఖర్చుతో కూడుకున్న కార్యక్రమం. దీని కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సభ్యులు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున విరాళాలను అందజేశారు. ఇప్పటి వరకూ ఖమ్మం జిల్లా కార్యాలయానికి అందిన వివరాలను తెలియజేస్తున్నాం.

| | |
|---|---|
| 1. మహ్మద్ మౌలానా | రూ.1,00000 |
| 2. బాగం హేమంతరావు | రూ.1,00000 |
| 3. దండి సురేష్ | రూ.1,00000 |
| 4. పుచ్చకాయల కమలాకర్ | రూ.1,00000 |
| 5. కొండపర్తి గోవిందరావు | రూ.1,00000 |
| 6. పోటు సక్కుబాయమ్మ | రూ.10,000 |
| 7. ఏపూరి లతాదేవి | రూ.1,00000 |
| 8. కూనంనేని భరత్ | రూ.1,00000 |
| 9. హనుమంతు రాము | రూ.1,00000 |
| 10. ఎస్‌కె జానిమియా | రూ.1,00000 |
| 11. ఎస్‌కె సాబీర్‌పాషా | రూ.1,00000 |
| 12. ముత్యాల విశ్వనాథం | రూ.1,00000 |
| 13. వాసిరెడ్డి మురళి | రూ.1,00000 |
| 14. బాగం మాధవరావు | రూ.1,00000 |
| 15. నహింఖురేషి | రూ.1,00000 |
| 16. ఉదయ్ భాస్కర్ | రూ.1,00000 |
| 17.ఎండి అబీద్ హసల్ | రూ.1,00000 |
| 18. వట్టికొండ మల్లికార్జునరావు | రూ.1,00000 |
| 19. అడుసుమల్లి సాయిబాబు | రూ.1,00000 |
| 20. ఏపూరి రవీంద్రబాబు | రూ.1,00000 |
| 21.మిడికంటి వెంకటరెడి | రూ.1,00000 |
| 22.కర్నాటి భానుప్రసాద్ | రూ.1,00000 |
| 23.రావెళ్ల వాసు | రూ.1,00000 |
| 24. లింగా వెంకటనారాయణ | రూ.1,00000 |
| 25. వాసిరెడ్డి సీతారామయ్య | రూ.1,00000 |
| 26. డాక్టర్ పారుపల్లి గోర్కి | రూ. 2,00000 |
| 27. వెంపటి సురేందర్ | రూ.1,00000 |
| 28. ఆళ్ల రవీందర్ | రూ.50,000 |
| 29. కొల్లి సీతయ్య | రూ.50,000 |
| 30. కొల్లి శ్రీనివాస్ | రూ.50,000 |
| 31. తోట రామాంజనేయులు | రూ.25,000 |
| 32. గడల భాస్కర్ | రూ. 25,000 |

### విరాళాలను సేకరించి కార్యాలయంలో జమ చేసిన వారు

| | |
|---|---|
| 1. బిజి క్లెమెంట్ (కార్పొరేటర్) | రూ. 2,00000 |

### సిపిఐ నగర సమితి ఖమ్మం

| | |
|---|---|
| (ఎస్‌కె జానిమియా, మహ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్ ద్వారా ) | రూ. 2,00000 |
| 3. ఖానాపురం హవేలీ శాఖ (ఏనుగు గాంధీ, నానబాల రామకృష్ణ, జాకీర్, ఉపేందర్‌ల ద్వారా) | రూ.1,00000 |

### చింతకాని మండలం

| | |
|---|---|
| 1. దూసరి గోపాలరావు | రూ.30,000 |
| 2. జమ్ముల జితేందర్‌రెడ్డి | రూ. 37,000 |
| 3. పావులూరి మల్లికార్జున్ | రూ. 25,000 |

### కొణిజర్ల మండలం ...

| | |
|---|---|
| 1. దొండపాటి రమేష్, స్వర్ణ రమేష్ | రూ.50,000 |
| 2. తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు | రూ. 20,000 |
| 3. యామాల గోపాలరావు (వైరా) | రూ.10,000 |
| 4. మిడికంటి వెంకటరెడ్డి (ఖమ్మం రూరల్) | రూ.2,50,000 |
| 5. బట్టు బాబు (ఖమ్మం రూరల్) | రూ. 35,000 |
| 6. కూచిపూడి రవి (చింతకాని) | రూ.50,000 |
| 7. బెజవాడ రవిబాబు (మధిర) | రూ.30,000 |
| 8. యర్రాబాబు (వైరా) | రూ.25,000 |
| 9. తోట రామాంజనేయులు (ఏఐటియుసి) | రూ.23,500 |
| 10. శింగు నర్సింహారావు (ఏఐటియుసి) | రూ. 16,000 |
| 11. సిహెచ్ సీతామహాలక్ష్మి (ఏఐటియుసి) | రూ.10,000 |
| 12. రామాంజనేయులు, ఆనందరావు (బోనకల్) | రూ.7,500 |
| 13. ఇటికాల రామకృష్ణ (ఏఐఎస్ఎఫ్) | రూ.6,000 |

**- కోశాధికారి, ఆహ్వాన సంఘం**

# సిఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జన్మదిన సందర్భంగా పలువురు రాజకీయ, సినీ ప్రముఖు లు శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో ఉండాలని, మరిన్ని సంవత్సరాలు ప్రజా సేవ చేయాలని పలువురు ఆకాంక్షించారు. పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డికి ఆయన నివాసంలో యాదగిరిగుట్ట అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సిఎం రేవంత్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు.

### ప్రముఖుల శుభాకాంక్షలు

సిఎం రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ, ఆయనకు ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదిక ద్వారా జన్మదినశుభాకాంక్షలు తెలిపారు. ఎఐసిసి అగ్రనేత, లోక్‌సభ లో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సిఎంకు ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎపి ముఖ్యమంత్రి చంద్రబా బు, కర్నాటక సిఎం సిద్దారామయ్య, పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ, తమిళనాడు సిఎం స్టాలిన్, లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా, తె లంగాణ గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ, కేంద్ర మం త్రులు కింజారపు రాంమోహన్ నాయుడు, బండి సంజయ్, డిప్యూటీ సిఎం డి.కె.శివకుమార్, ఆంధ్రప్రదేశ్ ఐటి డిప్యూటీ సిఎం పవ న్ కల్యాన్, ఎపి మంత్రి నారా లోకేశ్, ఎంపి ఈటల రాజేందర్ తదితరులు సిఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే సినీ ప్రముఖులు చిరంజీవి, నందమూరి బా లకృష్ణ, మహేష్‌బాబు, జూనియర్ ఎన్‌టిఆర్, రాంచరణ్, డైరెక్టర్ అనిల్ రావిపూడి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

### సిఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, కాంగ్రెస్ ముఖ్యనేతలు

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, స్పీకర్‌గడ్డం ప్రసాద్ కు మార్, రాష్ట్ర మంత్రులు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, గడ్డం వివేక్, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దనసరి అనసూయ సీతక్క, కొండాసురేఖ, జూపల్లి కృష్ణారావుతో పాటు ఎంపిలు, ఎంఎల్‌ఎలు , కాంగ్రెస్ ముఖ్యనాయకులు శుభాకాంక్షలు తెలిపారు.













సిఎం సోదరుడు తిరుపతి రెడ్డి కుమార్తె వివాహ వేడుకకు హాజరైన సందర్భంగా ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి , సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

## మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కళారూపాలుండాలి
### సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ వందేళ్ల చరిత్రను చాటిచెప్పడంతో పాటు ప్రజాసమస్యలపై సామాజిక స్పృహ, చైతన్యం కలిగించే కళారూపాలను రూ పొందించాలని పలువురు సిపిఐ నేతలు అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కళారూపాలు ఉండాలని, సిపిఐ వందేళ్ల చరిత్రను కళాకారుల ఆటలు, పాటలలో ప్రతిబింబించాలన్నారు. అరసం, తెలంగాణ ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల రాష్ట్ర స్థాయి కవులు, కళాకారుల వర్క్‌షాప్ శనివారం హైదరాబాద్ మఖ్దూంభవన్‌లోని రాజ్‌బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమైంది. వర్క్‌షాప్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిధులుగా ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ సీనియర్ నా యకులు చాడ వెంకట రెడ్డి పాల్గొన్నారు. కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తూ అసాధారణమైన సిపిఐ వందేళ్ల చరిత్రలోని ఆటుపోట్లు, ఒడుదుడుకులను, విజయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. మరోవైపు ప్రజల సమస్యలు, బాధలు, ఆవేదనలను కళాకారులు రచయితలు కళారూపాలుగా మలచడం ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సినీ తదితర రంగాలలో ప్రముఖులు ప్రజానాట్యమండలి, అరసంలో అక్షరాలు దిదినవారేనని గుర్తు చేశారు. సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ ప్రజా చైతన్యానికి కళలే ఊ పిరి అని, కళారూపాలలో అనునిత్యం నూతనత్వం ఉండాలని సూచించారు. చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ దేశంలో, సమాజంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఆక లింపు చేసుకుని కళారూపాలను రూపొందించాలన్నారు. డ్రగ్స్, గంజా య్, మద్యం అంశాలతో పాటు సా మాజిక రుగ్మతల నిర్మూళనకు కళాకారులు, రచయితలు తమ వంతు కృషి చేయాలన్నారు. ఒగ్గు కథలు, గేయాలు, నాటికల కు ఇంకా ప్రజలలో ఆదరణ ఉందని, వాటి ద్వారా ప్రచార కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అరసం అధ్యక్షులు పల్లేరు వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహా తదిలరుతు ప్రసంగించారు.

## బిసి కోటాపై ఢిల్లీకి అఖిల పక్షం
### బిసి హక్కుల సాధన సమితి డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం అసెంబ్లీలో చేసిన బిసి రిజర్వేషన్ల చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేరుస్తూ బిల్లు ఆమోదించే విధంగా తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపచేసే బాధ్యత రాష్ట్ర బిజెపియే తీసుకోవాలని బిసి హక్కుల సాధన సమితి డిమాండ్ చేసిం ది. సాధన సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివా రం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో జరిగింది. సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకటరాములు, ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రాయబండి పాండు రంగాచారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి, కార్యవర్గ సభ్యులు ఎల్.శ్రావణ్, వనం సత్యనారాయ ణ, పలనాటి యాదయ్య బొడ్డుపెల్లి కృష్ణ, దీటి నరసయ్య పాసికంటి లక్ష్మి నరసయ్య తదితరులు ప్రసంగించారు. వెంకటరాములు మాట్లాడుతూ అసెంబ్లీలో చేసిన బిసి చట్టానికి బిజెపి పార్టీ ఎంఎల్‌ఎలు మద్దతు ఇచ్చినందున మోదీ ప్రభుత్వంతో మాట్లాడి ఆ చ ట్టాన్ని 9వ షెడ్యూల్లో చేర్పించడానికి చొరవ చూపి రాష్ట్రంలో బిసిల సంక్షేమం పట్ల తమ చిత్తశుద్ధిని రు జువు చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో దేశవ్యా ప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టి సకల రంగాలలో బిసిల వాటా బిసిలకు ఇవ్వడానికి పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసే విధంగా బిసిహక్కుల సాధన సమితి ఉద్యమిస్తుందన్నారు. ధూళిపాళ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ అసెంబ్లీలో చట్టం చేసిన సిఎం రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా అన్ని రాజకీయ పార్టీలను బిసి సంఘాలను కలుపుకుని అఖిలపక్షాన్ని ప్రధానమంత్రి దగ్గరికి వెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లను తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడం ఒక్కటే మార్గమన్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేయడం సిఎం, కాంగ్రెస్ పార్టీకి తగదని, బిసిలను మభ్యపెట్టడమే అవుతుందన్నారు.

## ప్రతీ కార్యకర్తా కష్టపడాలి
### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సం ఘం (బికెఎంయు) రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం కలకొండ కాంతయ్య అధ్యక్షతన శనివారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని రాజ్‌బహదూర్‌గౌర్ విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ స మావేశానికి ముఖ్య అతిధిగా వచ్చిన కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మంలో 5 లక్షల మందితో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం సమావేశాలు అన్ని జిల్లాల్లో నిర్వహించుకొని గ్రామస్థాయి వరకు ప్రచారం తీసుకువెళ్లాలన్నారు. 40 రోజులపాటు ప్రతి ఒక్క నాయకులు , కా ర్యకర్తలు అందరూ కూడా కష్టపడి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట రాములు, సృజన్ కుమార్ చింతకుంట్ల వెంకన్న, బొద్దుల జంగయ్య , యేసయ్య, అక్కే పెల్లి బాబు, లక్ష్మ ణ్, శ్రావణ్ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## వందల డ్రోన్లు,క్షిపణులతో ఉక్రేన్‌పై రష్యాదాడి : ఆరుగురు మృతి

**కీవ్:** ఉక్రేన్ ఇంథన మౌలిక నిర్మాణాలు, నివాసిత ప్రాంతాలపై వందలాది డ్రోన్లు, క్షిపణులతో రష్యా చేసిన దాడుల్లో ఆరుగురు మరణించారు. జాపోరిఝియాలో డ్రోన్లు పడటంతో ముగ్గురు మరణించారు. మొత్తంగా మరో 12 మంది గాయపడ్డారు. 450 ఎక్స్‌ప్లోడింగ్ బాంబర్ డ్రోన్లు, మరో 45 క్షిపణులను రష్యా ప్రయోగించిందని, 406 డ్రోన్లను కూల్చివేసినట్లు ఉక్రేన్ తెలిపింది. శనివారం తెల్లవారకముందే వందలసంఖ్యలో క్షిపణలు, డ్రోన్లతో ఉక్రేన్‌పై రష్యా దాడులు పూర్తిచేసింది. కీవ్ నగరంతో సహా మొత్తం 25 ప్రాంతాలపై ఉక్రేన్‌లో క్షిపణి, డ్రోన్ దాడులు జరిగాయి. ఈ దాడులతో ఉక్రేన్‌కు అపార నష్టం కలిగింది. అనేక ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు ఉక్రేన్ ప్రధానమంత్రి యూలియా స్విరిడెంకో టెలిగ్రామ్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. అదేవిధంగా రష్యా కూడా ఒక ప్రకటన చేస్తూ ఉక్రేన్ పెద్ద సంఖ్యలో రష్యాపై డ్రోన్లు ప్రయోగించిందని, వీటిల్లో 79 డ్రోన్లను కూల్చివేశామని తెలిపింది.

## నేడు ఉపఎన్నిక అభ్యర్థుల రిజిస్టర్ల తుది తనిఖీ

### ఎన్నికల వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల వ్యయ రిజిస్టర్ల తుది తనిఖీ ఈనెల 9వ తేదీన జరుగనుంది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు షేక్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఈ తనిఖీ చేపడతారని ఎన్నికల వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్, వ్యయ మానిటరింగ్ నోడల్ అధికారి వెంకటేశ్వర రెడ్డి, సహాయ పరిశీలకులు జి. రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు తప్పకుండా తమ రోజువారీ ఖర్చుల రిజిస్టర్లను తనిఖీ చేయించుకోవాలని సూచించారు. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఓట్ల లెక్కింపు వరకు రూ.10 వేలకు పైగా వ్యక్తిగతంగా లేదా సంస్థల ద్వారా నగదు లావాదేవీలు జరపకూడదని, అన్ని లావాదేవీలు చెక్కుల రూపంలోనే ఉండాలన్నారు. ఇప్పటికే అక్టోబర్ 28న తొలి విడతగా, నవంబర్ 3న రెండో విడతగా అభ్యర్థుల రిజిస్టర్ల తనిఖీ పూర్తయినట్లు పరిశీలకులు వెల్లడించారు. ఈ తనిఖీ తుది విడతగా ఉంటుందని స్పష్టం చేశారు.



## బిజెపి, బిఆర్‌ఎస్‌లను ఓడించండి

### ఉప ఎన్నిక ప్రచారంలో ఈటి నరసింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో షేక్‌పేట్ డివిజన్‌లో బస్తీలలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అందిస్తున్న 6 గ్యారంటీలు, ప్రజాపాలన అభ్యర్థి నవీన్ యాదవ్ పట్ల ప్రజలంతా సానుకూలంగా స్పందిస్తున్నారు. 10 ఏళ్ల జూబ్లీహిల్స్ నియోజకవర్గం విధ్వంసం చేసిన బిఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించండి అని ఓటర్లను విజ్ఞప్తి చేస్తూ ఈ.టి. నరసింహ ప్రచారం కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ పాల్గొన్నారు.

## సచివాలయం తెలంగాణ షాన్

### మాజీమంత్రి హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సచివాలయం ఎందుకు నిర్మించామో సిఎంకు అర్థం కాదని, తెలంగాణకు నూతన సచివాలయం ఒక షాన్ అని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు అడిగినందుకు ప్రైవేట్ కళాశాలలపైన దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ. 3,600 కోట్ల బకాయిలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని సిఎం చెబుతున్నారని, దీనిపైన రేవంత్ రెడ్డి? చర్చకు సిద్ధామా అని సవాల్ విసిరారు. మొత్తంగా రూ. 8వేల కోట్లకుపైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద కాంట్రాక్టర్లకు విడుదల చేసిన బిల్లులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డిఎలు పెండింగ్‌లో ఉన్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను బ్లాక్ మెయిల్ చేసి భయపెడుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి మధ్య ఫెవికాల్ బంధం ఉందన్నారు. 2023లో రెండు కోట్ల 73 లక్షల టన్నుల వరి ధాన్యము ఉత్పత్తి జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలాల్లో పూడిక తీయకపోవడం వల్లనే బస్తీలో నీళ్లు వచ్చి ఇల్లు మునిగిపోయాయని ఆరోపించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల పై సిఎంది ఊకదంపుడు ఉపన్యాసమే తప్ప ఏమీ లేదన్నారు.

## సిఎం రేవంత్ మానసిక పరిస్థితి దెబ్బతిన్నది : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం మానసిక స్థితి దెబ్బతిన్నట్టుగా ఉన్నదని, అందుకే సందర్భం లేకుండా మాట్లాడుతున్నారని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి అన్నారు. నిఘా పెట్టడానికి అప్పటి కెసిఆర్ కమాండ్ కంట్రోల్‌ను నిర్మిస్తే, ఇందులో రేవంత్ కూర్చొని తమపైన నిఘా పెడుతున్నారా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రగతి భవన్‌లో బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు ఉంటే చూపించాలన్నారు.హైదరాబాద్ అభివృద్ధి అజెండాపైనే జూబ్లీహిల్స్ ప్రజలు ఓటు వేయబోతున్నారన్నారు. ప్రైవేటు కళాశాల యాజమాన్యాలను ఎన్ని రోజులు భయపెడతారని, సిఎం రేవంత్ రెడ్డికి భయం మొదలైందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాత రేవంత్ రెడ్డి పదవికి ఉపద్రవం వస్తుందన్నారు. కిషన్ రెడ్డి,రేవంత్ రెడ్డి ఇద్దరూ పదవుల్లో ఉన్నావారని, వారిద్దరే బ్యాడ్ బ్రదర్స్ అని అన్నారు. కిషన్ రెడ్డి,రేవంత్ రెడ్డి ఇద్దరూ మోదీ శిష్యులేనని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి,హైదరాబాద్ అభివృద్ధి బాధ్యతను రేవంత్ రెడ్డి,కిషన్ రెడ్డి, బండి సంజయ్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాగంటి గోపీనాథ్ తల్లితో ఎవరు మాట్లాడుతున్నారో అందరికీ తెలుసని జగదీశ్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ మాజీ ఎంపి లింగయ్య యాదవ్, ,మాజీ ఎంఎల్‌ఏలు పైళ్ల శేఖర్ రెడ్డి ,గాదరి కిషోర్ కుమార్ ,బూడిద భిక్షమయ్య గౌడ్ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో పోలీసు ఆంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉప ఎన్నిక నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో ఆంక్షలు విధిస్తూ హైదరాబాద్ పోలీసు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.సి సజ్జనార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమలవుతాయని సజ్జనార్ పేర్కొన్నారు. కౌంటింగ్ సందర్భంగా నవంబర్ 14వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 15వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. శాంతి, భద్రత కోసం జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో బిఎన్‌ఎస్‌ఎస్ 163 సెక్షన్ అమల్లో ఉండనున్నట్లు చెప్పారు. ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది ఒక్కచోట గుంపుగా ఉండొద్దని సూచించారు. పోలింగ్ కేంద్రాల నుంచి 200 మీటర్ల వరకు ఈ రూల్ వర్తిస్తుందని తెలిపారు. ఈ నిర్దేశించిన సమయాల్లో నియోజవర్గంలో పరిధిలోని లిక్కర్ షాపులు, రెస్టారెంట్లు, క్లబ్బులు మూసివేయాలని ఆదేశించారు. జూబ్లీహిల్స్ సెగ్మెంట్ పరిధిలో ఎవ్వరూ బాణాసంచా పేల్చొద్దని ఆదేశించారు.

# ముక్కోణపు పోటీలో విజేత ఎవరో ?

## జూబ్లీహిల్స్‌లో నేటి సాయంత్రం ప్రచారం పరిసమాప్తం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం తుది అంకానికి చేరుకుంది. నేటి సాయంత్రంతో ప్రచార పర్వం పరిసమాప్తం కానుంది. ఇక్కడ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు పోటీపడుతున్నాయి. ముక్కోణపు పోటీలో ఎవరు విజయం సాధిస్తారనే విషయం ఆసక్తికరంగా మారింది. ఈ స్థానంలో గెలుపు, ఓటములపై రకరకాల ఊహాగానాలు శికార్లు చేస్తున్నాయి. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి ఎజెండాగా ముందుకు సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ యాదవ్ బరిలో నిలిచారు. నవీన్ యాదవ్ స్థానికుడు కావడంతో పాటు గతంలో ఎంఐఎం తరఫున పోటీ చేసిన అనుభవం కూడా ఉంది. దీనికి తోడు అధికార పార్టీ కూడా కావడం అదనపు బలంగా ఉంది. బిఆర్‌ఎస్ తరపున ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పోటీలో



ఉన్నారు. గోపీనాథ్ మృతి చెందడంతో సెంటిమెంట్ కలిసొస్తుందని బిఆర్‌ఎస్ భావిస్తోంది. అలాగే బిజెపి నుంచి లంకల దీపక్ రెడ్డి తలపడుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రిపీట్ అవుతాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీపక్ రెడ్డి గతంలో ఇక్కడ పోటీ చేసి 25 వేల పైచిలుకు ఓట్లు పొందారు. ఈ ముగ్గురు కూడా హోరాహోరిగా ప్రచార పర్యంలో మునిగి తేలుతున్నారు. జూబ్లీహిల్స్ ఓటర్లు 4,01,365 మందిగా తేలారు. అందులో 2,08,561 మం ది పురుషులు, 1,92,779 మంది మహిళలు, 25 మంది ఇతరులు ఉన్నారు. 139 పోలింగ్ స్టేషన్లలో 407 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో కనీసం 986 మంది ఓటర్లున్నారు. 1200 మంది ఓటర్లకు పైగా 11 పోలింగ్ కేంద్రాలుండగా అత్యల్పంగా 263 పోలింగ్ స్టేషన్‌లో 540 మంది ఓటర్లు.. అత్యధికంగా 9 వ నంబర్ పోలింగ్ స్టేషన్లో 1233 మంది ఓటర్లున్నారు. ఇక్కడ ప్రతి ఎన్నికల్లోనూ యాభై శాతానికి కొంచం అటు ఇటుగా పోలింగ్ నమోదవుతోంది. ఈ సారి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అటు రాజకీయ పార్టీలు, ఇటు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.



## శ్యామలకుంటలో సిఎం బర్త్‌డే వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమం, ప్రజాపాలనకు ప్రతీకగా నిలుస్తున్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ప్రతినిత్యం ప్రజాసేవలో నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజల ఆశీర్వాదాలతో గడపాలని కాంగ్రెస్ నేత కంజర్ల విజయలక్ష్మి యాదవ్ అన్నారు. తెలంగాణలో సిఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం సనత్‌నగర్ డివిజన్ శ్యామలకుంటలో కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడి కేంద్రంలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకల్లో మంత్రి అజారుద్దీన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కోట నీలిమతో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 375 ఎలక్ట్రిక్ వాహనాలు డెలివరీ చేసిన ఓజిఎల్

### రెండో త్రైమాసికంలో 25 శాతం వృద్ధితో రూ.656.62 కోట్ల ఆదాయం

### మొదటి అర్థ సంవత్సర ఫలితాలు వెల్లడించిన ఒలెక్ట్రా

**ప్రజాపక్ష/హైదరాబాద్:** భారతదేశంలో అగ్రగామి ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్టెక్ లిమిటెడ్ (ఓజిఎల్ ) ఈ ఏడాది రెండో త్రైమాసికంలో 375 వాహనాలను డెలివరీ చేసి రూ.656.62 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణ విమోచనకు ముందు రూ.93.01 కోట్ల ఆదాయం ఒలెక్ట్రా నమోదు చేసింది. పన్ను చెల్లింపునకు ముందు రూ.68.46 కోట్లు, పన్ను చెల్లింపు తరువాత రూ.49.43 కోట్ల ఆదాయం ఒలెక్ట్రా నమోదు చేసింది. ఓజిఎల్ ఈ ఏడాది సెప్టెంబర్ 30తో ముగిసిన రెండో త్రైమాసిక, అర్థ వార్షిక ఏకీకృత ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ శనివారం సమావేశమై ఈ ఫలితాలను ఆమోదించింది. ఒక త్రైమాసికంలో 375 వాహనాలు డెలివరీ చేసి కంపెనీ ఒక మైలురాయిని సాధించింది. అధిక డెలివరీలు, వినియోగదారుల నుంచి పెరుగుతున్న వాహన డిమాండ్ వల్ల ఇది సాధ్యమైంది. ఒలెక్ట్రా ఇప్పటి వరకు 3254 వాహనాలు డెలివరీ చేయటంతో పాటు 9818 వాహనాల ఆర్డర్ బుక్‌తో భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది వేసుకుంది. ఈ ఏడాది తొలి అర్థ సంవత్సరంలో ఒలెక్ట్రా రూ.1003.85 కోట్ల ఆదాయం సంపాదించింది. వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణ విమోచనకు ముందు రూ.148.98 కోట్ల ఆదాయం ఒలెక్ట్రా నమోదు చేసింది. పన్ను చెల్లింపునకు ముందు రూ.102.26 కోట్లు, పన్ను చెల్లింపు తరువాత రూ.75.46 కోట్ల ఆదాయం ఒలెక్ట్రా నమోదు చేసింది. ఈ సందర్భంగా ఒలెక్ట్రా మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్ బాబు మాట్లాడుతూ ఒక త్రైమాసికంలో అత్యధికంగా 375 ఎలక్ట్రిక్ వాహనాలు, అందులో 25 ఎలక్ట్రిక్ టిప్పర్లు విజయవంతంగా డెలివరీ చేయడం సంస్థకు గర్వకారణమన్నారు. ఆపరేషనల్ సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి సారించటం వల్ల ఆదాయంలో, లాభంలో గణనీయమైన వృద్ధి సాధించామన్నారు.



## నవీన్ యాదవ్ 50వేల మెజార్టీతో గెలవటం ఖాయం

### అఖిల భారత యాదవ మహాసభ

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 50 వేల మెజార్టీతో గెలవటం ఖాయమని అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీందర్ యాదవ్ అన్నారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నవీన్ యాదవ్ రౌడీషీటర్ అంటూ కెటిఆర్ మాట్లాడిన తీరును ఖండిస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 30 వేలకు పైగా యాదవుల ఓట్లు ఉన్నాయని... అందరూ నవీన్ యాదవ్ వెంటే ఉన్నారని తెలిపారు. చదువుకున్న విద్యావంతుడికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిందని , కానీ అగ్రకులాల పార్టీలు అతన్ని ఓడించేందుకు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. వారి కుట్రలను పటాపంచలు చేస్తూ నవీన్ భారీ మెజార్టీతో గెలుస్తారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మ ణ్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి రాగం నాగేందర్ యాదవ్, నేతలు కిరణ్ కుమార్ యాదవ్, యశ్వంత్ యాదవ్, విజయ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి పాటుపడే కాంగ్రెస్‌ను గెలిపించండి

### ప్రజలు, కార్మికవర్గానికి ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవ రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ప్రజా సంక్షేమానికి పాటుపడే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవ రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేసారు. కార్పొరేట్‌లకు కొమ్ముకాసే కార్మిక వ్యతరేకి బిజెపిని, తెలంగాణ రాష్ట్రాన్ని కొల్లగొట్టిన దోపిడీదారు బిఆర్‌ఎస్‌ను ఓడించాలన్నారు. హైదరాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు బి. జనక్ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.సత్యజిత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, నాయకులు త్యాగరాజన్, సమ్మయ్య, ఎల్.డి.పాల్‌లతో కలిసి డాక్టర్‌జి.సంజీవ రెడ్డి మాట్లాడారు. కార్మికుల సంక్షేమం, భద్రత కోసం అప్పటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం అనేక కార్మిక చట్టాలను తీసుకవచ్చిందని, దేశంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి లక్షలాదిమందికి ఉపాధి, ఉద్యోగ భద్రత కల్పించిందని గుర్తు చేసారు. నేడు తగిన ఉపాధిని కల్పించడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందని, ప్రైవేటైజషన్ పేరుతో ఉన్న ఉద్యోగాలను కొల్లగొట్టిందని, అభివృద్ధిని నిలిపివేసిందని, దేశంలో ఆర్థిక అశాంతిని సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బిఆర్‌ఎస్ ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ప్రాజెక్టుల నిర్మాణం పేరట వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందని, రాష్ట్ర ఖజానాను దోచుకున్న గజ దొంగలు కెసిఆర్ టీం అని అయన మండిపడ్డారు. హైదరాబాద్ జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో బీజేపీ, బిఆర్‌ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అయన కోరారు.



## కాంట్రాక్టర్లు, విద్యార్థుల నిధులపై శ్వేతపత్రం ఇవ్వాలి

### మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** రెండేళ్ల పాలనలో కాంట్రాక్టర్లకు, విద్యార్థులకు ఎంతెంత నిధులు కేటాయింపు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో తెలంగాణ బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నెల 15న నిర్వహించతలపెట్టిన ఫీజుపోరు వాల్‌పోస్టర్‌ను బిసి జెఎసి కో–ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి నందగోపాల్ తదితర నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల ఫీజుల బకాయిల కోసం అఖిలపక్ష విద్యార్థి సంఘాలు ఐక్యపోరుకు సిద్ధంగా ఉన్నాయన్నారు.ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీంను దుర్వినియోగం చేస్తున్నారని అంటున్న సిఎం రేవంత్‌రెడ్డి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రేవేట్ కళాశాల యాజమాన్యాలు డోనేషన్ల పేరుతో కోట్లు దోచుకుంటున్నారని సిఎం చేసిన వ్యాఖ్యలు నిజమే కావొచ్చునని, ఆ మాటలకు భయపడే యాజమాన్యాలు కళాశాలలను పునఃప్రారంభించాయని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. యాజమాన్యాలు బకాయిల పేరుతో విద్యార్థులను, సిబ్బందిని వేధిస్తే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నేతలు సంజయ్ (ఒయు), హరికృష్ణ (కేయూ), సాహిత్య (తెలంగాణ యూనివర్సిటీ ), పాపారావు (ఎంజి వర్సిటీ), జగదీశ్, రాహుల్, ప్రణీత్ పాల్గొన్నారు.

## రెడ్ జోన్‌లో ఢిల్లీ..!

### రాజధానిలో 400 మార్క్ దాటిన గాలి నాణ్యత..

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాణాలు (ఎక్యూఐ) ఆందోళన కలిగిస్తున్నాయి. శీతకాలం ఆరంభమవ్వడంతో శనివారం గాలి నాణ్యత ప్రమాణలు మరింతగా పడిపోయాయి. పలు ప్రాంతాల్లో తీవ్రమైన కాలుష్యం నమోదైందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు తెలిపింది. 24 గంటల్లో ఢిల్లీలోని గాలి నాణ్యత సగటును వెల్లడించిన సిబిసిబి ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత 400 దాటడం గమనించింది. దాంతో. దేశంలోనే అంత్యంత కలుషితమైన నగరాల్లో ఒకటిగా పేర్కొంది. ఇంకేముంది ఢిల్లీ సైతం రెడ్ జోన్‌లో చేరింది. అలానే ఎన్‌సిఆర్ పరిధిలో గ్రేటర్ నొయిడాలోనూ గాలి నాణ్యత 354, గజియాబాద్‌లో 339గా ఉన్నట్టు బోర్డు చెప్పింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు శనివారం సాయంత్రం 4 గంటలకు గాలి నాణ్యతను లెక్కించింది. ఆ సమయంలో 361 పాయింట్లు ఉన్నట్టు గుర్తించింది బోర్డు. దాంతో.. దేశంలోనే రెండో అత్యంత కలుషితమైన నగరంగా ఢిల్లీని పేర్కొంది. నగరంలోని 38 ప్రాంతాల్లో కాలుష్య తీవ్రతను అంచనా సిపిసిబి వేస్తోంది. శనివారం నమోదైన ఎక్యూఐని పరిశీలించగా.. వజీపూర్‌లో 420, బెరారిలో 418, వివేక్ విహార్‌లో 406, నెహ్రూ నార్‌లో 404, అలీపూర్‌లో 402 పాయింట్లు దాటినట్టు బోర్డు గుర్తించింది. ఈ ప్రాంతాలన్నీ అత్యంత ప్రమాదకరమైన దశలో ఉన్నాయని బోర్డుకు చెందిన సమీర్ యాప్ ఆందోళన వెలిబుచ్చింది.

**ఆఫీసు వేళల్లో మార్పులు**


నగరంలో గాలి నాణ్యత అంతకంతకూ పడిపోతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేఖా గుప్తా చర్యలకు తీసుకుంటున్నారు. వాహనాల రద్దీని తగ్గించడం కోసం ప్రభుత్వ ఆఫీసుల వేళలను మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. పర్యావరణ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం తర్వాత ప్రభుత్వ ఆఫీసుల వేళలు ఉదయం 10:00 నుంచి సాయంత్రం 6:30గా పనిచేస్తాయని సిఎం రేఖ తెలిపారు. ఇక మున్సిపల్ కార్యాలయాల పనివేళలను ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకుగా నిర్ణయించారు.

# కాలుష్య వాయువులు తగ్గించి వాతావరణ నిధి వాగ్దానం అమలు చేయండి

### 125 బి.డాలర్ల సేకరణే కాప్–30 లక్ష్యం


### ధనిక దేశాలకు భారత్ పిలుపు

**న్యూఢిల్లీ:** ప్రపంచ వాతావరణ కాలుష్య నియంత్రణ లక్ష్యాలు సాధించేందుకు కంకణం కట్టుకున్న బ్రెజిల్ దేశంతో భారత్ కూడా చేతులు కలిపింది. బ్రెజిల్‌లోని బెలంలో ఈనెల 10 నుండి కాప్–30 సదస్సు ప్రారంభం కానున్న తరుణంలో ముందుగా నాయకుల స్థాయిలో జరిగిన రెండు రోజుల సన్నాహక సదస్సులో భారతదేశ దౌత్యవేత్త దినేశ్ భాటియా ప్రసంగించారు. భూగోళ ఉష్ణోగ్రతలను తగ్గించుకోవాలని నిర్దేశించుకున్న పారిస్ ఒప్పందం కుదిరి పది సంవత్సరాలు పూర్తయినాగానీ ఆ లక్ష్యాలను నెరవేర్చుకోలేకపోయామని ఆయన అన్నారు. బ్రెజిల్ దేశం నిర్దేశించుకున్న లక్ష్యాలను తామూ ఆచరిస్తున్నామని భారత ప్రతినిధి చెప్పారు. కాలుష్య కారక వాయువులను తగ్గించుకోవడానికి అభివృద్ధి చెందిన దేశాలు సత్వరం చర్యలు తీసుకోవాలని, వాతావరణ నిధి సమకూర్చేందుకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుని కార్యాచరణకు అవకాశం కల్పించాలని పిలుపు ఇచ్చారు. భూగోళాన్ని వాతావరణ కాలుష్యం నుండి కాపాడుకోవాలనే లక్ష్యాలు పారిస్




ఒప్పందం కుదిరిన పదేళ్ళ తర్వాత కూడా అసంపూర్ణంగా మగిలిపోయినందువల్ల బ్రెజిల్ చేపట్టిన సరికొత్త టోపికల్ ఫారెస్ట్ గ్లోబల్ ఫండ్ (ఉష్ణమండల వర్షారణ్యాల సంరక్షణ ప్రపంచ నిధి)లో ఒక పరిశీలకదేశంగా భారతదేశం జత కలిసిందని దినేశ్ భాటియా చెప్పారు. ఈ ఉష్ణమండల వర్షారణ్యాలన్నీ 40నుండి 75 శాతం మేరకు అరుదైన వృక్షజాతులు, పుష్పించే మొక్కల జాతులకు, జీవజాలానికి ఆవాసంగా ఉంటాయి. వీటిని సంరక్షించడానికి, భావి తరాలకోసం కాపాడటానికి ప్రపంచ నిధి సేకరించాలని, జీవ వైవిధ్యాన్ని కాపాడి, కాలుష్య కారకాలను తగ్గించుకోవాలని బ్రెజిల్ ఇచ్చిన పిలుపులో పరిశీలకదేశంగా జత కలిసినట్లు ఆయన చెప్పారు. వాతావరణ రక్షణకోసం బ్రెజిల్ తీసుకున్న చొరకు భారత్ మద్దతుగా నిలబడి కృషి చేస్తుందని ఆయన అన్నారు.

ఉష్ణమండల వర్షారణ్యాలను ఎప్పటికీ చెక్కు చెదరకుండా కాపాడుకోవడంకోసం (ట్రోపికల్ ఫారెస్ట్స్ ఫరెవర్ ఫసిలిటీ..టిఎఫ్ఎఫ్ఎఫ్) నిధి సమకూర్చాలని కాప్–30 సదస్సులో అతిథేయ దేశం బ్రెజిల్ ప్రతిపాదన చేయనున్నది. ఈ ప్రతిపాదన ప్రకారం 70 శాతం అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉన్న ఈ ఉష్ణమండల వర్షారణ్యాలున్నాయి. వాతావరణాన్ని రక్షించుకోవడానికి ఈ టిఎఫ్ఎఫ్ఎఫ్ నిధి స్వీకరించడానికి ఈ దేశాలన్నింటికీ అర్హత లభిస్తుందని దినేశ్ భాటియా చెప్పారు. దాదాపు 125 బిలియన్ డాలర్లు ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడుల ద్వారా సేకరించాలని లక్ష్యంగా బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా నిర్దేశించారు. భూతాప (భూవాతావరణంలో ఉష్ణోగ్రత పెరుగుదల) సవాలు పరిష్కారానికి ప్రపంచదేశాలు తమ ప్రతిస్పందనను తెలియజేయడానికి కాప్–30 సదస్సు ఒక గొప్ప అవకాశమని దినేశ్ అన్నారు. ఒకవైపు అభివృద్ధి చెందుతున్న దేశాలు వాతావరణ సవాలును పరిష్కరించడానికి నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకుంటూ ఉండగా, అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం కాలుష్య వాయువులను అరికట్టేందుకు ఉద్దేశించిన బడ్జెట్‌లో ఇష్టానుసారంగా కోతలు పెడుతున్నాయన్నారు. శిలాజ ఇంథనాలను తగ్గించంద్వారా వాతావరణంలో వేడిని తగ్గించడానికి వీలు కల్పించాల్సి ఉందని, వాతావరణంలో వేడిని సమతుల్యస్థాయిలో తగ్గించేందుకు (నెట్ జీరో) అభివృద్ధి చెందిన దేశాలు వీలైనంత త్వరగా నిధులు సమకూర్చాలని కోరారు. వాతావరణ మార్పులను తగ్గించడానికి ప్రతిదేశం జాతీయస్థాయిలో 2031–2035 కాలానికిగాను అనుసరించే తమ తమ ప్రణాళికలను (జాతీయస్థాయి ప్రణాళిక) కాప్–30 సదస్సులో సమర్పించాల్సి ఉంటుంది. భారతదేశం కూడా ఈ ఎన్‌డిసిని సమర్పించాలి. ఐతే 2005–2020 మధ్యకాలంలో భారతదేశం కాలుష్య కారకాలను జిడిపిలో 36 శాతం మేరకు తగ్గించుకుందని దినేశ్ భాటియా కాప్–30 సన్నాహక సదస్సులో చెప్పారు. భారతదేశంలో 25.17 శాతం మేరకు అడవులు,వృక్షాలు విస్తరించాప్చెప్పారు. 2.29 బిఇయన్ టన్నుల కార్బండయాక్సైడ్‌ను అదనంగా తగ్గించుకున్నామని చెప్పారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఓట్ చోరీకి వ్యతిరేకంగా 1.12 కోట్ల సంతకాలు

### కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటన

బెంగళూరు : దేశంలోని అన్ని రాజ్యాంగ, స్వతంత్ర్య వ్యవస్థలను ప్రధాని నరేంద్ర మోదీ ధ్వంసం చేశారని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించారు. ఎన్నికల సంఘం సహా అన్ని వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పని చేసేలా మార్చేశారని మండిపడ్డారు. ఓటు చోరీ నిపుణులుగా బిజెపి తనను తాను నిరూపించుకుందని, కేంద్రంలో, అనేక రాష్ట్రాలలో ఇదే విధంగా అధికారంలోకి వచ్చిందని అన్నారు. 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా సంతకాల సేకరణలో భాగంగా కర్నాటక రాష్ట్రంలో 1.12 కోట్ల మంది సంతకాలు చేశారని బెంగళూరులో శనివారం ఆయన ప్రకటించారు. నవంబర్ 10వతేదీ నాటికి మొదటి విడత సంతకాలను ఎఐసిసికి పంపుతామని, అక్కడి నుంచి వారు రాష్ట్రపతి, ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు అందజేస్తారని అన్నారు.

## మహాత్మాగాంధీపై తరహాలో మోదీ సామ్రాజ్యంపై పోరాటం

### మోదీ 'కట్టా' వంటి పదాలను ఉపయోగిస్తూ ప్రధాని గౌరవాన్ని మంటగలుపుతున్నారు : ప్రియాంకాగాంధీ



**తిహార్/భగల్‌పూర్ :** మహాత్మా గాంధీ ఒకప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడిన తరహాలోనే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ మోదీ సామ్రాజ్యంపై అదే పోరాటం చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా పేర్కొన్నారు. శనివారం బిహార్‌లోని కతిహార్, భగల్‌పూర్ జిల్లాల్లో ప్రియాకాగాంధీ వరుస ర్యాలీల్లో పాల్గొని ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'కట్టా' (దేశంలో తయారు చేసిన పిస్టల్) వంటి పదాలను ఉపయోగించడం ద్వారా తన పదవి గౌరవాన్ని కాపాడుకోవడం లేదని ఆరోపించారు. ప్రధాని ఒకవైపు అహింసకు నిలయమైన 'వందేమాతరం'ను కీర్తిస్తుండగా, మరోవైపు 'కట్టా' వంటి పదాలను ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం జాతీయ గేయం 150వ వార్షికోత్సవాన్ని జరుపుకున్నప్పటికీ, చరిత్రలో ఒక సమయంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు స్వాతంత్ర్య ఉద్యమ గీతం, దేశ ఐక్యతను సూచించే వందేమాతరం పాడటానికి ఇష్టపడలేదని పేర్కొన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమైందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రధాని మోదీ ఇద్దరు కార్పొరేట్ స్నేహితులకు అప్పగిస్తోందని వాద్రా విమర్శించారు. ఎన్‌డిఎ అనేక ప్రభుత్వ పదవులను ఖాళీగా ఉంచిందని, ఉపాధి అవకాశాలన్నింటినీ మూసివేస్తోందని ఆమె ఆరోపించారు. భారతదేశంలో ఏడు దశాబ్దాల కాంగ్రెస్ పాలన గురించి ఎన్‌డిఎ నాయకులు మాట్లాడుతున్నారని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఐఐటిలు, ఐఐఎంలు, ఎయిమ్స్ వంటి సంస్థలను నిర్మించాయని వారు తెలుసుకోవాలని చురకలంటించారు. బిహార్‌లో మహిళలకు రూ. 10,000 లంచం ఇచ్చి ఓట్లు పొందాలని ఎన్‌డిఎ భావిస్తోందన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఎదుర్కొన్న ఎదురుదెబ్బ తర్వాత, ఓటు చోరీకి పాల్పడుతోందని వాద్రా ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్, వివేక్ జోషి, ఎస్‌ఎస్ సంధు అనే ముగ్గురు వ్యక్తులు అందులో భాగస్వాములుగా ఉన్నారని, ఎన్‌డిఎ ప్రభుత్వం, ఎన్నికల కమిషనర్లతో కలిసి బిహార్ ప్రజకు ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. మోదీ తన నియోజకవర్గమైన వారణాసి ప్రజలను కలవరని, విదేశాలను మాత్రమే సందర్శిస్తారని ఎద్దేవా చేశారు. పెట్రోల్, డీజిల్, ట్రాక్టర్లు అధిక పన్నులు ఎదుర్కొంటున్నందున వ్యవసాయంలో రైతులకు ఇకపై ఉత్పాదకత ఉండదని ఆమె పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థల రుణాలు మాఫీ చేస్తూ పేద ప్రజలు తమ పిల్లలను చదివించడానికి లేదా వారి పిల్లల వివాహాలు చేయడానికి తీసుకున్న రుణాలపై వడ్డీని చెల్లించడానికి తమ జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌డిఎ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో నేరాలు మూడు రెట్లు పెరిగాయని, వాటిలో ఎక్కువ భాగం వెనుకబడిన వర్గాలపై జరుగుతున్నాయని ప్రియాంకాగాంధీ ఆరోపించారు.

## రాష్ట్ర చరిత్రలోనే అత్యధికం

### బిహార్‌లో తొలి దశ ఎన్నికల్లో 65 శాతం పోలింగ్ : ఇసి



పాట్నా:బిహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశలో భాగంగా ఈ నెల 6వ తేదీన పోలింగ్ జరగగా, రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదైంది. గతంలో ఎప్పుడూ లేనంతగా 65.08 శాతంగా నమోదైందని ఎన్నికల సంఘం తెలిపింది. 1,314 మంది అభ్యర్థుల ఎన్నికల భవితవ్యాన్ని నిర్ణయించడానికి జరిగిన పోలింగ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో 36,733 మందితో సహా 45,341 పోలింగ్ కేంద్రాలలో మొత్తం 3.75 కోట్ల మంది ఓటు వేయడానికి అర్హులుగా ఉన్నారు. భరిలో ఉన్న అభ్యర్థుల్లో 1,192 మంది పురుషులు, 122 మంది మహిళలు ఉన్నారు. బిహార్ ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) కార్యాలయం అందించిన తాజా లెక్కల ప్రకారం, 65.08 శాతం నమోదైంది. 2020 అసెంబ్లీ ఎన్నికలలో జరిగిన ఏకీకృత పోలింగ్ శాతం కంటే 7.79 శాతం అత్యధికం. ఆ సమయంలో 57.29 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, 3.75 కోట్ల ఓటర్లలో, 1.98 కోట్ల మంది పురుషులు, 1.76 కోట్ల మంది మహిళలు ఉన్నారు. గురువారం జరిగిన ఎన్నికల్లో మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముజఫర్‌పూర్, సమస్తిపూర్ జిల్లాలలో 70 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ముజఫర్‌పూర్‌లో 71.81 శాతం పోలింగ్ నమోదు కాగా, సమస్తిపూర్‌లో 71.74 శాతం పోలింగ్ నమోదైంది. ఇతర జిల్లాల్లో పరిశీలిస్తే మాధేపురలో 69.59 శాతం, సహర్సాలో 69.38, వైశాలిలో 68.50, ఖగారియాలో 67.90 శాతం అధిక పోలింగ్ శాతం నమోదైంది. పాట్నా జిల్లాలో 59.02 శాతం పోలింగ్ నమోదైంది, లఖిసరాయ్ జిల్లాలో 64.98 శాతం, ముంగేర్‌లో 62.74, సివాన్‌లో 60.61 పోలింగ్ నమోదైంది. 243 మంది సభ్యులున్న అసెంబ్లీలో మిగిలిన 122 స్థానాలకు ఈనెల11న పోలింగ్ జరుగుతుంది, కౌంటింగ్ నవంబర్ 14న జరుగుతుంది.

## ఆర్‌జెడి అధికారంలోకి వస్తే ప్రజల తలలపై కత్తులే!

### చేతులు పైకెత్తమని ఆదేశించే పార్టీలు బిహార్‌కు వద్దు : మోదీ



తామ్రి/బెట్టియ : బిహార్‌లో ఆర్‌జెడి నేతృత్వంలోని ప్రతిపక్షం అధికారంలోకి వస్తే ప్రజల తలలపై 'కట్ట' పెట్టి, చేతులు పైకెత్తాలని ఆదేశిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. శనివారం సీతామఢి, బెట్టియాలో నిర్వహించిన వరుస ర్యాలీలో మోదీ పాల్గొని ప్రసంగించారు. మెరుగైన విద్య, క్రీడల వంటి రంగాలలో వృద్ధితో పాటు, స్టార్టప్ సంస్థలను ఎన్‌డిఎ సులభతరం చేస్తుందని ఆయన ఉద్ఘాటించారు. భారతరత్న కర్పూరి ఠాకూర్ జన్మస్థలంలో జరిగిన ర్యాలీతో తాను ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించానని, మోదీ గత నెలలో సమస్తిపూర్‌లో జరిగిన తన ఎన్నికల సమావేశాన్ని గుర్తుచేసుకుంటూ, బాపు గాంధీ మహాత్ముడిగా మారిన ప్రదేశం అయిన బెట్టియాలో తన ప్రచారాన్ని ముగించుకుంటున్నానని పేర్కొన్నారు.
బిహార్‌లో కొత్త ఎన్‌డిఎ ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావడానికి మళ్ళీ తిరిగి వస్తానన్నారు. 2005 వరకు 15 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన ఆర్‌జెడి, బిహార్‌ను లాఠెట్లు, దోపిడీదారుల భూమిగా మార్చిందన్నారు. ఆర్‌జెడి తన ప్రచారంలో పిల్లలు పెద్దయ్యాక 'రంగ్‌దార్' (వీధి రౌడీ) కావాలని కోరుకుంటున్నట్లు చెప్పడానికి ప్రేరేపిస్తోందని విని తనకు వణుకు పుడుతుందన్నారు. 'కట్టా', 'కుశాసన్' (దుష్పరిపాలన), 'క్రూర్తా' (క్రూరత్వం), అవినీతి అందించే ప్రభుత్వాన్ని బిహార్ కచ్చితంగా కోరుకోదన్నారు. 'తమ తలలపై 'కట్టా' (దేశంలో తయారు చేసిన తుపాకీ) పెట్టి చేతులు పైకెత్తమని చెప్పే పాలన ప్రజలకు వద్దు. ప్రజలు స్టార్టప్‌లను కోరుకుంటున్నారు, దీనికి ఎన్‌డిఎ దోహదపడుతుంది. ఎన్‌డిఎ 'కట్టా'ను తిరస్కరించి స్కూల్ బ్యాగులు, కంప్యూటర్లు, క్రికెట్ బ్యాట్లు, హాకీ స్టిక్‌లను ప్రోత్సహిస్తుంది' అని మోదీ అన్నారు. 'మెహెంగాయి దాయన్ ఖాయే జాత్ హై' వంటి సాహిత్యంతో కూడిన పాట ప్రజాదరణ పొందిన యుపిఎ యుగంలా కాకుండా, సవరించిన జిఎస్‌టి రేట్లతో, 'మోటార్ సైకిళ్ల నుండి మొబైల్ ఫోన్‌ల వరకు సరసమైనవిగా మారాయి' అని ఆయన పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం జరిగిన మొదటి దశ ఎన్నికల్లో అధిక ఓటర్లు ఓటు వేయడం పట్ల ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు. 'మీరు ప్రతిపక్షాలకు 65 వోల్ట్ షాక్ ఇచ్చారు. వారు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు..... రెండవ దశ పోలింగ్‌లో మీరు మొదటి రౌండ్ రికార్డును బద్దలు కొట్టాలి' అని ఆయన అన్నారు. నెల రోజుల క్రితం తాను ప్రారంభించిన ముఖ్యమంత్రి మహిళా ఉద్యోగిమి యోజన పథకాన్ని కూడా మోదీ ప్రస్తావించారు. ఈ పథకం కింద ఒక్కొక్కరికి రూ. 10,000 చొప్పున కోట్లాది మంది మహిళల ఖాతాల్లోకి బదిలీ చేశారు. జంగల్ రాజ్ వల్ల ఇది ఎప్పటికీ సాధ్యం కకాదన్నారు. బిహార్‌లోని పంచాయతీలు, మునిసిపాలిటీలలో మహిళలకు రిజర్వేషన్లను ఉటంకిస్తూ ఎన్‌డిఎ తీసుకున్న మహిళా కేంద్రీకృత చర్యల గురించి కూడా ఆయన మాట్లాడారు. సీతామఢిలో జరిగిన ర్యాలీలో మత్స్య రంగంలో జరుగుతున్న అభివృద్ధి గురించి మాట్లాడారు. ఇటీవల మత్స్యకారులకు సంఘీభావం తెలిపేందుకు బురద చెరువులోకి దూకిన గాంధీని ఆయన ఎద్దేవా చేశారు. కొంతమంది ఎలా మునిగిపోవాలో ప్రాక్టీస్ చేస్తున్నారన్నారు. సీతాదేవి జన్మస్థలం సీతామఢిలోని పునౌర ధామ్ ప్రాజెక్టును వారసత్వం (విరాసత్) పట్ల ఎన్‌డిఎకు ఉన్న గౌరవానికి ఉదాహరణగా ప్రధాని ప్రస్తావించారు.

## పిఎం, సిఎం సిగ్గుపడాలి


### మధ్యప్రదేశ్‌లో చిన్నారులకు న్యూస్‌పేపర్‌లో మధ్యాహ్నం భోజనం వడ్డింపుపై రాహుల్‌గాంధీ మండిపాటు



**న్యూఢిల్లీ :** మధ్యప్రదేశ్‌లో కొంతమంది చిన్నారులకు న్యూస్‌పేపర్‌లో మధ్యాహ్న భోజనం వడ్డించినట్లు కనిపిస్తున్న దృశ్యాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఇది చూసి తన హృదయం తల్లడిల్లిందన్నారు. ఇంత దయనీయ స్థితిలో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లో కొంతమంది చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని న్యూస్‌పేపర్‌లో వడ్డిస్తున్నట్లు తెలుసుకుని నా హృదయం ముక్కలైంది. ఈ పిల్లలపైనే మన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. కానీ, వారికి కనీస గౌరవం దక్కడం లేదు. అక్కడ అభివృద్ధి అంతా భ్రమే. వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకొని అధికారంలోకి వస్తున్నారు. ఇటువంటి దుర్భర స్థితిలో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలి అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 'వీరు దేశ భవిష్యత్తును కలలు కంటున్న అమాయక పిల్లలే, వారికి గౌరవ ప్లేట్ కూడా దొరకడం లేదు' అని గాంధీ హిందీలో తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 20 సంవత్సరాలకు పైగా ప్రభుత్వంలో ఉన్న బిజెపి పిల్లల ప్లేట్లను కూడా దొంగిలించిందని, వారి అభివృద్ధి కేవలం భ్రమ, అధికారంలోకి రావడానికి అసలు రహస్యం 'వ్యవస్థ'' అని ఆయన ఆరోపించారు. శ్యోపూర్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఈ వీడియో తీసినట్లు సమాచారం. ఈ వ్యవహారం కాస్త నెట్టింట వైరల్‌గా మారడంతో.. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది. స్వయం సహాయక సిబ్బంది సేవలను నిలిపివేశారు. నెటిజన్లు దీన్ని ఖండించారు. మధ్యాహ్న భోజనం అనేది పిల్లల హక్కు అని పేర్కొన్నారు. పోషకాహారం పేరిట అనారోగ్యాన్ని వడ్డిస్తున్నారంటూ విమర్శించారు.

## మరోసారి నితీశ్‌కుమారే సిఎం అని చెప్పగలరా?

### మోదీ, అమిత్ షాలకు ఖర్గే సూటి ప్రశ్న



**గయా/ పట్నా :** బిహార్ శాసనసభ ఎన్నికల్లో ఎన్‌డిఎ విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా జోస్యాలు లోక్‌సభ ఎన్నికల్లో చార్ సౌ పార్ లాంటివేనని ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. బిహార్ లో బిజెపి నేతృత్వంలో కూటమి సవ్యంగా లేదని, సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న జెడి(యు) అధ్యక్షుడు నితీశ్ కుమార్ మరోసారిఆపదవిచేపడతారనే అంశంలోసందేహాలు నెలకొన్నాయన్నారు. **లోక్‌సభ ఎన్నికల సందర్భంగా** 400 స్థానాలకు పైగా గెలుస్తామని ప్రచారం చేసుకున్న బిజెపికి కనీస మెజారిటీ కంటే తక్కువ స్థానాలు వచ్చాయని, జెడియు, టిడిపి వంటి మిత్రపక్షాలపై ఆధారపడి అధికారాన్ని కొనసాగిస్తున్నారని పిటిఐతో మాట్లాడుతూ చెప్పారు.
**బిహార్‌లో** 243 అసెంబ్లీ స్థానాలలో 160కిపైగా గెలుస్తామని అమిత్‌షా చేస్తున్న ప్రకటనలు ప్రస్తావించగా చార్ సౌ పార్ ఏమైందనేని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. బిహార్‌లో మహాఘట్‌బంధన్ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ కాంగ్రెస్ తలపై తుపాకీ పెట్టడంతో ఆయనను ఇండియా కూటమి సిఎం అభ్యర్థించిందన్న ప్రధాని ఆరోపణలపై స్పందిస్తూ మోదీకి ట్రంప్ తుపాకి ఎక్కు పెట్టాడా లేదా చెప్పాలని ఖర్గే అన్నారు. తమను ఎవరూ భయపెట్టలేరని చెప్పారు. నితీశ్ షాను ముఖ్యమంత్రి అభ్యర్థిగా మోదీ, షాలు ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. నాయకత్వంపై అంగీకారం లేకుండా వారు ఎన్‌డిఎ అధికారంలోకి వస్తుందని చెప్పలేరని అన్నారు.

## అభివృద్ధిలో దూసుకెళ్తోన్న భారత్

### బనారస్‌లో నాలుగు కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని

#### కవిసమ్మేళన్‌లో పాల్గొన్న కాశీ నగరం పిల్లల ప్రతిభను ప్రశంసల్లో ముంచెత్తిన మోదీ



**వారణాసి/ లక్నో / బరేలీ (యుపి) :** బనారస్ రైల్వే స్టేషన్ల నుండి నాలుగు కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను శనివారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జెండా ఊపి ప్రారంభించారు. బనారస్‌ఖజురహో, లక్నో సహరన్‌పూర్, ఫిరోజ్‌పూర్‌ఢిల్లీ, ఎర్నాకుళం బెంగళూరు మార్గాలలో ఈ కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తాయి. సెమీ హైస్పీడ్ రైళ్లు ప్రధాన స్టేషన్ల మధ్య ప్రయాణాన్ని గణనీయంగా తగ్గిస్తాయని, ప్రాంతీయ చలనశీలతను పెంచుతాయని, దేశవ్యాప్తంగా పర్యాటకరంగాన్ని ప్రోత్సహిస్తాయని, అంతేకాకుండా దేశవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలకు కూడా మద్దతు ఇస్తాయని ఒక అధికారిక ప్రకటన వెల్లడించింది. బనారస్‌ఖజురహో వందే భారత్ వారణాసి, ప్రయాగ్‌రాజ్, చిత్రకూట్‌తో సహా ప్రసిద్ధ సాంస్కృతిక, మతపరమైన ప్రదేశాలను కలుపుతుందని అధికారులు తెలిపారు. నాలుగు రైళ్లను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన ఒక బహిరంగ సభకు భారీ సంఖ్యలో హాజరైన ప్రజలను ఉద్దేశించి నరేంద్రమోదీ ప్రసంగించారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాల నుండి వందే భారత్ రైళ్లు చాలా నడుస్తున్నందున ఈ అన్ని పరిణామాలు వృద్ధితో ముడిపడి ఉన్నాయి. నేడు భారతదేశం కూడా ఈ మార్గంలో శరవేగంగా ముందుకు పయనిస్తోంది'. వందే భారత్, నమో భారత్, అమృత్ భారత్ వంటి ఈ రైళ్లు ఒక కొత్త తరం భారతీయ రైల్వేలకు పునాది వేస్తున్నాయి' అని ప్రధాని చెప్పారు. 'వందే భారత్ అనేది భారతీయుల రైలు. దీనిని భారతీయులు నిర్మించారు. వందే భారత్ రైలు గురించి ప్రతీ భారతీయుడు గర్వపడుతున్నాడు. భారతీయుల కోసం భారతీయులే నిర్మించుకున్న రైలు ఇది. ఇప్పుడు విదేశీ ప్రయాణికులు కూడా వందే భారత్ రైలును చూసి ఆశ్చర్యపోతున్నారు.ఒక అభివృద్ధిచెందిన దేశం కోసం భారతదేశం తన వనరులను మెరుగుపరుచుకోవడానికి ఒక ప్రచారాన్ని ప్రారంభించిందని, ఈ వందే భారత్ రైళ్లు అందులో ఒక మైలురాయిగా నిలుస్తాయి' అని ప్రధాని మోదీ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా ప్రభుత్వం వారణాసిలో భారీ భద్రతా బలగాలను మోహరింపజేసింది. రైల్వే స్టేషన్ బయట ఏర్పాటు చేసిన నరేంద్ర మోదీ భారీ కటౌట్ ప్రజలను ఆకర్షించేందుకు కేంద్ర బిందువు అయ్యింది. రైల్వే స్టేషన్ వద్ద, లోపల వారణాసిఖజురహో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో గుమిగూడిన పిల్లలను ఉద్దేశించి ప్రధానమంత్రి మోదీ సంభాషించారు. పిల్లలు తాము రాసిన కవితలను ప్రధానికి చదివి వినిపించారు. అనంతరం మోదీ తన ప్రసంగంలో ఈ కార్యక్రమానికి హాజరైన పిల్లలను ప్రశంసల్లో ముంచెత్తారు. 'నా కాశీ నగరానికి సంబంధించిన పిల్లలు ఇంత ప్రతిభావంతులుగా ఉన్నారని తెలిసి నేను వారణాసి ఎంపిగా చాలా గర్వపడుతున్నాను' అని మోదీ సంతోషం వ్యక్తంచేశారు. శనివారం నాడు వందేభారత్ రైళ్ల ప్రారంభం సందర్భంగా పిల్లల కవి సమ్మేళన్ ఆలోచనను మోదీ ముందుకు తెచ్చారు (ఫ్లాగింగ్ ఆఫ్ సందర్భంగా ఇక్కడ పిల్లల బృందంతో సంభాషిస్తున్నప్పుడు కవులు నన్ను ఉద్దేశించి కవి సమ్మేళనం విషయాన్ని ప్రస్తావించారు). 'ఇందులో ఉత్తమ ప్రతిభను కనబర్చిన 8 నుండి 10మంది పిల్లలను కవిత్వ పఠనాల కోసం దేశం అంతటికీ తీసుకెళ్తాం. కాశీ నుంచి పార్లమెంట్‌సభ్యుడిగా ఉన్న నాకు ఈరోజు ఒక ప్రత్యేక, సంతోషకర అనుభవం మిగిలింది. నేను ఈ పిల్లలను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను' అని మోదీ చెప్పారు. చివరగా ప్రధానమంత్రి మోదీ తన ప్రసంగాన్ని ముగిస్తూ నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా 'హమ్ భారత్ కీ వాసీ, దేఖ్ రహే హై వికసిత్ కాశీ' అంటూ గట్టిగా నినాదాలు ప్రతిధ్వనించాయి. లక్నో సహరాన్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభోత్సవంలో ఉత్తర్‌ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ వర్చువల్‌గా పాల్గొన్నారు. బరేలీ చేరుకున్న లక్నోసహరాన్‌పూర్ వందే భారత్ రైలుకు ఘన స్వాగతం లభించింది. ఉత్తర్ ప్రదేశ్ అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అరుణ్‌కుమార్ సక్సేనా, ఎంపి ఛాత్రపాల్ సింగ్ గాంగ్వర్, మేయర్ ఉమేష్ గౌతం స్టేషన్‌లో ఉన్నారు. ఈ రైలు దాదాపు 7గంటల 45 నిమిషాల ప్రయాణాన్ని పూర్తి చేస్తుందని, దాదాపు ఒక గంట ప్రయాణ సమయం ఆదా అవుతుందని, లక్నో సహరాన్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ లక్నో, సీతాపూర్, షాజహాన్‌పూర్, బరేలీ, మొరాదాబాద్ , బిజ్నోర్, సహరాన్‌పూర్ నుండి ప్రయాణికులను తీసుకెళుతుందని, అలాగే పవిత్రమైన హరిద్వార్‌కు అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని కూడా అధికారులు తెలిపారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేరళ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, కేంద్ర మంత్రులు సురేశ్ గోపి, జార్జి కురియన్, రవనీత్ సింగ్ బిట్టు, ఇతర ప్రముఖులు వర్చుల్‌గా హాజరయ్యారు.

## ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

### వందలాది గుడిసెలు దగ్ధం, ఒకరు మృతి



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని రోహిణిలోని రిథాల మెట్రో స్టేషన్ సమీపంలో సుమారు 500 గుడిసెలకు వ్యాపించిన భారీ మంటల్లో ఒక వ్యక్తి మరణించగా, మరొకరికి గాయాలు అయ్యాయని ఢిల్లీ అగ్నిమాపక సేవలు (డిఎఫ్ఎస్) తెలిపింది. శుక్రవారం సాయంత్రం చెలరేగిన మంటలను తగిన బృందాలను మోహరించడం ద్వారా పూర్తిగా అదుపులోకి తెచ్చామని, బాధితులకు సహాయం అందిస్తున్నామని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించామని, సహాయ, పునరావాస పనులు వేగంగా జరుగుతున్నాయని 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో ఆమె చెప్పారు. బాధితులకు ఆహారం, నీరు అందించామని, వారిని తరలించడానికి తాత్కాలిక ఆశ్రయాలను ఏర్పాటు చేశామని చెప్పారు. శుక్రవారం సాయంత్రం అనేక ఎల్‌పిజి సిలిండర్లు పేలిపోయాయని, మంటలు తీవ్రమయ్యాయని, నివాసితులలో భయాందోళనలు రేకెత్తాయని పోలీసులు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం 400 నుండి 500 గుడిసెలు కాలిపోయాయని అగ్నిమాపక అధికారులు తెలిపారు. రాత్రి 10.56 గంటలకు మంటలకు సంబంధించి కాల్ వచ్చిందని, ఆ తర్వాత బహుళ అగ్నిమాపక దళాలు, అగ్నిమాపక రోబోలను ఘటనా స్థలానికి తరలించామని డిఎఫ్ఎస్ తెలిపింది. తెల్లవారుజామున మంటలు అదుపులోకి వచ్చాయని డిఎఫ్ఎస్ అధికారి ఒకరు తెలిపారు. ఈ ఘటనలో రాజేష్ గాయపడ్డాడు. ఢిల్లీ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయం అందిస్తోందని సిఎం గుప్తా అన్నారు.

## చొరబాటు యత్నం భగ్నం ఇద్దరు ఉగ్రవాదులు హతం



**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లోని కుప్వాడాలో నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదుల చొరబాటు ప్రయత్నాన్ని సైన్యం భగ్నం చేసింది. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్టు అధికారులు తెలిపారు. ఆప్రాంతంలో ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని పేర్కొన్నారు. కుప్వాడాలోని కెరాన్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదులు చొరబాటుకు యత్నిస్తున్నట్టు శుక్రవారం నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. ముష్కరులను అడ్డుకునేందుకు 'ఆపరేషన్ పింపుల్' కింద శుక్రవారం (నవంబర్ 7న భారత్ ఆర్మీకి చెందిన చినార్ కార్ప్స్ తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలో శనివారం ఉదయం ఉగ్రవాదులు ఎదురుపడి కాల్పులు జరిపారు. అప్రమత్తమైన సైనికులు ఎదురుకాల్పులు జరపడంతో ఇద్దరు ముష్కరులు హతమయ్యారు. కెరాన్ సెక్టార్‌లో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్టు చినార్ కార్ప్స్ పేర్కొంది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేసింది. అంతకుముందు నవంబర్ 5న కిష్తివాడ్ జిల్లా ఛత్రులోని కల్బన్ అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. కిష్తివాడ్‌లోని ఛత్రు ప్రాంతంలో ముగ్గురు ఉగ్రవాదులు కొన్ని నెలలుగా నక్కి ఉన్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే సమాచారం అందుకున్న భారత సైన్యంలోని వైట్ నైట్ కార్ప్స్, కశ్మీర్ పోలీసుల సంయుక్త బృందాలు ఆరేషన్ ఛత్రును ప్రారంభించాయి. ఉగ్రవాదులను గుర్తించిన దళాలు వారిని చుట్టుముట్టాయి. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి.

## అజిత్‌పవార్ కుమారుడి భూ అక్రమాలపై విచారణ జరపాలి

### శరద్ పవార్ డిమాండ్



**అకోలా :** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్‌కు చెందిన కంపెనీ తక్కువ ధరకే ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసిన వివాదంపై విచారణ జరపాలని ఎన్‌సిపి(ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం గంభీరమైనదని స్వయంగా ముఖ్యమంత్రే బహిరంగంగా ప్రకటించారని, కాబట్టి సమాజానికి వాస్తవాలు తెలిసేందుకు విచారణ జరిపించాలని అకోలాలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన విజ్ఞప్తి చేశారు. పుణెలోని ముంధ్వా ప్రాంతంలో రూ.1800 కోట్ల విలువైన 40 ఎకరాల ప్రభుత్వ భూములను స్టాంప్‌డ్యూటీ మాఫీ పొందడంతో పాటు కేవలం రూ.300 కోట్లకే పార్థ్‌కు చెందిన కంపెనీ అక్రమంగా కొనుగోలు చేసిందనే వివాదం మహారాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని అజిత్ పవార్ ప్రకటన చేశారు. అజిత్ పవార్‌ను ఇబ్బంది పెట్టేందుకే మహాయుతిలోని పక్షాలు రాజీయంగా లక్ష్యం చేసుకున్నాయా? అనే ప్రశ్నకు తనకు తెలియదని శరద్ పవార్ సమాధానమిచ్చారు. పరిపాలన, రాజకీయాలు, కుటుంబం వేర్వేరు అంశాలని, కుటుంబంగా తామంతా ఒక్కటేనని, సైద్ధాంతికంగా విడిపోయి ఉన్నామని, తమ మనవళ్ళలో ఒకరు అజిత్ పవార్‌పై పోటీ చేయగా, తన కుమార్తెపై అజిత్ పవార్ సతీమణి పోటీ చేసిందని ఒక ప్రశ్నకు సమాధానంగా శరద్ పవార్ చెప్పారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యూహాన్ని మహా వికాస్ ఆఘాడీలోని భాగస్వామ్య పక్షాలన్నీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదివారం తమ కూటమి సమావేశంలో ఈ మేరకు వ్యూహంపై చర్చిస్తామని, అలాగే పాత భాగస్వాములను కూటమిలోకి తీసుకునే అంశంపై కూడా మాట్లాడుకుంటామన్నారు. మహావికాస్ ఆఘాడీ ఏకాభిప్రాయం ద్వారా మంచి ప్రత్యామ్నాయంగా ఆవిర్భంచే అవకాశం ఉంటే, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేనాపై కాంగ్రెస్ తీవ్ర వైఖరిని తీసుకోవాల్సిన అవసరం లేదని, దానిపై ఆలోచన చేయాలని అన్నారు.

## బైకర్‌కు రూ. 20 లక్షలు ఫైన్

**లక్నో :** ఓ బైకర్‌కు ట్రాఫిక్ పోలీసులు ఊహించని షాక్ ఇచ్చారు. లక్ష రూపాయల బైక్‌కు ఏకంగా 20 లక్షల రూపాయల ఫైన్ వేశారు. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. గత మంగళవారం ముజఫర్‌నగర్‌కు చెందిన అన్మోల్‌సింఘాల్ అనే యువకుడు రోజూలాగే తన బైక్‌పై బయటకు వెళ్లాడు. అయితే, న్యూ మండీ ఏరియాలోని రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు అతడి బైక్‌ను ఆపారు. ట్రాఫిక్ పోలీసులు ఆపిన సమయంలో అతడి తలపై హెల్మెట్ లేదు. దానికి తోడు బండికి సంబంధించిన డాక్యుమెంట్లు కూడా లేవు. దీంతో అధికారులు ఆ బైక్‌ను సీజ్ చేశారు. 20,74,000 రూపాయల ఫైన్ వేశారు. లక్ష రూపాయల బైక్‌కు 20 లక్షల ఫైన్ రావటంతో అన్మోల్ షాక్‌తో పాటు షేక్ అయ్యాడు. చలాన్‌ను ఫొటో తీసి తన సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేశాడు. ఆ ఫొటో కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ట్రాఫిక్ అధికారులపై విమర్శలు మొదలయ్యాయి. 20 లక్షల రూపాయల ఫైన్‌ను నాలుగు వేలకు తగ్గించారు. దీనిపై ట్రాఫిక్ ఎస్పీ అతుల్ చౌబే మాట్లాడుతూ.. 'ఈ కేసులో మోటార్ వెహికల్స్ యాక్ట్‌లోని సెక్షన్ 207 అప్లై అయ్యింది.




## కాలం.. తిరోగమనం!




మళ్లీ గతంలోకి వెళ్లగలిగితే బాగుంటుందని జీవితంలో ఏదో ఒక సందర్భంలో దాదాపు ప్రతి ఒక్కరూ అనుకొని ఉంటారు. అయితే, ఇది అసాధ్యమన్నది అందరికీ తెలుసు. కానీ, శాస్త్రవేత్తలు మాత్రం సిద్ధాంతపరంగా ఇది సాధ్యమని అంటున్నారు. తాజాగా గూగుల్ క్వాంటం ఎఐ సంస్థ చేసిన ప్రయోగం కాల చక్రాన్ని వెనక్కు తిప్పలేకపోయినా, ఆ దిశగా ఓ అడుగు వేసింది. 'క్వాంటం ఎకోస్' అనే కొత్త ఆల్గారిథం సాయంతో ఈ ప్రయోగం జరిగింది. విల్లో క్వాంటం చిప్‌పై ఒక సిములేటెడ్ క్వాంటం సిస్టమ్‌లో సమాచారాన్ని తిరిగి ఆవిర్భవించడాన్ని లేదా టైమ్ రివర్సల్‌ను ప్రదర్శించారు. అంటే క్యూబిట్స్‌ను నిర్దిష్టంగా మార్చివేసి, ఒక వ్యవస్థ అభివృద్ధిని వ్యతిరేక దిశలో నడిపారు. దీనినే 'టైమ్ రివర్సల్ ప్రొటోకాల్'గా పేర్కొంటున్నారు. దీని ద్వారా క్వాంటం సమాచారం ఎలా వ్యాప్తి చెందుతుంది? దానిని ఎలా తిరిగి పొందవచ్చు? అనే ప్రశ్నలకు సమాధానం కనుక్కొనే ప్రయత్నం చేశారు. ఈ ప్రయోగంతో క్వాంటం ఎంటాల్జిమెంట్, ఇన్ఫర్మేషన్ ప్రిజర్వేషన్, ఎర్రర్ కరెక్షన్ వంటి విషయాల్లో కొత్త ఆవిష్కరణకు దారులు ఏర్పడ్డాయి. అయితే, దీని ఆధారంగా మనిషి 'టైమ్ ట్రావెల్' చేయగలడని నిరూపించే అవకాశం లేదు. ఇది కేవలం క్వాంటం సిస్టమ్‌లో సమయాన్ని తిరోగమనంలో నడిపించడం సాధ్యమని చెప్పడానికి మాత్రమే పనికి వస్తుంది. మరింత మెరుగైన క్వాంటం సిములేషన్, దృఢమైన కమ్యూనికేషన్, కొత్త కంప్యూటింగ్ విధానాలను సాధించడం సాధ్యమని శాస్త్రవేత్తలు నిరూపించగలిగారు. ప్రపంచంలోని అత్యుత్తమ సూపర్‌కంప్యూటర్ కంటే 13,000 రెట్లు వేగంగా ఈ ప్రయోగాన్ని క్వాంటం కంప్యూటర్ సాధించింది. ఈ ప్రయోగం పూర్తిగా ఫిజిక్స్‌లోని ప్రాథమిక నియమాల్లో కొత్త ఆవిష్కరణలకు, ప్రత్యేకించి క్వాంటం కమ్యూటింగ్ దోషాలను సరిచేయడానికి ఉపయోగపడుతుంది. ఇలాంటి ప్రయోగాలు మరింత విస్తృతంగా జరిగి, పూర్తి స్థాయిలో విజయవంతమైతే, గతంలోకి వెళ్లడం సాధ్యమవుతుందేమో? సైన్స్‌లో ఏదైనా సాధ్యమే.

## అంతరాలు లేని సౌరకుటుంబం



మనుషుల్లో స్వార్థం పెరిగిపోయి, కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నా యి. కానీ, మన సౌర మండలంలో ప్రధాన కేంద్రకంగా ఉన్న నక్షత్రమైన సూర్యుడు, దాని చుట్టూ తిరిగే గ్రహాలలో మాత్రం ఎంతో అన్యోన్యత కనిపిస్తుంది. సూర్యుడు ప్రపంచానికి వెలుగునిస్తే, వాతావరణాన్ని స్థిరంగా ఉంచే బాధ్యత చంద్రుడిది. ఇక బృహస్పతి (జూపిటర్), శని (శాటర్న్) వంటి పెద్ద గ్రహాలు రక్షణ వలయంలా పని చేస్తున్నాయి. మన గెలాక్సీ నుంచి మాత్రమేగాక, విశ్వంలో వేలాదిగా ఉన్న ఇతర గెలాక్సీలు, నక్షత్రాలు, గ్రహాల నుంచి భూమివైపు దూసుకొచ్చే అత్యంత ప్రమాదకరమైన శకలాలను ఆకర్షిస్తాయి. వాటిని తమలోకి లాక్కుంటా యి లేదా దారి మళ్లిస్తాయి. ఈ విధంగా భూమికి రక్షణభటుల పాత్ర పోషిస్తున్నాయి. కాబట్టి మన సౌర కుటుంబం కేవలం గ్రహాల సమాహారం మాత్రమే కాదు, ఒక కుటుంబంలా ఒకదానికొకటి సహాయంగా ఉండే వ్యవస్థగా అర్థం చేసుకోవాలి. ఈ విధంగా, మన బతుకును నిర్భీతి గా, సురక్షితంగా నిలిపేలా సౌర వ్యవస్థ పరస్పర సహకారం అందిస్తోంది. దురదృష్టవశాత్తు ఆ కనీస జ్ఞానం మనిషిలో మటుమాయమవుతున్నది. భూగోళం యుద్ధాలు.. దాడులతో దద్దరిల్లుతున్నది.


## అత్యంత లోతైన ప్రాంతం 'మారియానా'



సముద్రాల్లో అత్యంత లోతైన ప్రాంతం మారియానా ట్రెంచ్. మన ఊహకు కూడా అందనంత లోతు ఎంత అంటే, ఎవరెస్ట్ పర్వతాన్ని అక్కడ ఉంచినా దాని శిఖరం ఇంకా ఒక మైలు లోతు నీటిలో మునిగిపోయి ఉంటుంది. ఈ అద్భుతమైన ప్రాంతం పూర్తిగా చీకటితో నిండిపోయి ఉంటుంది. దీనితో అపారమైన ఒత్తిడిని కలిగిస్తుంది. అయినప్పటికీ అక్కడ అరుదైన, జీవరాశులు నివసిస్తాయి. ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకొని, జీవించగల సామర్థ్యం వీటి ఎలా వచ్చిందనే విషయంపై శాస్త్రవేత్తలు ఇప్పటికీ అధ్యయనాలు చేస్తున్నారు. మారియానా ట్రెంచ్‌ను సంపూర్ణంగా అన్వేషించడం ద్వారా జీవం అతి క్లిష్టమైన వాతావరణాల్లో ఎలా మనుగడ సాగిస్తుందో తెలుసుకోవచ్చు. ఇది మన సముద్రాలు, మన భూమిపైన కూడా మనకు తెలియని ఎన్నో రహస్యాలు ఉన్నాయని గుర్తుచేస్తుంది. అలల క్రింద దాగి ఉన్న ఈ విచిత్ర లోయ, భూమిపై ఉన్న గొప్ప సహజ అద్భుతాల్లో అత్యంత రహస్యభరితమైనదిగా నిలుస్తుంది. ప్రకృతి సృష్టించిన మహా అద్భుతం.

## చేతి రాత.. మెదడుకు మేత!

మొదట కంప్యూటర్లు... తర్వాత సెల్ ఫోన్లు... చేతి రాతను పూర్తిగా మింగేస్తున్నాయి. కీబోర్డు పెత్తనం చెలాయిస్తున్న యుగంలో చేతి రాత గగనమైంది. కానీ, చేత్తో రాయడం అనేది మెదడు పనితీరును పెంచే అత్యంత శక్తివంతమైన సాధనమని న్యూరోసైంటిస్టులు స్పష్టం చేస్తున్నారు. తాజా నివేదికలను అనుసరించి, టైపింగ్ కంటే చేతితో రాయడమే ఎక్కువగా మెదడు సర్క్యూట్లను క్రియాశీలం చేస్తుంది. చేతిరాత జ్ఞాపక శక్తికి సాధనం. పఠన శక్తికి అభ్యాసం. సమాచార ప్రాసెసింగ్ వంటి ప్రక్రియలకు అవసరమైన నాడీ సంబంధాలను బలపరిచే ఇంధనం. మనం రాసేటప్పుడు, చలన భాగాలు, దృశ్య గ్రహణం, భాష కేంద్రాలను మెదడు ఏక సమయంలో క్రియాశీలం చేస్తుంది. ఈ బహుఇంద్రియ చర్య సమాచారాన్ని మేధస్సులో గాఢంగా ముద్రిస్తుంది, దాన్ని మరింత సులభంగా గుర్తుచేసుకునేలా చేస్తుంది. దీని విరుద్ధంగా, టైపింగ్ కేవలం వేళ్ల పునరావృత కదలికలపై ఆధారపడుతుంది. మెదడుకు తక్కువ ఉత్తేజాన్ని ఇస్తుంది, ఫలితంగా జ్ఞాపకశక్తి బలహీనమవుతుంది. చేతితో నోట్సులు తీసుకునే విద్యార్థులు, టైప్ చేసే విద్యార్థుల కంటే భావనాత్మక అవగాహన, గుర్తుంచుకునే సామర్థ్యంలో మెరుగైన ఫలితాలు సాధిస్తారని తాజా ఫలితాలు వెల్లడిస్తున్నాయి. చేతిరాత, సమాచారాన్ని సారాంశం చెయ్యడం, పునఃవ్యాఖ్యానం చెయ్యడం, విశ్లేషించడం వంటి కార్యాలను ప్రోత్సహిస్తుంది. ఇవన్నీ అవగాహనను, దీర్ఘకాలిక జ్ఞాపకాన్ని బలపరుస్తాయి. కేవలం చదువుకు మాత్రమే పరిమితం కాకుండా, చేతిరాతకు విస్తృతమైన మేధో ప్రయోజనాలు ఉన్నాయి.



దినచర్యను రాయడం లేదా స్కెచ్‌లు వేయడం ద్వారా ప్రారంభిస్తే మంచిది. ఆ అలవాటు సృజనాత్మకతను ఉత్తేజపరుస్తుంది. ఏకాగ్రతను పెంచుతుంది, స్పర్శాత్మక, ధ్యానాత్మక అనుభూతితో ఒత్తిడిని తగ్గిస్తుంది. ఇది చేతి వ్యాయామం మాత్రమే కాదు.. మెదడుకు మేత కూడా. ముఖ్య విషయాలను చేత్తో రాయడం, రోజువారీ డైరీని లిఖించడం లేదా జాబితాలు తయారు చేయడం వంటి చిన్న మార్పులకే గణనీయమైన మేధో ప్రయోజనాలు ఉంటాయి. అక్షరాలను శారీరకంగా రూపొందించడం వల్ల మెదడు అంతటా సంకేతాలు ప్రవహించి, అభ్యాసం, జ్ఞాపకశక్తికి కీలకమైన మార్గాలను బలపరుస్తాయి. డిజిటల్ యుగంలో చేతిరాత కేవలం గతపు జ్ఞాపకం కాదు.. అది న్యూరోలాజికల్ ప్రక్రియ. చేత్తో రాసే ప్రతి పదం మేధస్సును బలపరుస్తుంది. కొత్త అనుబంధాలను సృష్టిస్తుంది. టైపింగ్ చేయలేని రీతిలో సమాచారాన్ని స్థిరపరుస్తుంది. అత్యంత శక్తివంతమైన మానసిక వ్యాయామాలు అత్యంత సాధారణమైన, మానవీయమైన చర్యల నుంచే ఉద్భవిస్తాయనడానికి చేతి రాతే నిదర్శనం.

— బిఎస్ఎస్ మైత్రేయి

# జూబ్లీహిల్స్ గెలుపు ఎవరిది?

ఈ వారంలో పరిణామాలు రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా రెండు రోజుల్లో పోలింగ్ జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బరిలో నిలిచిన మూడు ప్రధాన పార్టీలైన అధికార కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలు హోరా హోరీగా ప్రచారం సాగిస్తున్నాయి.

ఆయా పార్టీల ముఖ్య నేతలుగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి కె.టి.రామారావు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిలు అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. అభ్యర్థులు నవీన్ యాదవ్ (కాంగ్రెస్), మాగంటి సునీత(బిఆర్ఎస్), ఎల్.దీపక్‌రెడ్డి (బిజెపి)ల కంటే 'ఆ ముగ్గురు' కీలక నేతలే ఎన్నికల బరిలో ఉన్నారా? అన్నట్లుగా వాతావరణం నెలకొంది. ప్రచారం సైతం ఇప్పటికే పతాక స్థాయికి వెళ్ళి, పరస్పర వ్యక్తిగత దూషణల పర్వం జోరుగా సాగుతోంది.

సాధారణంగా ఉప ఎన్నికలో ముఖ్యమంత్రి తమ పార్టీ తరుపున చివర్లో ప్రచారానికి దిగుతుంటారు. కానీ, మొదట్లో కిందిస్థాయిలో కాంగ్రెస్‌లో స్థబ్దత నెలకొన్నట్లు నివేదిక అందడంలో సిఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలో దిగారు. ఎక్కడెక్కడ లోటుపాట్లు ఉన్నాయో కసరత్తు చేసి, ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ వచ్చారు. ఇక కెటిఆర్ అన్ని పార్టీల కంటే ముందు ప్రచార బరిలోకి దూకారు. ప్రతిరోజు సమీక్షలు నిర్వహించుకుంటూ, ఏదో ఒక అంశంతో కాంగ్రెస్ అభ్యర్థిని, ముఖ్యమంత్రిని ఇరుకునపెట్టే ప్రయత్నం సాగిస్తున్నారు. ఒక దశలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిఆర్ఎస్ పైచేయి సాధించిందనే వాతావరణాన్ని సృష్టించగలిగారు.

ప్రజాపక్షం
09-11-2025, ఆదివారం

సిట్టింగ్ ఎంఎల్‌ఎ మాగంటి గోపీనాథ్ స్థానంలో ఆయన సతీమణి సునీతను పోటీ పెట్టడం ద్వారా సానుభూతి కార్డును బలంగా ప్రయోగించింది బిఆర్ఎస్. అలాగే అమలు కాని ప్రభుత్వ హామీలను జనంలోకి తీసుకెళ్ళేందుకు గులాబీ పార్టీ నేతలు శతవిధాల ప్రయత్నించారు.

ఈ అంశాలతో బిఆర్ఎస్ బలం పుంజుకుందని, పెద్ద సంఖ్యలో ఉండే మైనారిటీ ఓటర్లలో కూడా కారు పార్టీ దూసుకుపోతుందని సోషల్ మీడియా ప్రచారంతో పాటు, మౌఖిక ప్రచారం జోరుగా సాగింది. అందుకు తగ్గట్లుగా పలు సర్వేలు బిఆర్ఎస్‌కు మొగ్గు ఉన్నట్లుగా ఫలితాలను విడుదల చేశాయి. అయితే, గతంలో జరిగిన ఎన్నికల సందర్భంలోనే ప్రీ పోల్, పోస్ట్ పోల్ సర్వేల విశ్వసనీయత అడుగంటింది. వెంటనే అప్రమత్తమైన కాంగ్రెస్ తమ వైపు ప్రతికూలాంశాలను సరిదిద్దుకుంటోంది.

ఇక బిజెపి స్టార్ క్యాంపెయినర్, స్థానిక ఎంపి జి.కిషన్ రెడ్డి ఆలస్యంగా ప్రచారం మొదలుపెట్టారు. అభ్యర్థి ఎంపిక, ప్రచారపర్వం ప్రారంభం ఆలస్యమైన ప్రభావం ఆ పార్టీపై పడింది. అయినప్పటికీ, కిషన్ రెడ్డి తన వంతు పాత్రను పోషించారు. బిజెపి ఓట్లు బిఆర్ఎస్‌కు బదలాయింపు జరుగుతాయనే అభిప్రాయం పెద్ద ఎత్తున ప్రబలింది. అందుకు తగ్గట్టుగానే గత లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ అభ్యర్థుల ఓట్ల వివరాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఇదొక రకంగా బిజెపికి నష్టం చేకూర్చింది. రెండు మూడు రోజులుగా ప్రచారానికి వచ్చిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ప్రచార సరళిని మార్చి, మతపరమైన అంశాలను తెర పైకి తీసుకురావడం, మాగంటి గోపీనాథ్ మృతి పట్ల ఆయన తల్లి మాటలను ప్రస్తావించడం ద్వారా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కొత్త మలుపు తిరిగింది.

బిఆర్ఎస్ ఆశలు పెట్టుకున్న సానుభూతిపై కొంత ప్రభావం చూపే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఏదేమైనప్పటికీ కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. తమ మెజారిటీ కనీసం 20వేలతో మొదలవుతుందని కాంగ్రెస్ వర్గాలలో విశ్వాసం కనపడుతుండ గా, తమకు అధికార పార్టీకి మధ్య 5 శాతం తేడా ఉంటుందని బిఆర్ఎస్ ధీమాగా చెబుతోంది. అయితే, తాజా పరిణామాల నేపథ్యంలో బిఆర్ఎస్‌లో కొంత ఆందోళన నెలకొంది. మొత్తంగా నవంబర్ 14న ఫలితాలు వెలువడనున్న ఈ ఉప ఎన్నిక ప్రభావం రాష్ట్ర రాజకీయాలపై ముఖ్యంగా బిఆర్ఎస్, బిజెపిలపై ఉండే అవకాశం ఉంది.

# 'ఓటు చోరీ'పై దర్యాప్తు చేయాల్సిందెవరు?

**డాక్టర్ జ్ఞాన్ పాఠక్**

2024 హర్యానా శాసనసభ ఎన్నికల్లో 'ఓటు చోరీ' జరిగిందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తాజాగా ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఓట్ల దొంగతనానికి దోహదపడేలా ఓటర్ల జాబితా నుండి ఓటర్ల తొలగింపు, చేర్పింపుల కోసం చేతులు కలిపారని ఆరోపించారు.

సాధారణంగా నిందితులు చేసే మొదటి పని ఆరోపణను తిరస్కరించడం. ఆరోపణలు తప్పు అని వారు చెబుతారు. అయినప్పటికీ, ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయబడతాయి, చట్టం ప్రకారం కేసుల దర్యాప్తు సాగుతుంటుంది. ప్రస్తుత కేసులో నిందితులందరూ చట్టబద్ధంగా ప్రత్యేక హక్కులు కలిగిన వ్యక్తులు. ఇది వారిపై ఎఫ్‌ఐఆర్ దాఖలును, ఆరోపణలపై దర్యాప్తును నిరోధిస్తుంది.

అంతేకాకుండా, ఆరోపించిన నేరం సంవత్సరాల తరబడి కొనసాగింది. ఎన్నికల కమిషన్‌లో అనేక మంది అధికారులు, అధికార బిజెపి నాయకుల ప్రమేయం ఉన్నందున, 'ఓటు చోరీ' దర్యాప్తు సంక్లిష్టమైన విషయం. దీనికి చాలా సమయం, కృషి అవసరం. న్యాయ శాస్త్రం ప్రకారం నిందితుడు తనపై ఉన్న కేసును ఎంతమాత్రం దర్యాప్తు చేయకూడదు. అందువల్ల 'ఓటు చోరీ' నేరాన్ని ఎవరు దర్యాప్తు చేస్తారనేది ప్రశ్న?

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆగస్టు 7, 2025న కర్ణాటకలోని మహాదేవ్ పుర నియోజకవర్గంలో 'ఓట్ల చోరీ' ని బయటపెట్టడం ద్వారా, ఈ వ్యవహారాన్ని ఒక క్రమపద్ధతిలో ఎలా నిర్వహిస్తారనేది ఉదాహరణగా చూపించారు. తరువాత, సెప్టెంబర్ 1న ఆయన దానిని 'అణు బాంబు'గా అభివర్ణించారు. త్వరలో 'హైడ్రోజన్ బాంబు'ను వదులుతానని కూడా చెప్పారు. నవంబర్ 5న ఆయన 'హైడ్రోజన్ బాంబు'ను వేశారు. అది 2025లో జరిగిన హర్యానా శాసనసభ ఎన్నికలుకు సంబంధించినది.

'ఓట్ల చోరీ' జరిగిందని ఆరోపించబడిన కాలంలో ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఆ పదవిలో లేరు. అయినప్పటికీ, 'ఓట్ల చోరి'లో పాల్గొన్న అధికారులు, రాజకీయ వ్యక్తులను ఆయన వెనుకేసుకు వస్తున్నారు. రాహుల్ గాంధీ బయటపెట్టిన అంశాలను నిరూపించాలని, ప్రమాణపూర్వకంగా విషయాలను ధృవీకరించాలని కోరుతూ ఆయనకు ఇసిఐ నోటీసులు జారీ చేసింది. నేరానికి సంబంధించిన కొన్ని ఆధారాలను అత్యంత జాగ్రత్తగా సేకరించిన 'ఓట్ల చోరి' బాధితుడిని బెదిరించేందుకే ఈ చర్య అనేందుకు ఇది ఏమీ తీసిపోదు. ఆరోపిత 'ఓట్ల చోరి'పై ఇసిఐ ఇంకా దర్యాప్తు ప్రారంభించలేదు.

ప్రధాని నరేంద్ర మోదీతో కుమ్మక్కై ఎన్నికల ఫలితాలను బిజెపికి అనుకూలంగా మార్చినందుకు ఇసిఐకి వ్యతిరేకంగా అనేక నిరసనలు వ్యక్తమయ్యాయి. బిజెపి. 'ఓట్ల చోరీ' ప్రధానంగా నిజమైన ఓటర్లను తొలగించడం, బయటి ఓటర్లను చేర్చడం ద్వారా జరుగుతుంది. ఓటర్ల జాబితాలు తారుమారు చేయడాన్ని రాహుల్ గాంధీ బయటపెట్టా రు.

అయినప్పటికీ, బిహార్‌లో ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్(ఎస్ఐఆర్)ను మొదలుపెట్టింది. దీనిపై ప్రతిపక్ష ఇండియా కూటమి నిరసన వ్యక్తం చేసింది. బిజెపికి అనుకూలంగా 'ఓట్ల చోరీ' చేయడం కోసమే ఈ ఓటర్ల జాబితాను తారుమారు చేసే ప్రయత్నం అని ఆరోపించింది. లక్షలాది మంది ఓటర్లు బయటి నుండి ఎలా చేర్పించబడ్డారో దేశ ప్రజలు చూశారు, అయితే లక్షలాది మంది నిజమైన ఓట్లు తొలగించబడ్డాయి. తొలగింపు లేదా చేర్పింపులకు వ్యతిరేకంగా ఓటర్‌ల నుంచి నిర్దేశిత ఫారమ్‌లు ద్వారా ఎలాంటి విజ్ఞప్తి లేదని ఇసిఐ వాదన. ఇది బలహీనమైన రక్షణ. ఎందుకంటే పోలీసులు, యంత్రాంగం బాధితులను అవమానిస్తున్నందున చాలామంది నేరాన్ని నివేదించడానికి బయటకు రావడానికి ఇష్టపడరని అందరికీ తెలుసు. తొలగింపులు, చేర్పులపై రాజకీయ పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. కానీ అవి సరైన ఫారమ్‌లలో దాఖలు చేయబడలేదని ఇసిఐ చెబుతోంది. ఇది నేరాన్ని నివేదించే వ్యక్తులకు అవమానం. ప్రతిపక్ష నాయకుడిని సైతం ప్రధాన మంత్రి, ఇసిఐ, హోం మంత్రి వదిలిపెట్టరు. 'ఓట్ల చోరి', దాని వెనుక ఉన్న కుట్ర గురించి లేవనెత్తినందుకు ఆయనను పదేపదే అవమానిస్తున్నారు. తాజాగా దేశంలోని 12 రాష్ట్రాలు, యుటిలలో రెండవదశ ఎస్ఐఆర్ జరుగుతోంది. మూడవ దశలో మిగతా దేశం మొత్తంతటా అమలు చేయబడుతుంది.




ఈ నేపథ్యంలో, హర్యానాలో రాహుల్ గాంధీ చేసిన 'ఓట్ల చోరీ' అనే తాజా ఆరోపణకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. హర్యానా విధాన సభ ఎన్నికల్లో 'ఓట్ల చోరీ' జరిగిందని ఆయన నొక్కిచెప్పారు. భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడానికి భారత ఎన్నికల సంఘం, ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రితో చేతులు కలిపారని ఆరోపించా రు.

కర్ణాటకలోని మహదేవ్‌పూర్ శాసనసభ స్థానం ఓటర్ల జాబితా నుండి ఓటర్ల పేర్లను తొలగించిన ప్రయత్నం వెనుక ఉన్న వ్యక్తుల సాంకేతిక వివరాలను పంచుకోవడానికి నిరాకరించడం ద్వారా భారత ప్రజాస్వామ్యాన్ని 'ధ్వంసం' చేస్తున్న వారిని సిఇసి జ్ఞానేశ్ కుమార్ రక్షిస్తున్నారని రాహుల్ ఆరోపించారు.

హర్యానాలో, హర్యానా ఓటర్ల జాబితాలో 5,21,619 మందికి పైగా నకిలీ ఓటర్లు ఉన్నారని ఆయన ఆరోపించారు. ఈ ఓటు చోరి వ్యవస్థ పారిశ్రామికీకరించబడిందని, వారు బిహార్‌లో కూడా ఇదే పని చేస్తారని మాకు కచ్చితంగా తెలుసునని అన్నారు. రెండు బూత్‌లలో వేర్వేరు పేర్లతో ఒకే ఓటరు ఫోటో 223 సార్లు కనిపిస్తుందని రాహుల్ గాంధీ నిర్దిష్ట ఆరోపణలు చేశారు. 'హర్యానాలో వేలాది ఉదాహరణలు ఉన్నాయి' అని ఆయన అంటున్నారు. హర్యానాలో ఒకే ఫోటోతో 1,24, 177మంది ఓటర్లు ఉన్నారని ఆయన అన్నారు. 'ఇసిఐ సిసిటివి ఫుటేజ్‌ను నాశనం చేస్తున్నారు' అని ఆయన ఆరోపించారు.

హర్యానాలో దాదాపు 25 లక్షల మంది ఓటర్లు నకిలీ ఓటర్లు అని ప్రతిపక్ష నాయకుడు ఆరోపించారు. బ్రెజిలియన్ మోడల్ ఫోటోను ఉపయోగించుకొని 10 బూత్‌లలో 22 సార్లు ఓటు ఉపయోగించిన ఓటరు ఫోటో గుర్తింపు కార్డు (ఎపిక్)ని కూడా అతను చూపించాడు.

రాహుల్ గాంధీ ఈ ఆపరేషన్ మొత్తానికి 'ఆపరేషన్ సర్కార్ చోరి' అని పేరుపెట్టారు. ఓట్ల దొంగతనం నియోజకవర్గ స్థాయిలోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా జరుగుతోందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడి ఆరోపణలు తీవ్రమైనవి. వాటిపై సమగ్ర దర్యాప్తు అవసరం. అయితే, మిలియన్ డాలర్ల ప్రశ్న ఏమిటంటే దీన్ని ఎవరు చేస్తారు? పాలక ప్రభుత్వం, ఇసిఐ నిందితులుగా ఉన్నాయి. రాహుల్ గాంధీ మహాదేవ్‌పురాలో ఓట్ల దొంగతనంను బహిర్గతం చేసిన కేసులో చర్య కోసం ఇసిఐ వద్దకు వెళ్లాలని భారత సుప్రీంకోర్టు ఇటీవల ఒక పిటిషనర్‌ను కోరింది. ఒక పౌరుడు ఏమి చేయగలడు?

# జోహ్రాన్ మమ్దానీ గెలుపు - నవచరిత్రకు మలుపు

అమెరికాలో ఇటీవల జరిగిన మేయర్ మరియు గవర్నర్ ఎన్నికల్లో డెమొక్రాట్స్ విజయ దుందుంభి మోగించారు. ఈ విజయాలను ట్రంప్ పాలనా విధానాలకు పెద్ద ఎదురుదెబ్బగా భావించవచ్చు. ముఖ్యంగా డోనాల్ ట్రంప్ అమెరికాకు రెండవసారి అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత జరిగిన ఈ మొదటి ప్రధాన ఎన్నికల ప్రక్రియ ద్వారా ప్రజానీకం ఆయన విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని చాలా సృష్టంగా విదితమవుతూనే ఉంది అని చెప్పవచ్చు.

అమెరికాలో అతిపెద్ద నగరం, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ రాజధాని అయిన న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికలలో డెమోక్రట్ పార్టీ తరపున డెమోక్రటిక్ సోషలిస్టుగా పరిగణించబడే మొదటి దక్షిణాసియా, మొదటి భారతీయ సంతతి, మొదటి ముస్లిం అభ్యర్థి మరియు క్వీన్స్ అసెంబ్లీ సభ్యుడు అయిన 34 ఏళ్ల జోహ్రాన్ మమ్దానీ తొలి సోషలిస్టు మేయర్‌గా విజయం సాధించి నవ చరిత్రకు మలుపుగా అయినారు. ఆయన అమెరికాలో సరికొత్త రాజకీయాలకు నాంది పలికాడు.



జోహ్రాన్ మమ్దానీ 1991 అక్టోబర్ 18 నాడు మహమూద్ మమ్దానీ, మీరా నాయర్ దంపతులకు ఉగాండాలోని కంపాలాలో జన్మించారు. ఆయన తల్లి మీరా నాయర్ ప్రముఖ భారతీయ అమెరికన్ దర్శకురాలుగా ప్రసిద్ధి పొందారు. జోహ్రాన్ మమ్దానీ ఏడేళ్ల వయసులో తల్లిదండ్రులతో కలిసి న్యూయార్కుకు వెళ్లి 2018లో అమెరికా పౌరసత్వం పొందాడు. ఆయన బౌడోయిన్ కళాశాల నుండి ఆఫ్రికన్ స్టడీస్‌లో డిగ్రీతో పట్టభద్రులయ్యారు.2020లో తొలిసారిగా న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

జోహ్రాన్ మమ్దానీ సామ్రాజ్యవాద దేశంలో తనకు తాను 'డెమోక్రటిక్ సోషలిస్ట్' అని సగర్వంగా చెప్పుకున్నారు. అయితే డెమోక్రాటిక్ పార్టీ తరపున న్యూయార్క్ మేయర్ అభ్యర్థిత్వానికి పోటీపడిన పదకొండు మందిని వెనక్కునెట్టి జూన్ 24 నాడు మమ్దానీ నామినేట్ కావడం నుండి మేయర్ ఎన్నికల చివరి వరకు అధ్యక్షుడు ట్రంప్ ఆయనను లక్ష్యంగా చేసుకుని 'జ్యూస్ హేటర్' గాను, 'కమ్యూనిస్ట్' గాను, రాడికల్ డెమొక్రటిక్ గాను, యూదుమత వ్యతిరేకిగాను రకరకాలుగా గాఢమైన విమర్శలతో అభివర్ణించాడు. 'జోహ్రాన్ మమ్దానీ గెలిస్తే అమెరికన్ సమాజంలో ఆర్థిక, సామాజిక విపత్తు సంభవిస్తుంది అని, భయోత్పాతాలు సృష్టించబడతాయి' అని అధ్యక్షుడు ట్రంప్ ప్రజలను ఆందోళనలకు గురిచేసిన తీరు అహేతుకతకు అద్దం పట్టింది . అంతిమంగా న్యూయార్క్‌కు చట్టబద్ధంగా రావాల్సినవి తప్ప ఫెడరల్ ఫండింగ్ ఇవ్వకుండా ఆపివేస్తాను అని ట్రంప్ బెదిరించిననూ ఆ బెదిరింపులను ఖాతరు చేయని న్యూయార్క్ ప్రజలు జోహ్రాన్ మమ్దానీకే పట్టం కట్టడం పట్ల ప్రజలకు ఆయన పట్ల ఉన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తుంది.

న్యూయార్క్ నగరంలో 'ప్రజా సంక్షేమమే ధ్యేయం' అని జోహ్రాన్ మమ్దానీ ప్రకటించారు. విద్య, వైద్యం, గృహ వసతి వంటి మౌలిక రంగాలు ప్రైవేటీకరించబడడం మూలంగా ముఖ్యంగా శ్రామిక ప్రజానీకం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించి ఆరోగ్యం, పబ్లిక్ స్కూళ్ల బలోపేతం, ఇంటి అద్దెల నియంత్రణ, కనీసవేతన అమలు, ఉచిత ప్రజా రవాణా, కార్మిక హక్కుల అమలు మరియు వలస కుటుంబాల వారికి రక్షణ కల్పించడం మొదలైన హామీలు ఆయన ప్రకటించారు. ధనికులపై పన్నులు పెంచి, ఆ నిధులతో ప్రభుత్వ కార్యక్రమాలకు నిధులు సమకూరుస్తానని ఆయన వాగ్దానం చేయడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. ఆ రకంగా ఆయన ప్రకటించిన ప్రజా సంక్షేమ హామీలు ప్రజలను విశేషంగా ఆకట్టుకోవడం మూలంగా ఆయనను విజయం సులువుగానే వరించింది అని చెప్పవచ్చు.

ఉదారవాద పురోగామి ఎజెండాతో ప్రచారం నిర్వహించిన జోహ్రాన్ మమ్దానీకి ప్రజలు పట్టం కట్టడం 'డెమొక్రటిక్ పార్టీకి నూతన ఉత్సాహాన్ని ఇచ్చింది' అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

జోహ్రాన్ మమ్దానీ మేయర్‌గా ఎన్నిక కాగానే భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మాటలను గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా 'ఎన్నికల్లో విజయం ఓ చారిత్రాత్మక క్షణం. అణచివేతకు గురైన దేశ ఆత్మ జాగృతమై తన గొంతుక వినిపించిన అద్భుత క్షణం ఇది. ఈ కొత్త శకంలో న్యూయార్క్ ప్రజలు స్పష్టత, దార్శనికత, ధీరత్వంతో కూడిన నాయకత్వాన్ని చూస్తారు. పాత శకా న్ని వదిలి కొత్త శకాన్ని అనుసరించినప్పుడు సుదీర్ఘంగా అణచివేతకు గురైన జాతి గళం విప్పినప్పుడు ఇలాంటి క్షణా లు చాలా అరుదుగా మాత్రమే సంభవిస్తాయి. ఇప్పుడు మనం ఒక నవశకంలోకి అడుగుపెడుతున్నాం. ఈ కొత్త శకంలో న్యూయార్క్ ప్రజలు స్పష్టత, దార్శనికత, ధీరత్వంతో కూడిన నాయకత్వాన్ని చూస్తారు' అనే నెహ్రూ వ్యాఖ్యలను ఆయన ఉటంకించడం తద్వారా నవచరిత్రకు మలుపుగా నిలిచారు. ఆ క్రమంలోనే 'న్యూయార్క్ నగర మేయర్ ఎన్నిక రాజకీయ రాజవంశాన్ని కూల్చివేసింది. ఇకపై మా పోరు మరింతగా పెరుగుతుంది. ఈ తీర్పు మార్పుకు సంకేతంగా నిలిచింది. మా భవిష్యత్తు మా చేతుల్లోనే ఉంది' అని జోహ్రాన్ మమ్దానీ వ్యాఖ్యానించడాన్ని ప్రత్యేకం గా గమనించవచ్చు.

అమెరికాలో సంప్రదాయ వాద భావజాలం వేళ్లూనుకుంటున్న తరుణంలో వామపక్ష సమర్థకులు డెమొక్రటిక్ పార్టీ వైపుగా పయనించడాన్ని చాలా స్పష్టంగా గమనించవచ్చు. 'డెమొక్రటిక్ పార్టీలో ఉన్న పురోగామి శక్తులు నీరుగారిపోకుండా మరింతగా తమ స్థానాన్ని పటిష్టపరుచుకొనేందుకు జోహ్రాన్ మమ్దానీ సాధించిన విజయం ఎంతగానో స్ఫూర్తినిస్తుంది' అని చెప్పవచ్చు.

**జెజెసిపి. బాబూరావు**
రీసెర్చ్ స్కాలర్,
94933 19690.

# యువతలో న్యాయ స్ఫూర్తి

సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలంటే యువతకు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన ఉండడం అత్యంత ముఖ్యమైంది. న్యాయ జ్ఞానం లేకపోవడం వారిని తప్పుదారిలోకి నడిపించవచ్చు; చట్టంపై అవగాహన కలిగి ఉండడం యువతను హింస, మోసం, దుర్వినియోగం వంటి ప్రమాదాల నుండి రక్షిస్తుంది. వ్యక్తిగత జీవితంలోనూ, సామాజిక పరిసరాలలోనూ చట్టపరమైన పద్ధతిలో ఎలా వ్యవహరించాలో తెలుసుకోవడం ప్రతి యువకుడికి అవసరం. న్యాయ అవగాహన యువతలో ధైరం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించి సమాజంలో సక్రమమైన వాతావరణాన్ని నిర్మించడంలో దోహదం చేస్తుంది.

యునిసెఫ్(UNICEF) పిల్లల న్యాయ వెబ్‌సైట్ వంటి కార్యక్రమాలు పిల్లలకు సులభమైన, ఆకర్షణీయమైన న్యాయ సమాచారాన్ని అందిస్తాయి. భారతదేశంలో పాఠశాలల్లో న్యాయ విద్యకు చారిత్రకంగా తక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఫలితంగా అనేక తరాలు రాజ్యాంగం, పౌర హక్కులు, న్యాయ వ్యవస్థపై పరిమిత అవగాహనతో పరిమితమయ్యాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉండాలంటే పౌరులు చట్టం, న్యాయం, బాధ్యతను సమగ్రమైన రీతిలో అర్థం చేసుకోవాలి.

CBSE పాఠ్యాంశాల్లో న్యాయ విద్య రాజ్యాంగ సూత్రాలు, ప్రాథమిక హక్కులు, సైబర్ చట్టాలు, వినియోగదారుల హక్కులు కవర్ చేయడం విద్యార్థులకు చట్టపరమైన పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడంలో, న్యాయం, సమానత్వం, బాధ్యత వంటి విలువలను నేర్చుకోవడంలో సహాయపడుతుంది. న్యాయ అవగాహనలో ముఖ్య అంశాలు: రాజ్యాంగ హక్కులు, న్యాయ వ్యవస్థ అవగాహన, వినియోగదారుల రక్షణ, సైబర్ భద్రత, బాలహక్కులు, మానవ హక్కులు. చిన్న వయసులోనే వీటిని అర్థం చేసుకోవడం యువతకు శక్తివంతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, చట్టపరమైన మేధస్సు, బాధ్యతాయుతంగా వ్యవహరించగల సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది.

(ప్రతి సంవత్సరం నవంబర్ 9న జరుపుకునే జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంలో)

**డా॥ కృష్ణ కుమార్ వేపకొమ్మ**
ప్రొఫెసర్ & ప్రిన్సిపాల్ (రిటైర్డ్)
హైదరాబాద్–500045

## షూటింగ్ బాల్ క్రీడలకు శివకుమార్ ఎంపిక

**ప్రజాపక్షం/ మక్తల్ :** మక్తల్ మండలం కర్ని గ్రామానికి చెందిన కొండపల్లి శేఖర్ , మణెమ్మ కుమారుడు కొండ పల్లి శివకుమార్, జిల్లా పరిషత్ న్నత పాఠశాల కర్ని లో ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న శివకుమార్ క్రీడల పై మక్కువ పెంచుకొని, పాఠశాల పిడి. రూప దగ్గర షూటింగ్ బాల్ క్రీడల్లో మెరుగైన శిక్షణ పొంది, మక్తల్ లో 2023 జూలైలో జరిగిన జిల్లా షూటింగ్ బాల్ క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికై, ఆగస్టు 2023 మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ లో జరిగిన షూటింగ్ బాల్ క్రీడల్లో పాల్గొని ప్రశంసా పత్రం పొందినాడు. అలాగే 2024 డిసెంబర్లో మహబూబాదాద్ జిల్లా కేసము ద్రంలో జరిగిన జూనియర్ షూటింగ్ బాల్ రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొని ప్రశంసా పత్రం పొందినాడు. అలాగే 2025 మార్చి లో నల్లగొండ లో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొని ప్రశంసా పత్రం, సిల్వార్ మెడల్ సాధించినాడు. అలాగే నారాయనపేట జిల్లా బిజ్వార్ ల్లో జరిగిన జూనియర్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొని సర్టిఫికెట్ పొందినాడు.

## కాలనీల సమస్యలు పరిష్కరిస్తా

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** కాలనీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం డివిజన్‌లోని హిల్ కాలనీలో ఆజాద్ క్రాంతి సాంగ్ కమ్యూనిటీ హాల్ పలు పనులను ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ కాలనీల అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. డివిజన్‌లో ప్రతి కాలనీల్లో సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కాలనీ అధ్యక్షులు ఆర్. జగదీష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి



కొలిశెట్టి సంజయ్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ బీరం శ్రీధర్, ఉపాధ్యక్షులుఎంపీ నరసింహారాజు,సంయుక్తకార్యదర్శి కట్టం క్రాంతి గౌడ్‌ఉన్నారు.

## విద్యుత్ ప్రమాదంలో ఒకరు మృతి



**ప్రజాపక్షం/యాచారం :** విద్యుత్ ప్రమాదంలో ఒ వ్యక్తి మృతి చెందిన సంఘటన యాచారం పోలిస్‌స్టేషన్ పరిధిలోని మాల్ గ్రామంలో శనివారం ఉదయం బకాసుర హోటల్ సమిపంలో జరిగింది. ఈసంఘటనకు సంబంధించి యాచారం సిఐ నందిశ్వర్ రెడ్డి, ఎస్ఐ మధు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.నల్గోండ జిల్లా మర్రిగూడ మండలం అజాల్లాపూర్ గ్రామానికి చేందిన మాదగోని వేంకటేశ్వర్లు (40) మాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని బకాసుర హోటల్ సమిపంలో నూతనంగా ఇంటి నిర్మాణం చేస్తున్నారు. ఇంటి ముందు 11 కేవి విద్యుత్ వైర్లు ఉన్నాయి. వాటికి ప్లాస్టిక్ పైపులు వేసి పనులు కోనసాగిస్తున్నారు.ఎప్పటిలాగేనే శనివారం ఉదయం వేంకటేశ్వర్లు నూతనంగా నిర్మిస్తున్న ఇంటిపైకి ఎక్కి నిళ్ళుకోట్టడానికి వేళ్ళాడు ప్రమాద వశాత్త్ విద్యుత్ ప్రమాదం జరిగింది. దింతో వేంకటేశ్వర్లు (40 ) అక్కడికక్కడే మృతి చేదాడు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని మాల్ గ్రామంలో అందోళన చెపట్టారు.వేంకటేశ్వర్లు భార్య మదగాని లక్ష్మి దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని ధర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి



**ప్రజాపక్షం/షాబాద్:** దివంగత నేత పట్నం రాజేందర్ రెడ్డి ఆశయ సాధనకు పట్నం కుటుంబం నిరంతరం కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలోపట్నం రాజేందర్‌రెడ్డి జయం తి సందర్భంగా పట్నం కుటుంబ సభ్యులు కొండగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డిలు పార్టీ కార్యకర్తలతో కలిసి విగ్రహానికి నివాళ్లు అర్పించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. షాబాద్ అభివృద్ధికి కంకణం కట్టుకున్న దివంగత నేత పట్నం రాజేందర్ రెడ్డి ఆశయాలను ప్రజలకు అండగా ఉంటు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందరికి అందేవిధంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, రుద్రారం మహేందర్ రెడ్డి, కుమ్మరి దర్శన్, ముక్కు విశ్వం, నర్సింగ్ రావు, నక్క శ్రీనివాస్ గౌడ్, రమేష్ యాదవ్, ముక్రహం తదితరులు ఉన్నారు.

## హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన వితరణ



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి;** హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు 3 సంవత్సరాలు పూర్తి చేసుకొని 4వ సంవత్సరంలోకి అడుగుతున్నమని హోప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండా విజయ్ కుమార్ తెలిపారు. శనివారం చందానగర్‌లోని హోప్ ఫౌండేషన్ కార్యలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండా విజయ్ కుమార్ మాట్లాడుతూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అందులో భాగాంగా ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామని ఈ శనివారంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా 3 సంవత్సరాలు పూర్తి చేసుకొని 4వ సంవత్సరంలోకి అడుగు పెట్టడంతో పాటు 157వ వారానికి చేరుకుందని తెలిపారు. పలువురు సంఘ సేవకులతో పాటు సుమారు 2,000 మంది వరకు పాల్గొన్నారని తెలిపారు.

## నిరుపేదల కోసం నిరంతర పోరు

**ప్రజాపక్షం/షాబాద్:**నిరు పేదల కోసం వంద ఎండ్లు విజయవంతంగా పోరాటం చేసిన ఘనత సిపిఐ పార్టీకే దక్కుతుందన్నారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఇంచార్జ్ రామస్వామి, ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామాల్లో నిరు పేదలకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగం, వడ్ల సత్యనారాయణ, మంజుల, సుధాకర్ గౌడ్, అంజయ్య వివిధ మండలాల కార్యదర్శులు సత్తి రెడ్డి, శ్రీశైలం, సుధీర్, శ్రీనివాస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో విఫలం

**ప్రజాపక్షం/యాచారం :** కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని సిఐటియు రంగారెడ్డి సహయకార్యదర్శి పి. బ్రహ్మయ్య విమర్శిచారు.శనవారం యాచారం మండల కేంద్రంలో సిఐటియు జనరల్ బాడి సమావేశం జరిగింది. ఈసమావేశానికి అయన ముఖ్యఅతిథిగా హాజరై నూతన కమిటిని ఎన్నుకున్నారు.సిఐటియు మండల కన్వినర్‌గా రెండవ సారి సబావట్ చందునాయక్‌ను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ఈనేల 11,12లో నగరంలోని కాటేదాన్ లో జరిగే సిఐటియు రంగారెడ్డి జిల్లా 4 మహసభలను విజయవంతం చేయాలన్నారు.కార్మికులకు కనిసవేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలన్నారు.నాలుగు లేబర్ కోడ్‌లు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఉద్యోగులందరిని పర్మినేంటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జంగయ్య, బాల్‌రాజ్, నోముల యాదగిరి, బుగ్గరాములు, రవి, రమేశ్, బాల కృష్ణ, సత్తయ్య,పద్మ, యాదమ్మ, బోడ కృష్ణ, కవిత, విజయ, బాలమణి అలివేలు,సుశీల తదితరులు పాల్గోన్నారు.

### శాంతిభద్రతల పరిరక్షణలో

# 'ఆర్మ్‌డ్ రిజర్వ్' పాత్ర కీలకం

### పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:**శాంతిభద్రతల పరిరక్షణలోసిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ (సిఎఆర్) విభాగ సిబ్బం ది పాత్ర కీలకమని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనర్ అన్నారు. పోలీసుశాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ సంపూర్ణ క్రమశిక్షణ కలిగి ఉండాలని, బాధ్యతగా తమ విధులను నిర్వర్తించాలని ఆయన సూచించారు. హైదరాబాద్ పేట్ల బురుజులోని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్‌లో శనివారం జరిగిన సెరిమోనియల్ పరేడ్‌లో సజ్జనర్ పాల్గొన్నారు. సిబ్బంది నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. దశాబ్దాల చరిత్రగల సిటీ ఆర్మ్‌డ రిజర్వ్ విభాగానికి మంచి పేరు ఉందని, సిబ్బంది నిబద్ధత, అంకితభావంతో పని చేస్తున్నారని కొనియాడారు.ఇతర ఉద్యోగాలతో పోలిస్తే పోలీస్ ఉద్యోగం చాలా భిన్నంగా ఉంటుందన్నారు. కుటుంబసభ్యులకు ప్రాధాన్యం ఇస్తూ.. ఆరోగ్య పరిరక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రతి రోజు విధిగా వ్యాయామం చేయాలన్నారు. ప్రతి ఒక్కరు సమయాన్ని వృథా చేయకుండా నైపుణ్యాన్ని నేర్చుకోవాలని, వృత్తి రీత్యా పోలీస్ శాఖలో వస్తోన్న నూతన పోకడలను అందిపుచ్చుకోవాలన్నారు.కాగా, ఎఆర్ కు చెందిన 1044 మంది ఈ పరేడ్‌ని నిర్వహించారు. అందులో సిటీ సెక్యూరిటీ గార్డు, స్వాఫ్ట్, క్వీక్ రియాక్షన్ టీమ్, సిటీ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, తదితర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. పరేడ్ అనంతరం ఎఆర్ సిబ్బందితో నేరుగా సజ్జనార్ మాట్లాడారు. పనితీరుతో పాటు క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న ఇబ్బందులను వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొన్ని సమస్యలను తన దృష్టికి తీసుకురాగా, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తర్వాత సిఎఆర్ హెడ్ క్వార్టర్స్ ప్రాంగణాన్ని సందర్శించారు. క్రెచ్, ఆరమ్స్ అండ్ అమ్మునిషన్ స్టోర్ రూమ్, ఆమ్స్ వర్క్ షాప్, బ్యారక్స్ వంటి అన్ని విభాగాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం హెడ్ క్వార్టర్స్‌లోని అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి. మెరుగైన పోలీసింగ్ కొరకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎఆర్ డిసిపి రక్షిత కృష్ణమూర్తి అదనపు డిసిపిలు ఎన్. భాస్కర్, బి. కిష్టయ్య, టి. కరుణాకర్, డి. సంజీవ రెడ్డితో పాటు తదితర అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి స్మగ్లింగ్‌లో హోంగార్డు

### రూ. 7.50 లక్షల గంజాయి పట్టివేత

### కారుతో పాటు ఇద్దరు అరెస్ట్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేరాలను...పసిగట్టి నియంత్రంచాల్సిన పోలీసు హోంగార్డు తన విధులను మరచి గంజాయిని స్మగ్లర్ రూపంలో తనకారులోనే హైదరాబాద్ కు తరలిస్తూ ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ సి టీం కు పట్టు బడ్డాడు. ఒడిస్సా మల్కాన్ గిరి జిల్లాలో ఉమాకాంత్ నాగర్ అనే వ్యక్తి తన వద్ద ఉన్నటువంటి 15.33 కేజీల గంజాయిని హైదరాబాదులో ఇవ్వాలని మల్కాజ్‌గిరికి చెందిన హోంగార్డుతో కాంటాక్ట్ కుదుర్చుకున్నాడు. ఒప్పందం మేరకు హోమ్ గార్డ్ నీలంబర్ మీర్కన్ తన కారులో గంజాయిని హైదరాబాద్ కు తీసుకొని వస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌టిఎఫ్ సి టీం సిబ్బంది శనివారం ఉదయం రామోజీ ఫిలిం సిటీ ప్రాంతాల్లో కారును పట్టుకున్నారు. పట్టుకున్న కార్ లో గంజాయి ఆనవాళ్లు కనిపించలేదు. పట్టు వదలని విక్రమార్కుల్లా కారు డిక్కీ లో ఉన్న స్టెఫ్నిటైర్‌ను పరిశీలించారు. టైర్ డెస్క్‌లో నాలుగు గంజాయి పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని తూకం వేయగా15.33 కెజిలుగా గంజాయి ఉన్నట్లు గుర్తించారు.హోంగార్డు నీలంబర్ మిల్కాను (50), కారు నడుపుకుంటూ వస్తున్న సోనా కాలాను(35) అరెస్ట్ చేశారు. గంజాయి సరఫరా చేసిన ఉమాకాంత్‌పై కేసు నమోదు చేశారు. కారును గంజాయిని ఇద్దరు నిందితులను హయత్ నగర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సి టీం లీడర్ డిఎస్‌పి తులా శ్రీనివాసరావు తెలిపారు. గంజాయిని పట్టుకున్నటువంటి సి టీం ను ఎక్సైజ్ ,ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షాన్వాజ్ ఖాసీం అభినందించారు.

# కైదమ్మకుంట చెరువుకు దశ, దిశ మారింది

### శేరిలింగంపల్లి ఎంఎల్‌ఎ అరెకపూడి గాంధీ



**ప్రజాపక్షం/మియాపూర్:** కైదమ్మ కుంట చెరువుకు దశ దిశ మారిందని, ఎన్నో ఏండ్ల సమస్య తీరుతుందని శేరిలింగంపల్లి ఎంఎల్‌ఎ అరెకపూడి గాంధీ అన్నారు.శనివారం హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కైదమ్మ కుంట చెరువు సుందరీకరణ లో భాగంగా నెక్సస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువు పునర్జీవనంలో భాగంగా సుందరీకరణ,పునరుద్ధరణ పనులను స్థానిక కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఎం ఎల్ ఎ అరెకపూడి గాంధీ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైదమ్మ కుంట చెరువు దశ దిశ మారుతుందని, వర్షాకాలంలోపు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.కైదమ్మ కుంట చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం,పరిశ్రమలు, సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్ధవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుందని, ఈ ప్రాజెక్ట్ కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధి కోసం ఒక నమూనాను ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. కైదమ్మ కుంట చెరువుకు దశ దిశ మారిందని,ఎన్నో ఏండ్ల సమస్య కు తెరపడునుందన్నారు.శాశ్వత పరిష్కారం దిశగా చెరువును అభివృద్ధి చేపట్టడం జరిగిందని ఎం ఎల్.ఎ స్పష్టం చేశారు.కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్,సిఎస్ఆర్ ఐటి సంస్థ ప్రతినిధులు చైతన్య, నాయకులు వెంకటేష్ గౌడ్, సుదేశ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

### అన్ని చెరువులను శోభితవనాలుగా తీర్చిదిద్దుతాం



శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 64 చెరువులను సుందర శోభితవనాలుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు.శనివారం మియాపూర్ లోని పటేల్ చెరువు,గుర్నాథమ్ చెరువు, మక్తా మహబూబ్ పెట్‌లోని పెద్దకుడి చెరువులను నెక్సస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ వారి సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువు పునరుజ్జీవనంలో భాగంగా సుందరీకరణ, పునరుద్ధరణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ లతో కలిసి పరిశీలించారు. కుడి కుంట చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించమని చెరువును తర్వలోనే సుందరీకరిస్తామని అన్నారు. కాలనీ వాసులు కూడా సహకరించి చెరువుల వద్ద చెత్తాచెదారం వేయకుండా శుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ ఐటీ సంస్థ ప్రతినిధి చైతన్య మరియు కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణిస్తేనే భవిష్యత్

### ఠాగూర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఎన్.కె.రాజేంద్రప్రసాద్




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఠాగూర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఎన్.కె.రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న ఠాగూర్ ఉన్నత పాఠశాల అడిటోరియంలో విద్యార్థులకు నిర్వహించిన సైన్స్‌ఫెర్‌లో అనేక అంశాలపై అవగాహన కల్పించారు. సైన్స్‌ఫెర్ ఉత్సవాలను ఎంతో అట్టహాసంగా ప్రారంభించారు.కరస్పాండెంట్ ఎన్‌కె రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని, అప్పుడే వారి భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, లీడర్‌షిఫ్ లక్షణాలను కలిగి ఉండాలని పేర్కొన్నారు. పాఠ్యంశాలను కష్టంగా కాకుండా ఇష్టంతో అభ్యసిస్తే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకునే అవకాశాలు ఉంటాయని వివరించారు. సైన్స్‌ఫెర్‌తో విద్యార్థుల జీవితాల్లో అనేక మార్పులు వస్తాయని, పెరుగుతున్న సాంకేతిక రంగాలపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఏ విద్యార్థి అయినా తాను తక్కువ అనే భావన లేకుండా ముందుకు సాగినప్పుడే అన్ని రంగాల్లో రాణించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలతోపాటు ప్రత్యేకంగా అభినంధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అంజలి, సంధ్య, మంజుల, ఉపాధ్యాయులు లావణ్య, ఉమారాణి, రజిత దేవి, కళ్యాణి, రజిని, మనిషా పాల్గొన్నారు.

## రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ పూసల కలకలం

### ఆందోళన వ్యక్తం చేస్తున్న రేషన్ లబ్ధిదారులు



**ప్రజాపక్షం/కేశంపేట:** ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ పూసలు రావడంతో రేషన్ లబ్దిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం కేశంపేటమండలపరిధిలోనిలింగంధన, తొమ్మిదిరేకుల గ్రామాల్లో ఉన్న రేషన్ షాపుకు వచ్చిన బియ్యంలో ప్లాస్టిక్ పూసలు రావడాన్ని సిండిల్ విండో డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి సూపించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సరఫరా చేసే రేషన్ బియ్యంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఇలాంటి ప్లాస్టిక్ పూసలు వస్తున్నాయని మండిపడ్డారు. పేద ప్రజలకు అంధించే బియ్యంపై ప్రభుత్వం ఇంతచిన్న చూపు చూడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.పేదలకు సన్న బియ్యం ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడమే తప్పా చేసేది ఇదేనా అని ప్రశ్నించారు. గ్రామీణ పేదలకు నాణ్యమైన భోజనం అంధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేని పక్షంతో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వివరించారు. లింగంధన, తొమ్మిదిరేకుల గ్రామాలకు వచ్చిన ప్లాస్టిక్ సూసల విషయాన్ని కేశంపేట తహశీల్దార్ రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళారు. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి ఈ రెండు రేషన్ షాపులకు వచ్చిన బియ్యాన్ని గోదాముకు తరలించాలని అదేశించారు. నాణ్యమైన సన్న బియ్యం పరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని అదేశించారు.

## సిఎంకు శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైద్రాబాద్ లోని సిఎం నివాసంలో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పూలబోకే అంధించి జన్మదిన శుభాకాంక్షలు తెలిజేశారు.

### జన్మదిన శుభాకాంక్షలు సార్..



హైద్రాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో తెలంగాణ రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ సాధిక్ సిఎం రేవంత్‌రెడ్డిని అభినందించారు.

## సాహసోపేత నిర్ణయాలతో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

### శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సాహసోపేత నిర్ణయాలతో విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేస్తూ మౌళికసదుపాయాలరూపకల్పనలోతనదైన ముద్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేసుకున్నారని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి అందరికి స్వీట్లు తినిపించారు. ప్రభుత్వ ఆసుపత్రిల రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని, వారి అడుజాడల్లో నడిచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వివరించారు.

### కెకె కృష్ణ సహకారంతో 15బస్‌స్టాప్‌లు

కాంగ్రెస్ యువనేత కెకె కృష్ణ సహకారంతో సుమారు రూ.30లక్షల వ్యయంతో 15బస్ స్టాప్‌లను నిర్మించనున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా షాద్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్ స్టాప్‌లను ఎమ్మె ల్యే ప్రారంభించారు. పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, నేతలు రఘునాయక్, బస్వం, కృష్ణారెడ్డి, చెంది తిరుపతి రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి వెంకట్‌రాం రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మధన్‌మోహన్ రెడ్డి, మంగులాల్ నాయక్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అభినందన



**ప్రజాపక్షం/కేశంపేట:** ప్రజల కష్టాల నుండి పుట్టిన మహా నాయకుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని కేశంపేట మాజీ జడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కాంగ్రెస్ అభిమానులకు తినిపించారు. తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవలో నిమగ్నమవుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నిండు నూరేళ్ల అయురారోగ్యాలను భగవంతుడు ప్రసాదించాలని వేడుకున్నట్లు తెలిపారు. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు కరుణాకర్, భాస్కర్ గౌడ్, నేతలు కరుణాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గిరి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్, పర్వతాలు, రావుల పెంటయ్య, నర్సింలు, మనోహార్, రాములు, జంగయ్య, కృష్ణయ్య, అమీర్, రాఘవేందర్, నాగేష్, పాండు, భీమయ్య, ప్రకాష్, గోపాల్, శ్రీకాంత్, నరేందర్, రాజేష్, ముత్యాలు, మహిళా అధ్యక్షురాలు రాణి, అనసూయమ్మలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** చందానగర్ మాజీ కౌన్సిలర్,శేరిలింగంపల్లి మండల మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొండవీటి సునీత ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమమానికి ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టి ఇంచార్జీ, తెలంగాణ రాష్ట్ర పిసిసి ప్రధానకార్యదర్శి జగదీశ్వర్ గౌడ్ విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కెక్ కట్ చేసి అందరికి పంచి తదుపరి నిర్వహించిన అన్నదాన కార్యక్రమం జరిగింది. మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు, చందానగర్ యూత్ అధ్యక్షులు మధు, విద్యార్థి అధ్యక్షుడు చంద్రమౌళి, మాజీ మహిళ అధ్యక్షురాలు పద్మిని, అనిత, పార్వతి, జయ, జయలక్ష్మి , కవిత, సంగీత, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ప్రీతం, మోహన్ రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, కృష్ణ , రమేష్ ,అనిల్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా శనివారం శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో చేవెళ్ల ఎంఎల్ ఎ కాలే యాదయ్య కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని సిఎం ను కొనియాడారు.ఇలాంటి జన్మదిన వేడుకలు సిఎం రేవంత్ రెడ్డి మరి ఎన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకూర్త గోవిందమ్మ గోపాల్ రెడ్డి,వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు,శంకర్ పల్లి మాజీ వార్డు సభ్యులు సాతా ప్రవీణ్ కుమార్,నాయకులు చేకూర్త గోపాల్ రెడ్డి, కే.గోపాల్, పొద్దుటూరు మాజీ ఎంపిటిసి బొల్లారం వెంకటరెడ్డి, గోపులారం గ్రామ మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.



## ఓమౌజయా శ్రీభవతి క్షేత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/చర్లపల్లి/నాగారం:** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కీసర గోధుమకుంట ఆధ్యాత్మిక కేంద్రం ఓమౌజయా శ్రీభవతి క్షేత్రాన్ని సందర్శించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ప్రధానంగా ఆధ్యాత్మిక సాధన గురుభక్తి కలయిక,సేవభావాలు చురుగ్గా ఉంటాయని భక్తులు ఒక తరు మంగళకార్యాలు, కీర్తనలు సమూహ భజనలు నిర్వహిస్తారని, క్షేత్ర సమీపంలో ఉచిత భోజనాలు, సంకల్ప సేవలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓమౌజయా శ్రీపరమోజి బ్రహ్మ శాస్త్రజ్ఞ శ్రీరుషి ప్రజ్ఞానందస్వామి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులకు మాజి ఎంపిపి చంద్రశేఖర్‌యాదవ్ నూతన దుస్తులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మాజి కౌన్సిలర్ రాజుయాదవ్, వినోద్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.





## ముగిసిన హైదరాబాద్ జిల్లా క్రీడోత్సవాలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మండల కేంద్రంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న హైద్రాబాద్ గురుకుల క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల శామీర్ పేటలోని నిర్వహించిన అండర్ 14, 17,19 విభాగాల్లో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. హైద్రాబాద్ జిల్లాలోని మహాత్మా జ్యోతి బా పూలే గురుకుల పాఠశాలల నుంచి సుమారుగా 1200 మంది క్రీడాకారులు వివిధ విబాగాల్లో పోటీల్లో పాల్గొన్నారు. ఓవర్‌ఆల్ చాంపియన్ షిప్‌గా లాల్‌గడి మలక్‌పేట క్యాంపస్ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆర్‌సిఒ రాజేష్, హైద్రాబాద్ జిల్లా డిసిఒ వెంకట్రావ్, పాఠశాల ప్రిన్సిపల్ రవికుమార్, ఎటిపి శేఖర్, హెప్సిబా, ఆర్గనైజింగ్ ఫిజికల్ డైరక్టర్ వెంకటరెడ్డి, సాయికుమార్, సాయిబాబా, నరేష్, టెండుల్కర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## కుష్టు బాధితులకు వ్యక్తిగతీకరించిన పాదరక్షలు ఒక కొత్త ఆశ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుష్టు వ్యాధిని భారతదేశంలో నయం చేసినప్పటికీ అరికాళ్లలో పుండ్లు(అల్సర్లు)వలన వేలాదిమంది బాధపడుతున్నారని ఈ సమస్యను తగ్గించడానికి లెప్రా సొసైటీ బ్లూ పీటర్ పబ్లిక్ హెల్త్ అండ్ రీసెర్చ్ సెంటర్(బిపిహెచ్ఆర్‌సి) ఆంధ్రప్రదేశ్, ఒడిసా, బీహర్ మూడు రాష్ట్రాల్లో ఒక వినూత్న ప్రాజెక్ట్ ప్రారంభించింది. ఫైజర్ మ్యాపింగ్ టెక్నాలజీ(బారోపోడోమెట్రీ)ద్వారా ప్రతి వ్యక్తి పాదంపై ఒత్తిడి పాయింట్లను గుర్తించి మైక్రో సెల్యూలర్ రబ్బర్(ఎంసిఆర్)పాదరక్షలు చేయారు చేయబడ్డాయని ఈ పాదరక్షలు అధిక ఒత్తిడి తగ్గించి, పుండ్లు నయం కావడాన్ని వేగవంతం చేసి 85 శాతం మందికి పుండ్లు నయమయ్యాయని నడకలో విశ్వాసం, సౌకర్యం పెరిగిందని ప్రధాన పరిశోధకుడు డాక్టర్ మైఖేల్ సుకుమార్ పల్లపాటి అన్నారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ అసిస్టెంట్ అలేఖ్య చింతల, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## టి-సాట్‌లో ఘనంగా సిఎం జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు టిసాట్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని టిసాట్ సిఇఒ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబురాలు జరిపారు. టిసాట్‌లో జరిగిన ముఖ్యమంత్రి జన్మదినోత్సవ కార్యక్రమానికి తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరుకగా, తెలంగాణ మాసపత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కోడూరి శ్రీనివాసరావు, టిసాట్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఎం.డి. సాదిక్ పాషా, జనరల్ మేనేజర్ లింగారెడ్డి, వ్యవసాయ కమిషన్ ప్రజాసంబంధాల అధికారి కంచె రాజు, సీనియర్ జర్నలిస్టులు కొండల్ గౌడ్, గంటా రాంబాబు పాల్గొన్నారు.

## మహిళ గొంతుకోసి దారుణ హత్య

**ప్రజాపక్షం/దుండిగల్:** మహిళ గొంతు కోసి అతి కిరాతకంగా హత్య చేసిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిదిలో శనివారం చోటు చేసు కుంది. దుండిగల్ ఇన్స్ పెక్టర్ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా, తిమ్మాపూర్ కు చెందిన





సుజాత(30) కి 2015 సంవత్సరంలో వివాహం అయ్యిం దన్నారు. గత 10 సం.లుగా భర్తతో దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. ప్రైవేట్ సంస్థ లో పనిచేస్తున్న సుజాత బహదూర్ పల్లి గ్రీన్ హిల్స్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటుందన్నారు. గత కొంత కాలంగా ఓ వ్యక్తి సన్నిహితంగా ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఇదే క్రమం లో మృతురాలికి సదరు వ్యక్తికి గత 10రోజులగా గొడవలు జరుగు తున్నట్లు దర్యాప్తులో గుర్తించా మన్నారు. అతనికి సంబంధించిన వ్యక్తులే హత్యచేసి ఉండవచ్చున్నారు. ఘటన స్థలంలో సిసి కెమరాలు ఉన్నాయని ఇద్దరు వ్యక్తులు వచ్చి వెళ్లినట్లుగా ఉందన్నారు. మహిళను హత్య చేసినట్లుగా రాజేష్ అనే వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిపా రు. కుటుంబ సభ్యులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని మరో వ్యక్తి కోసం గాలిస్తున్నామని సిఐ తెలిపారు.

### జాతీయ హరిత ట్రిబ్యునల్

# ఆదేశాలను పాటించని బల్దియా

- * యధావిధిగా జవహర్ నగర్ డంపింగ్‌యార్డ్‌కు చెత్త తరలింపు
- * ప్రత్యామ్నాయం లేక అయోమయంలో అధికారులు
- * హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో జిహెచ్ఎంసి అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఆదేశాలను పాటించలేని నిస్సహాయ స్థితిలో మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) ఉంది. జవహర్ నగర్ డంపింగ్‌యార్డులో చెత్త వ్యర్థాలను నిలిపేయాలని ఎన్‌జిటి ఆదేశించింది. అయితే మరో చోట చెత్తను డంప్ చేసేందుకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో జిహెచ్ఎంసి యధావిధిగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు చెత్తను తరలిస్తోంది. అక్టోబర్ 28న విచారణ జరిగిన ఈ కేసులో, లెగసీ వ్యర్థాల వల్ల కలుగుతున్న కాలుష్యంపై దాఖలైన పిటిషన్‌ను పరిశీలించిన దక్షిణ మండలి ఎన్‌జిటి, కొత్తగా వచ్చే వ్యర్థాలను అక్కడికి తరలించడం నిలిపివేయాలని స్పష్టం చేసింది. ఐఐటి ముంబాయి నుం చి లెగసీ వ్యర్థాల నిర్వీర్యంపై నివేదిక వచ్చే వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని పేర్కొంది. రిఫ్యూజ్ డెరైవ్డ్ ఫ్యూయెల్ (ఆర్‌డిఎఫ్) ప్రాసెసింగ్ పైనా నిషేధం విధించింది.

అయితే ఇప్పటికే ఉన్న వ్యర్థాల ప్రాసెసింగ్‌కు మాత్రం అనుమతి ఇచ్చిం ది.

**ఎన్‌జిటి ఆదేశాల ఉల్లంఘించిన జిహెచ్ఎంసి..**

ప్రత్యామ్నాయ స్థలం లేక జిహెచ్ఎంసి అధికారులు జవహర్ నగర్ వ్యర్థాలను తరలిస్తున్నారు. ప్యారా నగర్‌లో మరో స్థలం ఉన్నప్పటికీ, అక్కడ కూడా ఎన్‌జిటి స్టే ఉంది. ఈ ఆదేశంపై తాము అప్పీల్ చేయబోతున్నామని ఒక ఉన్నతాధికారి వెల్లడించారు. ప్యారా నగర్‌లో 150 ఎకరాల ప్రభుత్వ భూమిలో వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు ప్రయత్నం స్థానికుల నిరసనలతో నిలిచిపోయింది. మెదక్ జిల్లా లక్దారం, రంగారెడ్డి జిల్లా ఖానాపూర్‌లో గుర్తించిన రెండు సైట్లు భూ వివాదాల కారణంగా చెత్త తరలింపునకు అడ్డంకిగా మారింది.

**రోజుకు 9,600 టన్నుల మలినాలు :** ప్రస్తుతం జవహర్ నగర్‌లో రోజుకు సగటున 9,684 మెట్రిక్ టన్నుల మలినాలు చేరుతున్నాయి. ఇందులో 8,500 టన్నులు జిహెచ్ఎంసి పరిధి లోనుండి, మిగతా భాగం పరిసర 14 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి వస్తున్నాయి.

**ఫలించని బయోమైనింగ్ సిఫార్సు..**

లెగసీ వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం 2018లో ఎన్‌జిటి ప్రధాన బెంచ్ బయోమైనింగ్ చేపట్టాలని జిహెచ్ఎంసిని ఆదేశించింది. టెండర్లకు స్పందన రాలేదని జిహెచ్ఎంసి తెలిపింది.

ఇక జిహెచ్ఎంసి సాంకేతిక భాగస్వామిగా ఉన్న ఐఐటి ముంబాయి, ఆరోగ్యపరమైన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని బయోమైనింగ్‌కు వ్యతిరేకంగా నివేదిక ఇచ్చింది.

మొత్తం మీద, ఎన్‌జిటి తాజా ఆదేశాలతో జిహెచ్ఎంసి పెద్ద చిక్కులో పడింది.

జవహర్ నగర్ నిలిపేయమంటే, మరో సైట్ లేదు. ప్యారానగర్, లక్దారం, ఖానాపూర్‌లలో అడ్డంకులే ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు లేదా సుప్రీం కోర్టుకు వెళ్లే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలిసింది.



## గంజాయి రహిత సమాజమే లక్ష్యం

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, యువతకు భవిష్యత్తు బాగుండాలంటే మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ సూచించారు. శనివారం గంజాయి వ్యతిరేక కమి టీ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయ పరిసరాలలో ఉదయం వ్యాయా మం కోసం వచ్చే వారిని ఉమా మహేష్ కలి సి సమావేశం కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న జగద్గిరిగుట్టలో గంజాయికి వ్యతిరేకంగా జరిగే సమావేశానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. గంజాయి వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్టలో గంజాయి లేకుండా చేయడానికి అన్ని బస్తీల కమిటీలను బస్తీ పెద్దలను ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నామని, అందులో మీరు కూడా భాగస్వామ్యం అయ్యి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

గంజాయి అమ్మే వారికి ఒక హెచ్చరికగా వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్‌రావు, ప్రజా నాట్య మండలి అధ్యక్షుడు బాబు, యువజన నాయకులు జంబు, కనకరావు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెరల సంక్షేమమే మా సంకల్పం

### గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** వడ్డెరల సంక్షేమమే మా సంకల్పం అని సీతక్క అన్నారు. శనివారం జుబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ జయ శంకర్ కమ్యూనిటీ హాల్లో జాతీయ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డెరల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్, డిప్యూటీ స్పీకర్ రామచంద్ర నాయక్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి,




ఎంబిసి కార్పొరేషన్ చైర్మన్ జేరిపాటి జైపాల్, ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా ఎఫ్ఫెనెండి, జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం సభ్యులు పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ రక్తం చెమట చిందించి రాళ్లను కొట్టి నిర్మాణాలకు పునాది వేసిన వడ్డెరులు హైదరాబాద్ అభివృద్ధికి వెన్నెముకలాంటి వారన్నారు.

## మన సంస్కృతి, సంప్రదాయాలను తెలిపే వేడుక కార్తిక వనసమారాధన

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించే వేడుక కార్తిక వనసమారాధన అని సత్యం శ్రీరంగం అన్నారు. శనివారం కళ్యాణ్ నగర్ వెంచర్ 3లో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వివేకానంద ఉద్యానవనంలో మల్లాడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో బ్రాహ్మణ కార్తీక వనసమారాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమ, వాణిస్య, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ కేంద్ర మంత్రి డా.సముద్రాల వేణుగోపాల చారి, టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీకమాసంలో నిర్వహించే ఆత్మీయ భోజనాలతో అందరిలో ఐక్యత పెంపొందుతుందని, కార్తీక వనసమారాధనలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. బ్రాహ్మణ కులస్తుల విద్య, రాజకీయ, ఆర్థిక వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో తులసి శ్రీనివాస్, ఎంవీఎస్ కైలాష్ నాథ్, ఎంవి రజిని, పి.వీణ, పి. జయసూర్య, పి.పార్వతి, కె.శంకరనారాయణ, కె. సుధాకర్, ఎం.శాంతిప్రియ, ఎన్.రామకృష్ణ, ఎన్.లీలా, బ్రాహ్మణ సోదరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

### మూడుచింతలపల్లిలో ఘనంగా సిఎం రేవంత్‌రెడ్డి బర్త్ డే వేడుకలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్న ఘనత సిఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్‌చేసి, బాణసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టి సిఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జగ్గంగూడలోని అనాథాశ్రమంలో అనాథలకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చుతున్నాడని చెప్పారు.

మూడుచింతలపల్లిపై సిఎం రేవంత్‌కు అపారమైన ప్రేమాభిమానాలు ఉన్నాయని గతంలో ఈ గ్రామంలో రేవంత్ పల్లె నిద్ర చేశారని గుర్తు చేశారు. మున్సిపల్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి కష్టపడి పనిచేసి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకవచ్చారని చెప్పారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో మూడుచింతలపల్లిలో అన్ని స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటామని సిఎం రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు వంగ వెంకటరమణరెడ్డి, జగన్నాథం, లక్ష్మారెడ్డి, వేణుగోపాల్‌రావు, రాజేంద్రప్రసాద్ గౌడ్, బస్వారెడ్డి, వీరేషం, బాల్‌నర్సింహా, లక్ష్మ న్, శ్రీకాంత్ గౌడ్, గోపి, తదితరులు పాల్గొన్నారు.



## సిఎం రేవంత్‌రెడ్డికి టిపిసిసి వినూత్న శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి సిఎం రేవంత్‌రెడ్డికి వినూత్నంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం సిఎం రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సిఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటంతో కూడిన ఎయిర్ బెలూన్ హిడెన్ కాస్టల్ ను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ముఖ్యమంత్రి సంకల్పించిన ప్రజాసంక్షేమ కార్యక్రమా లు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని ప్రతి తెలంగాణ బిడ్డకు కనిపించాలనే అలోచనతో ఎయిర్ బెలున్ గ్రీటింగ్స్‌కు పూనుకున్నట్లు తెలిపారు. ఆరు గ్యారంటీల అమలు తెలంగాణను విద్యారంగం లో మేటిగా నిలబెట్టెందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, డ్రగ్స్ రహిత తెలంగాణ, ముంపు లేని హైద్రాబాద్‌ను సాదించేందుకు లక్షాలాది మంది ప్రజలు మురికి నీటిలో ఇబ్బంది పడుతున్న మూసి నది ప్రక్షాళన వంటి అద్భుతమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారని




చెప్పారు. జూబ్లిహిల్స్‌లో జరుగబో యే ఎన్నికల్లో ప్రజలతా కాంగ్రెస్ వైపే ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వం పట్ల ప్రజలు అచంచలమైన విశ్వాసంతో ఉన్నారని అన్నారు. తప్పనిసరిగా కాంగ్రెస్ పార్టీ విజయం సాదిస్తుందని దీమా వ్యక్తం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి అయురారోగ్యలతో ఉండాలని ఆకాంక్షిస్తు సిఎం రేవంత్‌రెడ్డికి వినూత్నంగా శుబాకాంక్షలు తెలిపారు.

## బంట్వారంలో ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**ప్రజాపక్షం/బంట్వారం:** బంట్వారం మండల కేంద్రంలో బస్టాండ్ సమీపంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పోచారం వేంకటేశం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్స్, పండ్లు పంపిణి చేయడం జరిగిం ది. తెలంగాణ స్పీకర్, స్థానిక శాసన సభ్యులు గడ్డం ప్రసాద్ కూమార్ ఆదేశానుసారం లబ్దిదారు సుక్క లక్ష్మీ కి ముఖ్యమంత్రి సహాయ నిధి 1,28,000 రూ. ల చెక్కును పంపిణీ చేశారు. స్థానికంగా ఉన్నటువంటి కస్తూర్బాగాంధీ పాఠశాలలో మర్పల్లి మార్కెట్ కమిటి డైరక్టర్లు ఆధ్వర్యంలో విద్యార్థినిలతో కలసి కేక్ కట్ చేసి వారికి పండ్లు, బిస్కెట్స్ అందజేశారు.

ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు రంగా రెడ్డి, మర్పల్లి మార్కెట్ కమిటి డైరక్టర్లు యాద గిరి, నర్సిములు, ఇసాక్, సీనియర్ నాయకులు పురుషోత్తం రెడ్డి, శివ కూమార్, నరసింహరెడ్డి, సిద్ది రాములు, ప్రభాకర్, వీరేశం, నాయకులు సుధకార్, రవీందర్, యాకుబ్, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.



## అధ్వాన్న రహదారులను పట్టించుకోని ఆర్ అండ్ బి

**ప్రజాపక్షం/వికారాబాద్:** ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు రోడ్లు మరింత అధ్వాన్నంగా తయారయ్యాయి. ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నా యి. గంట ప్రయాణానికి రెండు గంటల సమయం పడుతోంది. గుంతల కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయని వాటి యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిసేపు ప్రయాణంచేస్తే ఒళ్లు హూనం అవుతున్నాయి. సమస్యలు తీవ్రమవుతున్న ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, వికారాబాద్ నియోజకరవర్గంలోని మోమిన్‌పేట్ నుండి మర్పల్లి రోడ్డు రెండళ్ల క్రితం పాడయ్యింది. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకేలేదు, మర్పల్లి నుండి ఎన్నరం మీదుగా కోట్‌పల్లి రోడ్డు అధ్వాన్నంగా తయారయింది. బంట్వారం నుండి తోర్మమిడి రహదారి 6 సం.లు అయినా బాగు చేయడం లేదు మరింత దెబ్బతిని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వికారాబాద్ జిల్లాలో ఆర్ఆండ్‌బి , పంచాయతీరాజ్ రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా 953 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బి రోడ్లు ఉన్నాయి. 135 కిలోమీటర్లు మేర జాతీయ రహదారులు ఉన్నాయి. 1342 పంచాయతీరాజ్ రోడ్లు 2886 కిలోమిటర్ల పొడవు విస్తరించి ఉన్నాయి. ఇందులో 891 కిలోమీటర్ల రోడ్లు, 85 కిలోమీటర్ల
సిసిరోడ్లు 456 కిలోమీటర్ల కంపరరోడ్డు, 1343కిలోమీటర్ల మట్టి రోడ్లు ఉన్నాయి. వికారాబాద్ తాండూర్, వికారాబాద్ పరిగి, నవాబుపేట్, సిద్దులుర్, పరిగి మిట్టకోడుర్, కొడంగల్,మహబుబ్‌నాగర్, ఐనాపూర్ పాలెపల్లి, పిల్లారం ధార్మపూర్, జిన్నరం గేట్‌నుండి ఎన్కెపల్లి, యచారం బాంట్వారం, కొత్తగడి నుండి మొత్కపల్లి రోడ్డు పూర్తిగా పడైయిపోయినందున తోర్మమామిడి బస్సు పూర్తిగా ఆర్‌టిసి అధికారులు రద్దు చేశా రు. ఈ రోడ్డు వేయడానికి శంకుస్థాన చేసి సంవత్సరం దాటినా ఇప్పటివరకు ఎలాంటి పనులు ముందుకు సాగులేవు, జిల్లావ్యాప్తంగా పాడైన రోడ్లు మరుమత్తులకు ప్రతిపాదనలు పంపాం, రోడ్డు మంజూరైంది. టెండర్ ప్రక్రియ పుర్తియ్యింది, కానీ తరుచూ అధికారులు చెప్తున్న మాటలు కానీ పనులు ప్రారంభమైన ఆనవాళ్లు మాత్రం కనిపించడం లేదు, వికారాబాద్ జిల్లా రోడ్ల అభివృద్ధికి రూ.100కోట్లతో



టెండర్లు పూర్తి అయ్యాయాని అధికారులు చెబుతున్న ఆ దిశగా పనులు మాత్రం జరగడం లేదు. హైదరాబాద్ మన్నెగూడ, రోడ్డుకు మూడేళ్ల క్రితం టెండర్లు పూర్తియ్యాయి. కానీ ఒక్క అడుగు కూడా పడిందిలేదు. ఇటీవల ఈ మార్గంలో చోటుచేసుకున్న బస్సు ప్రమాదంలో 19మంది దుర్మరణం పాలయ్యారు. ఏదైనా టెండర్ అయ్యి పనులు జరుగడంలో సంవత్సరాల పొడువునా రోడ్డు పనులు చేస్తున్నారు. చేసిన పనులు నషిరం చేస్తున్నా అధికారలు పట్టించుకోవ డంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. జాడ పట్టించుకొండి సారు అని ప్రజలు కోరుతున్నారు.

# క్రీడ

# ఐదో మ్యాచ్ వర్షార్పణం..

## టీ20 సిరీస్ టీమిండియా విజేత




ఆసియా కప్ ఛాంపియన్ భారత జట్టు మరో పొట్టి సిరీస్ పట్టేసింది. ఆస్ట్రేలియాతో జరగాల్సిన చివరి టీ20 వర్షార్పణం కావడంతో 2–1తో సిరీస్ కైవసం చేసుకుంది టీమిండియా. గబ్బాలో భారత ఇన్నింగ్స్ 4.5 ఓవర్ వద్ద అంతరాయం కలిగించిన వర్షం.. ఎంతకూ తగ్గకపోవడంతో అంపైర్లు చివరకు ఆటను రద్దు చేశారు. దాంతో.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు విజయాలు సాధించిన సూర్యకుమార్ యాదవ్ బృందం విజేతగా నిలిచింది. పొట్టి క్రికెట్‌లో తమకు తిరుగులేదని భారత జట్టు మరోసారి చాటుకుంది. ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్ (2–1) చేజారినా.. తమకు కొట్టినపిండి అయిన టీ20ల్లో కంగారూ టీమ్‌కు షాకిచ్చింది టీమిండియా. తొలి మ్యాచ్ వర్షార్పణం కాగా.. రెండో టీ20లో ఆతిథ్య జట్టు గెలిచి సిరీస్ ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే.. కాంబినేషన్‌లో మార్పులు చేసుకున్న టీమిండియా.. వరుసగా రెండు మ్యాచుల్లో కంగారూలకు చెక్ పెట్టింది. పేసర్ అర్ష్‌దీప్ సింగ్, ఓపెనర్ అభిషేక్ శర్మలు మెరవడంతో మూడో మ్యాచ్‌లో.. ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ గొప్పగా రాణించడంతో నాలుగో టీ20లో మార్ష్ సేనను మట్టికరిపించింది. నిర్ణయాత్మకమైన ఐదో మ్యాచ్ వర్షార్పణం కావడంతో 2–1తో ఆధిక్యంలో ఉన్న టీమిండియాను విజేతగా ప్రకటించారు.

### 4.5వ ఓవర్లో

నాలుగో టీ20లో భారీ విజయంతో సిరీస్‌లో ముందంజ వేసిన భారత్.. ఐదో మ్యాచ్‌లోనూ ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ(23 నాటౌట్), శుభ్‌మన్ గిల్(29 నాటౌట్)లు బౌండరీలతో విరుచుకుపడి శుభారంభమిచ్చారు. అయితే.. 4.5వ ఓవర్లో భారీగా ఉరుములు, మెరుపులు కారణంగా మ్యాచ్‌ను నిలిపివేశారు అంపైర్లు. ఆ కాసేపటికే వర్షం పడడంతో పిచ్‌ను సిబ్బంది కవర్లతో కప్పేశారు. కొద్ది సేపటికి తగ్గినట్టే తగ్గిన వాన మళ్లీ జోరందుకోవడంతో మ్యాచ్ నిర్వహణపై సందేహాలు నెలకొన్నాయి. సిరీస్ ఆసాంతం అద్భుతంగా ఆడిన అభిషేక్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడు. గత మూడేళ్లలో ఆసీస్ సొంతగడ్డపై టీ20 సిరీస్ కోల్పోవడం ఇది నాలుగోసారి. మూడు పర్యాయాలు టీమిండియా చేతిలోనూ ఆ జట్టుకు పరాభవం ఎదురవ్వడం గమనార్హం.

# వరల్డ్ ఛాంపియన్ గుకేశ్ ఇంటికి..

## నాలుగో రౌండ్‌లో అర్జున్, ప్రజ్ఞానంద!



ప్రతిష్ఠాత్మక ఫిడే చెస్ వరల్డ్ కప్ పోటీల్లో భారత గ్రాండ్‌మాస్టర్లకు షాక్‌లు తగులుతున్నాయి. వరుస ఓటములతో వరల్డ్ కప్ విజేత దివ్యా దేశ్‌ముఖ్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈసారి వరల్డ్ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ పోరాటం కూడా ముగిసింది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన గుకేశ్ అనూహ్యంగా మూడో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. గుడ్‌న్యూస్ ఏంటంటే.. ప్రజ్ఞానంద, ఎరిగేసి అర్జున్‌లు నాలుగో రౌండ్‌కు దూసుకెళ్లారు. భారీ అంచనాలతో చెస్ వరల్డ్ కప్ బరిలో నిలిచిన గుకేశ్ పోరాటం మూడో రౌండ్‌లోనే ముగిసింది. శనివారం జర్మనీ గ్రాండ్ మాస్టర్ ఫ్రెడెరిక్ స్వానే చేతిలో 1.5–0.5తో భారత స్టార్ కంగుతిన్నాడు. ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన అతడు ఆఖర్లో భటువుకు దూరంగా రాజును తీసుకెళ్లి పెద్ద పొరపాటు చేశాడు. అంతే.. ఫ్రెడెరిక్ తన వ్యూహాన్ని అమలు చేసి గుకేశ్ ఆట కట్టించాడు. మరోవైపు యువకెరటం అర్జున్ ప్రత్యర్థి షంసిద్దిన్ విఖిదోవ్‌పై 1.5–0.5తో, రాబర్ట్ హొవ్హన్నిస్యాన్‌పై 1.5–0.5 తో విజయంతో ప్రజ్ఞానంద నాలుగో రౌండ్ చేరుకున్నారు.

### 23 ఏళ్ల తర్వాత

ఫిడే చెస్ వరల్డ్ కప్ పోటీలకు దాదాపు 23 ఏళ్ల తర్వాత మన దేశం ఆతిథ్యమిస్తోంది. గోవా వేదిక జరుగుతున్న చెస్ వరల్డ్ కప్‌లో 82 దేశాల నుంచి 206 మంది పోటీపడుతున్నారు. ఎనిమిది రౌండ్లలో గెలుపొందిన వారు నాకౌట్‌కు అర్హత సాధిస్తారు. ఆనావాయితీ ప్రకారం టాప్ 50లో ఉన్న క్రీడాకారులు నేరుగా రెండో రౌండ్ ఆడుతున్నారు. ప్రతి రౌండ్‌లో రెండు ఫార్మాట్లలో గేమ్ నిర్వహించనున్నారు. స్కోర్లు సమం అయినప్పుడు టై బ్రేకర్స్ ఆడిస్తారు. ఈ టోర్నీ విజేతకు రూ.17 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది.

# ఫోకస్




# పెరుగుతున్న ఎఐ ఉద్యోగాలు!



దేశంలో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ ఎఐ)కి సంబంధించిన ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. ఇన్డీడ్ సంస్థ తాజాగా ప్రకటించిన నివేదికను అనుసరించి, ఎఐ ఉద్యోగాలు 8.2 శాతం నుండి 11.7 శాతానికి దూసుకెళ్ళాయి. భారతదేశంలో ఎఐ నైపుణ్యాల డిమాండ్ పెరుగున్నాయనడానికి, ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఎఐసంబంధిత ఉద్యోగ ప్రకటనలు మొత్తం 11.7 శాతానికి చేరడమే నిదర్శనం. ఇతర ఇన్డీడ్ మార్కెట్లతో పోలిస్తే భారత దేశం ముందంజలోనే ఉంది. భారత్ తోపాటు, కేవలం సింగపూర్ మాత్రమే ఎఐ గురించి ప్రస్తావించిన ఉద్యోగ ప్రకటనల శాతం ఎక్కువగా ఉంది. ఇది భారత్‌లో అనేక కంపెనీలు ఎఐపై పూర్తిగా ఫోకస్ పెట్టినవైనాన్ని రుజువు చేస్తున్నది. ఇన్డీడ్ ప్లాట్‌ఫారమ్‌లోని ఉద్యోగ ప్రకటనల డేటాపై ఆధారపడి తయారైన ఈ నివేదికలో, భారతదేశంలోని ఫార్మల్ ఆర్థిక వ్యవస్థలో నిజసమయంలో జరుగుతున్న హైరింగ్ (ఉద్యోగ నియామక) కార్యకలాపాలను రియల్ టైంలో ట్రాక్ చేస్తుంది. సెప్టెంబర్ 2025 వరకు జాబ్ ప్రకటనల ట్రెండ్స్‌ని విశ్లేషించి, వాటిని గత నెలల డేటా, గత ఏడాది అదే సమయంలో ఉన్న స్థితితో పోల్చారు. దీని ద్వారా, ఎఐ వంటి ప్రత్యేక నైపుణ్యాల కోసం భారతదేశంలో ఉద్యోగ డిమాండ్ ఎలా పెరుగుతుందో, ఏ రంగాలలో ఎక్కువ అవకాశాలు ఉంటాయో స్పష్టంగా తెలుసుకోవచ్చు. రిపోర్ట్‌లో అంశాల ప్రకారం, ఎఐసంబంధిత ఉద్యోగ అవకాశాలు మొదటగా టెక్ రంగంలో ఉంటాయి. కానీ ఇతర రంగాల్లోనూ వేగంగా విస్తరిస్తున్నాయి. డేటా అండ్ అనలిటిక్స్ రంగంలో 39 శాతం ఉద్యోగ ప్రకటనల్లో ఎఐ ప్రస్తావన ఉంది. దీని తరువాత సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ (23 శాతం), ఇన్సూరెన్స్ (18 శాతం) మరియు సైన్స్ రీసర్చ్ (17 శాతం) ఉన్నాయి. ఎఐ నైపుణ్యాల డిమాండ్ అనేక ఇంజనీరింగ్ విభాగాల్లోనూ ఉంది. ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్‌లో 17శాతం, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 11 శాతం, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో 9.2 శాతం ఉద్యోగ ప్రకటనల్లో ఎఐ ప్రస్తావన ఉంది. ఇలావుంటే, ఇన్డీడ్ డేటా ప్రకారం, సెప్టెంబర్‌లో భారతదేశంలోని ఉద్యోగ ప్రకటనలు 0.8 శాతం తగ్గాయి. ఇది ఈ సంవత్సరం ఆరు నెలలుగా నెలవారీగా కొనసాగుతున్న తగ్గింపులో భాగం. రిపోర్ట్ తెలిపినట్లు, భారత ఉద్యోగ శక్తి కాస్త క్రమంగా ఫార్మల్, అధికారిక విధుల వైపు మారుతోంది. అంటే, కంపెనీలు మరింత సులభంగా ట్రాక్ చేయగల, నిబంధనలతో అనుగుణంగా పనిచేసే ఉద్యోగులను తీసుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ మార్పు కారణంగా, ఉద్యోగ ప్రకటనలు ఫార్మల్ రంగంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి.



# ఆచితూచి ఖర్చు..

గతంలో మాదిరి విచ్చలవిడిగా ఖర్చుపెట్టడానికి 'జెన్ జెడ్'లు విముఖత చూపుతున్నారు. ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు, గేమ్ కన్సోల్‌లు వంటి ఎన్నో గ్యాడ్జెట్లను కొనుగోలు చేసేకంటే, కిరాయికి తీసుకోవడమే మంచిదనే అభిప్రాయం వారిలో ఉంది. ఒక రకంగా ఇది 'స్మార్ట్ స్పెండింగ్'. అత్యవసరమైనవి మాత్రమే కొనడం, సాధ్యమైనంత ఎక్కువ గ్యాడ్జెట్లను అద్దెకు తీసుకోవడం 'జెన్ జీ'లుగా పిలిచే నేటి 'జెన్ జెడ్' తరం లాభదాయకంగా భావిస్తున్నది. మారుతున్న యువత అభిప్రాయాలను ఇప్పటికే అందిపుచ్చుకుంటున్న 'రెంట్‌కర్' వంటి ప్లాట్‌ఫామ్‌లు టివిలు, మ్యాచ్‌బుక్‌లు, కెమెరాలు, మైక్రోఫోన్లు వంటి వస్తువులను అద్దెకు అందిస్తున్నాయి. మన దేశంలో ఈ విధంగా కిరాయి గాడ్జెట్స్ మార్కెట్ 2027 నాటికి రూ. 10,000 కోట్లు దాటే అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతం ఈ మార్కెట్ ఏటా 35 శాతం చొప్పున అభివృద్ధి చెందుతున్నది. వినియోగదారుల్లో 60 శాతం మంది 30 లేదా అంతకంటే తక్కువ వయసు ఉన్న వారే కావడం గమనార్హం. ఈ మార్కెట్ ముంబయి, బెంగళూరు, ఢిల్లీ వంటి నగరాల్లో విస్తృతంగా పెరుగుతున్నది. జెన్‌జిలు తమ డబ్బు, వనరులను అత్యంత జాగ్రత్తగా వాడుతున్నారన్న విషయం ఈ మార్కెట్ విస్తరణ నిరూపిస్తున్నది. అవసరాలు నిత్యం మారుతునే ఉంటాయి. కొత్తకొత్త మార్పులు చోటు చేసుకుంటునే ఉంటాయి. ఉదాహరణకు ఈ రోజు వచ్చిన మాక్‌బుక్ ప్రో వర్షన్ వచ్చే ఏడాదికి ఉండకపోవచ్చు. కానీ, ఇప్పుడు సుమారు రూ. 1.5 లక్షలు ఖర్చు చేసి, వచ్చే ఏడాది కొత్తది కొనడం అసాధ్యం. అందుకే, కొనుక్కునే కంటే, కిరాయికి తీసుకోవడం మంచిదన్న నిర్ణయాన్ని స్మార్ట్ ఆలోచనగా పేర్కోవాలి. కొన్ని సందర్భాల్లో కొత్త ఉత్పత్తులు కొనడం వల్ల ఖర్చులు పెరగవచ్చు. ఉదాహరణకు పిఎస్5 కొన్న తర్వాత, సరికొత్త గేమ్స్, లెన్స్, ఫిల్టర్లు కొనాల్సి వస్తుంది. కొన్ని నెలల కాలంలోనే మరో వర్షన్ మార్కెట్‌లోకి రావచ్చు. అందుకే, జెన్‌జిలు చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. ఆధునిక సాంకేతికత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, ఎప్పటికప్పుడు కొత్తకొత్త వర్షన్లు మార్కెట్‌ను ముంచెత్తడాన్ని చూస్తునే ఉన్నాం. ఇలాంటి పరిస్థితుల్లో కొనదడం కంటే కిరాయికి తీసుకోవడమే మేలన్న జెన్‌జిల ఆలోచనను అభినందించి తీరాలి.

## ఎకరానికి 12 క్వింటాళ్లు కొనాల్సిందే

### సిసిఐ కేంద్రం వద్ద సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని కేదారినాథ్ పత్తి మిల్లులో గల సిసిఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రం వద్ద సీపీఐ నాయకులు,రైతు సంఘాల ప్రతినిధులు,రైతులు కలిసి నిరసన,సందర్శన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి షరతులు లేకుండా వెంటనే కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని భూక్యా రమేష్ డిమాండ్ చేశారు. తేమశాతం నిబంధనను 12 శాతం నుండి 20 శాతం వరకు పెంచాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని భూక్యా రమేష్ హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి,రాథోడ్ విట్టల్, పుండాలిక్, మునియా నాయక్, రాథోడ్ దేవుల, గాండ్ల వెంకటి తదితర రైతు నాయకులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల సమస్యలపై నిరసనగళం




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆధ్వర్యంలో నాయకులు శనివారం శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని ముట్టడించారు.యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు జిఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ యాజమాన్యం మెడికల్ బోర్డును వెంటనే ఏర్పా టు చేసి, పాత విధానంలోనే ఇన్వాలిడేషన్ నిర్వహించాలని, మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్‌లకు వెంటనే నియామక పత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. బ్రాంచ్ ఉపాధ్యక్షులు కిషన్ రావు, సహాయ కార్యదర్శి కొమురయ్య, సం యుక్త కార్యదర్శి చంద్రమోహన్, జిఎం కమిటీ చర్చల ప్రతినిధులు బుచ్చయ్య, నాగభూషణం, సతీష్ ప్రసాద్ రెడ్డి, నర్సయ్య, అఫ్రోజ్ ఖాన్, ఫిట్ కార్యదర్శిలు రాజయ్య, మురళి చౌదరి, లచ్చన్న, సదానందం, సారయ్య, నర్సింగ్ రావు, లక్ష్మణ్, నవీన్ రెడ్డి, శ్రీకాంత్, సదానందం, సమ్మయ్య, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'సొంతింటి' స్కీం అమలు చేయరా?

### ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్

### సింగరేణి జిఎం కార్యాలయం ముందు ధర్నా



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** సింగరేణి యాజమాన్యం కార్మికుల సొంతింటి పథకాన్ని అమలు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ యాజమాన్యాన్ని డిమాండ్ చేసారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి జిఎం కార్యాలయం ముందు ఎఐటియుసి ఆధ్వర్యంలోధర్నానిర్వహించారు.రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగామాట్లాడుతూ సింగరేణిలో ఎఐటియుసి సంఘంగా గెలుపొందిన సమయం నుండి కార్మిక సమస్యల కోసం స్ట్రక్చర్ మీటింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అనేక సమస్యలకు యాజమాన్యం అంగీకరించినా అమలుకు నోచుకోలేదని అన్నారు. కార్మికుల సొంతింటి పథకం కోల్ ఇండియా మాదిరిగా పెరిక్స్‌పై ఇన్‌కంటాక్స్ యాజమాన్యం చెల్లించాలనికోరామన్నారు. వినతిపత్రాన్ని జిఎం రాజేశ్వర్‌రెడ్డికి అందజేసారు. బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్,వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్,బ్రాంచ్‌సహాయకార్యదర్శులు ఆసిఫ్ పాష,జి శ్రీనివాస్,బురుజపల్లిసుదాకర్‌రెడ్డి, బ్రాంచ్‌కమిటీనాయకులునూకలచంద్రమౌళి ఉన్నారు.

# ఎన్నికలు తప్ప రైతుల గోస పట్టదా!

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీకి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఉన్న శ్రద్ధ గతవారం రోజులుగా అకాలవర్షాలతో చేతికివచ్చిన పంటలను నష్టపోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతుల గోసపట్టదా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బిజినేపల్లి మండలం వెల్గొండలో సిపిఐ మండలసమితి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విపరీతంగా పత్తి, మొక్కజొన్న, వరి ఇతర పంటలు వేసిన రైతులందరూ అకాలవర్షాల కారణంగా సర్వం కోల్పోయారని, పంటచేతికి వచ్చే సమయానికి అకాలవర్షాలురావడంతో తీవ్రమైన నష్టం రైతులకు జరుగుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కలిగిన ప్రధాన ప్రతిపక్షం ఈరెండుపార్టీలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలమత్తులో మునిగి తేలుతున్నాయని రాష్ట్రంలో రైతుల గోస వీరికి పట్టడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సిపిఐజిల్లాకార్యవర్గ సభ్యులు చంద్రమౌళి, మండలకార్యదర్శి కృష్ణాజి, ఈర్లభూపేష్, మం డల సహాయ కార్యదర్శి మధుగౌడ్, ఈర్లగంగాధర్, శ్రీనివాస్, రవి, శివ, పురుషోత్తం పాల్గొన్నారు.

### ప్రజలపక్షాన కమ్యూనిస్టులు

**నాగర్‌కర్నూల్ :** సామ్యవాద సిద్ధాంతాల ఆధారంగా ప్రజల సమస్యలను వీధినాటకాలు, పాటలు, నృత్యాలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపర్చడానికి కృషిచేస్తూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగాబావుట ఎగురవేసింది ప్రజానాట్యమండలి అని కళకోసంకాదు ప్రజల సమస్యలను పరిష్కరించడంకోసం కళ అని రాష్ట్రసిపిఐ కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా అన్నారు. పెద్దకొత్తపల్లి మండలకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పెబ్బేటి విజయుడు అధ్యక్షతన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజానాట్యమండలి కళాకారుల శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈశిక్షణ తరగతులకు ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐజిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న మూఢనమ్మకాలను నిర్మూలించుటకు ప్రజా నాట్యమండలి కళాకారులచే, వీధినాటకాలుఆటపాటలతో ఎంతో పాత్ర పోషించిందన్నారు.నర్సింహ్మా,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు మల్లేష్, ప్రజానాట్యమండలి జిల్లా సహాయ కార్యదర్శి బిజ్జ శ్రీనివాసులు , సిపిఐమండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాసులు, పెద్దకొత్తపల్లి సిపిఐ కార్యదర్శి లక్ష్మణస్వామి, కల్వకోల్ సిపిఐకార్యదర్శిసంఘం కృష్ణ, కళాకారులు తుపాకుల వెంకటేష్, చందు, ఊశన్నగౌడ్ ఉన్నారు.

## ఫీ చెల్లింపుపై మొండివైఖరి వీడండి




**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండల కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ డిమాండు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ అడ్డగూడూరు మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బిక్షాటన చేశారు. ఎఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయకుండా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఇప్పటికైనా ఫీజు బకాయి విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థి లోకంతో మంత్రుల నివాసాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు చిప్పలపల్లి వంశీ కుమార్, బెల్లి శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు తరాల మధు, సాయికుమార్, బన్నీ, సన్నీ, అఖిల్, లక్ష్మీ సాయి, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమసమాజస్థాపనే ఎర్రజెండా లక్ష్యం

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



**ప్రజాపక్షం / హుస్నాబాద్ :** సమసమాజ స్థాపనే ఎర్ర జెండ లక్ష్యం అని, పేదలు ఉన్నంత వరకు సిపిఐ నిరంతరం పోరాటం చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. శనివారం అయన హుస్నాబాద్ పట్టణం సిపిఐ కార్యాలయంలో విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ సుదీర్ఘ ఉద్యమస్ఫూర్తితో పీడిత వర్గాల ప్రజల కోసం అంతరాలు లేని సమాజం కొసం భారతకమ్యూనిస్టుపార్టీ ఉద్యమిస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. ని అందుకే హైద్రాబాద్‌లో జరుగుతున్న జూబ్లీ ఎన్నికల్లో సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి 30 వేల మెజారిటీతోగెలుస్తుందని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన కమిటీని జిల్లా సమితి గుర్తించదని, పార్టీ నిబంధనలు పాటించని నాయకులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని తెలిపారు. అనంతరం మూడు మండలాల సిపిఐ నాయకులుతో కార్యవర్గ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సిపిఐ నాయకులు కొమ్ముల బాస్కర్, వేల్పుల శ్రీనివాస్, ఎడల వనేశ్, జేరిపోతుల జనార్ధన్, రజని, బోజ్జపురి రాజు, ముంజ గోపి, , కొయ్యడ కొంరయ్య, మొండయ్య, మాడిశెట్టి శ్రీధర్, రోళ్ల భాగ్య, ప్రసన్న, గట్టుబాబు, పిట్టల శ్రీను, లక్ష్మన్, జాగీరు బాలయ్య, లు పాల్గోన్నారు.

## ఓపెన్ మార్కెట్ల ద్వారా పత్తి కొనుగోలు చేయాలి

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషు మియా




**ప్రజాపక్షం / వరంగల్ :** కపాస్ కిసాన్ యాప్ రద్దు చేసి ఓపెన్ మార్కెట్ల ద్వారా పత్తి కొనుగోలు చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషు మియా అన్నారు. గీసుగొండ మండలం ధర్మారంలో సిపిఐ మండల సమావేశం ఎం.ఏ. పాషా అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ బాషు మియా మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మంలో జరగబోవు 100 సంవత్సరాల చరిత్ర గల సిపిఐ పార్టీ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేసుకోవాలని ఈ వంద సంవత్సరాల శజయంతి ఉత్సవాల ముగింపు సభలో ప్రపంచ దేశాల నుండి 40 దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలియజేస్తూ ఐదు లక్షల మంది పైచిలుకు ప్రజలతో భారీ బహిరంగ సభ ను జయప్రదం చేసుకోవాలన్నారు. రైతులను మోసం చేసే విధానంగా ఉన్న కపాస్ కిసాన్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని, రైతులు తమ పత్తిని స్వేచ్ఛగా ఓపెన్ మార్కెట్‌ల ద్వారా విక్రయించుకునే అవకాశం కల్పించాలన్నారు. ఎటువంటి కండిషన్ లేకుండా 20 శాతం తేమ ఉన్న పత్తిని కూడా కొనుగోలు చేయాలి అని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేందుకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన ధరల ప్రకారం పంటలను కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతు సంఘ నాయకులు తోట చంద్రకళ, గన్నారపు రమేష్, గుండె బద్రి, శ్వేత, రాజేష్, భారతి, సుక్క శోభ, సుక్క మొగిలి, రాజారామ్, రత్నాకర్ రెడ్డి, కమల తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించినట్లయితే మంచి భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. తైక్వాండోలో రాష్ట్ర స్థాయిల పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులను శనివారం ఆయన సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నల్లగొండలో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు విన్నర్స్ వరల్డ్ తైక్వాండో మిర్యాలగూడ బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. విన్నర్స్ తైక్వాండో అకాడమి వారు ఇంకా ఎంతో మంది క్రీడాకారులను జాతీయ స్థాయికి పంపించి మిర్యాలగూడ పేరును నలుదిశలా వ్యాపింపచేయాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ పవన్, నల్లపరాజు జాని, విశ్వభారవి, స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి కరాటే పోటీలలో స్కూల్ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/నందికొండ:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ నలగొండ సంస్థ నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే టోర్నమెంట్ కం సెలక్షన్స్ లో నాగార్జున సాగర్ స్కూల్ ఆఫ్ ఆక్స్ ఫర్డ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపాల్ ఏ శివకుమార్, కరస్పాండెంట్ నకుల్ రావు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 7న నల్లగొండ మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి కరాటే టోర్నమెంట్ కంసెలక్షన్‌లో అండర్ 1780కిలోల విభాగంలో సయ్యద్ అబ్దుల్ ముసాఫిర్ అండర్ 1768 కిలోల విభాగంలో ఎస్‌విఎన్ఎం కృష్ణ సాయిలు బంగారు పతకాలను సాధించగా,అండర్14 35కిలోల విభాగంలో బణావత్ వెంకటేష్,రజత పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు విశాలమైన తరగతి గదులలో ఉత్తమ విద్యతో పాటు ఆత్మ రక్షణకు కరాటే, విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంచడానికి డ్రాయింగ్ విభాగంలో ఉత్తమ ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఏ శివకుమార్, కరస్పాండెంట్ కె నకుల రావు,కరాటే మాస్టర్ వెంకట్,స్కూల్ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొని కారు దగ్ధం

8 మందిని కాపాడిన లారీ డ్రైవర్లు



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో 65వ నెంబర్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇన్నోవా కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో ప్రయాణిస్తున్న 8 మంది సురక్షితంగా బయటపడ్డారు. స్థానిక పోలీసుల వివరాల ప్రకారం... హైదరాబాద్ నుండి విజయవాడ వైపు వెలుతున్న ఇన్నోవా కారు గుండ్రాంపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు డివైడర్‌కు ఢీ కొని పల్టీ కొట్టి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. వెంటనే కారులో మంటలు చెలరేగి నిమిషాలల్లో కారు పూర్తిగా దగ్ధమైంది. అందులో ప్రయాణిస్తున్న 8 మంది సురక్షితంగా బయటపడ్డారు.

**రక్షణ చర్యల్లో :** రోడ్డుపై కారు ప్రమాదానికి గురై మంటలకు ఆహుతి అవుతున్న సంఘటనను చూసిన రామకృష్ణ, అశోక్, షరీఫ్ అనే ముగ్గురు లారీ డ్రైవర్లు తమ వాహనాలను పక్కకు ఆపుకుని సంఘటన స్థలానికి చేరుకున్నారు. మండుతున్న కారు డోర్‌లను తెరిచి అందులో ఉన్న 8 మందిని బయటికి సురక్షితంగా బయటికి చేర్చారు. ఈ క్రమంలో వీరి కాళ్ళు, చేతులకు మంటలు అంటుకున్న తీవ్రంగా గాయపడ్డారు. గాయాలను లెక్కచేయకుండా 8 మంది ప్రాణాలను కాపాడిన వారిని అందరూ ప్రశంసిస్తున్నారు. గాయాలకు గురైన వారిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పోలీసులను చితక బాదిన మందు బాబులు

చండూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

**ప్రజాపక్షం/చండూరు:** బహిరంగ ప్రదేశంలో అర్ధ రాత్రి సమయంలో మద్యం సేవిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు మందలించారు. మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు పోలీసులను చితక బాదడంతో పోలీసులకు తీవ్ర గాయాలు అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిం ది. దీంతో బాధిత పోలీసుల ఫిర్యాదుతో మందుబాబులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్ వెంకన్న గౌడ్ తెలిపారు. చండూరు మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 4వ తేదీన పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా అర్ధ రాత్రి సమయంలో భవానీ ఫంక్షన్ హాల్ ప్రక్కన మద్యం బాటిల్‌లతో ఉన్న ముగ్గురు వ్యక్తులు ముగ్గురు వ్యక్తులు కారింగు క్రాంతి కుమార్,మహమ్మద్ సాజిద్,మహమ్మద్ నాసర్ పాషా అను ముగ్గురు వ్యక్తులను చూసి విధి నిర్వహణలో ఉన్న పోలీసులు వారిని అక్కడి నుండి వెళ్లిపోవాలి అని సూచించగా సదరు వ్యక్తులు పోలీస్ వారిపై దురుసుగా ప్రవర్తించి,దుర్భాశలాడుతూ దాడి చేశారు.ఇట్టి విషయం మీద కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు చండూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి ఆ ముగ్గురు మందు బాబులను అరెస్ట్ చేసి రిమండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

## వికలాంగుల సంక్షేమశాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** వికలాంగుల సంక్షేమశాఖన ప్రత్యేక శాఖగా కొనసాగించాలనే జీవో నెం.34ను అమలు చేయాలని ఈనెల 10న జిల్లా వ్యాప్తంగతా జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రామన్నపేట మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్ వద్ద వాల్ పోస్టర్‌ను విడుదల చేయగా జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జీవో నెం.34 ద్వారా మహిళ శిశు సంక్షేమశాఖ, వికలాంగుల సంక్షేమశాఖ మధ్య జిల్లాలో అందుబాటులో ఉన్న ఉద్యోగులను సర్దుబాటు చేసి వికలాంగుల సంక్షేమశాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని 2022 డిసెంబర్ 2న తేదీన ఉత్తర్వులు ఇచ్చిందని, ప్రభుత్వం జీవో ఇచ్చిన 3 సంవత్సరాలు అవుతున్న అమలు కావడం లేదన్నారు. వికలాంగుల సంక్షేమం కోసం నిర్వహణ కోసం అసిస్టెంట్ డైరెక్టర్‌ను జిల్లా స్థాయిలో తిరిగి నియమించాలని ప్రభుత్వం జీవో విడుదల చేసింది. నవంబర్ 10న భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డి మండల అధ్యక్షుడు బలుగూరి అంజయ్య, మండల కార్యదర్శి గిరికల లింగస్వామి, మండల ఉపాధ్యక్షుడు నాగు నరసింహా, మండల సహాయ కార్యదర్శి పున్న శ్రీధర్, సుంకి వెంకటేశం, యాదయ్య, నరసింహా, శ్రీరామ్, సంతోష్ పాల్గొన్నారు.

# షరతుల్లేకుండా పత్తిని కొనుగోలు చేయాలి

జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/ రామన్నపేట:** పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి అకాల వర్షంతో దెబ్బతిన్న పత్తిని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సిపిఐ మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు నిర్వహించి పేదల పక్షాలన నిలబడుతుందని నేటికి దేశంలో చెక్కుచెదరని పార్టీ ఉందంటే అది కేవలం సిపిఐ మాత్రమేనని ఆయన అన్నారు. సిపిఐ వంద సంవత్సరాల శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని, ఖమ్మం బహిరంగ సభ జయప్రదం కోసం హైద్రాబాద్ నుంచి బస్సు జాత ప్రారంభమై ఈనె 20, 21న జిల్లాకు విచ్చేయుచున్న సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజానాట్యమండలి కళాకారులు, స్వాగతం పలికి బహిరంగ సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎర్ర రమేష్ అధ్యక్షత వహించిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి.ఇమ్రాన్, మండల కార్యదర్శి ఉట్కూరు నరసింహా, ఏఐటీయూసీ మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, సీనియర్ కామ్రేడ్ బాలగోని మల్లయ్య, ఉట్కూరు భగవంతు, గంగాపురం వెంకటయ్య, ఉట్కూరి కృష్ణ, జగన్నాథం, పెండెం రవీందర్, మీసం గాలయ్య, పట్ల నరసింహా, రచ్చ యాదగిరి పాల్గొన్నారు.


### 100 సంవత్సరాలు సిపిఐ కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామంలో సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకున్నది. డిసెంబర్ 26న ఖమ్మం లో జరిగే లక్షలాదిమంది బహిరంగ సభకు 40 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారు ఈ బహిరంగ సభను విజవంతం చేయాలని పిలుపునిచ్చారు అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, ఎండి ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, నాయకులు బాలగోని సత్యనారాయణ, పులి పలుకుల మల్లేశం, సుద్దాల సాయికుమార్, మారోజు నరసింహాచారి, కోయిగూర రాముల్లు, అంబటి అంజయ్య, పోషణ బోయిన బొందయ్య, బత్తుల బిక్షపతి, భీమ గాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## దీక్షతో నూతన జీవన విధానానికి నాంది

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** హరిహరపుత్ర శ్రీఅయ్యప్ప స్వామి దీక్షతో నూతన జీవన విధానానికి నాంధి పలుకుతుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డిలు ఉన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ శిరీష దంపతుల నివాసంలో అయ్యప్పస్వామి పడిపూజను సంగయ్య గురు స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలాదారులు ఎంతో భక్తిశ్రద్ధలతో, నిష్టతో స్వామివారిని పూజిస్తారని ఎటువంటి వాతావరణం ఉన్నా అకుంఠిత దీక్షతో స్వాములు 41 రోజులు పూజలు చేయడం హర్షనీయమన్నారు. నాయకులు ఎలిమినేటి రమేష్, ధరావత్ వీరన్న నాయక్, షేక్ జహీర్, రావుల రాంబాబు, వల్దాసు శ్రీను, చెంచల నిఖిల్ నాయుడు, ఎర్రంశెట్టి సతీష్, లక్ష్మణ్, ఎలిమినేటి అభినాష్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



# మహిళా వేధింపులపై మౌనం తగదు

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మహిళా వేధింపులపై మౌనంగా ఉండొద్దని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ కోరారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. వేధింపులు ఉపేక్షించకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు. ఫిర్యాదులు చేసినప్పుడే పటిష్టంగా వాటిని నిర్మూలించగలమన్నారు. మహిళల రక్షణ కోసమే షీ టీమ్స్ కృషి చేస్తున్నాయన్నారు. జిల్లాలో సూర్యాపేట, కోదాడ డివిజన్ పరిధిలో షీ టీం బృందాలు పని చేస్తున్నాయని షీ టీం ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాలలో, స్కూల్స్, కాలేజీలలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్యవివాహాలు, వరకట్నం చట్టాలపై, నూతన మహిళా చట్టాలపై, డయల్ 100, టిసేఫ్ యాప్ మహిళ భద్రత, రక్షణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని, ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్, వాట్సప్ ద్వారా కూడా స్వీకరిస్తాని స్పష్టం చేశారు. మహిళలు, బాలికలపై ఆన్‌లైన్‌లో అసభ్యకర పోస్టులు పెట్టేవారు, సైబర్ నేరగాళ్లపై కూడా సైబర్, షీ టీమ్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. మహిళలు, బాలికలు, విద్యార్థులు షీ టీం సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా వేధించినా, రోడ్డుపై వెళ్ళేటప్పుడు అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా, మాట్లాడిన విద్యార్థినీలు, మహిళలు అత్యవసర పరిస్థితులలో జిల్లా పోలీస్ షీ టీం నంబర్ 8712686056 కి కాల్ చేసి, వాట్సప్ ద్వారా సందేశం పంపించి లేదా డయల్ 100కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని కోరారు. అక్టోబర్ నెలలో షీ టీమ్‌కు అందిన మొత్తం 21 ఫిర్యాదులు వచ్చాయన్నారు. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన కేసులు 31, ఎఫ్ఐఆర్ నమోదు చేసినవి 2, పెట్టి కేసులు 5, కౌన్సిలింగ్ ఇచ్చినవి 44, సంబంధిత పోలీస్ స్టేషన్‌కి పంపినవి 6 ఉన్నాయని వివరించారు. అక్టోబర్ నెలలో అవగాహన కార్యక్రమాలు కోదాడ డివిజన్‌లో 21, సూర్యాపేట డివిజన్‌లో 25 నిర్వహించామని తెలిపారు.

## ఈ రోడ్డు గుంతలమయం..

**ప్రజాపక్షం/మోతె :** ఈ రోడ్డు గుంతల మయం పొంచి ఉన్న ప్రమాదం మండల కేంద్రంలోని నుంచి నడిగూడెం మండలం చెన్నకేశవాపురం వెళ్ళే దారిలో తిరుపతమ్మ గుడి సమీపంలో రహదారిపై లోతైన గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలో నీరుచేరి గుంత కనపడకపోవడంతో వాహనదారులు అందులోపడి గాయాలపాలైన సంఘటనలు నిత్యం జరుగుతున్నాయి. అయినా నేషనల్ హైవే అథారిటి అధికారులు స్పందించకుండా ఉన్న తీరుతో ఈ రహదారిపై ఎక్కువ సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. సర్వీస్ రోడ్డు నుంచి మండల కేంద్రానికి ఈ రహదారిపై బస్సులు, వాహనాలు వస్తూ ఉంటాయి. పగటి సమయంలో సైతం దగ్గరకు వచ్చే వరకు గుంత కనిపించట్లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని రహదారిని మరమ్మత్తు చేయాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు. లేకుంటే ప్రాణాలకే ముప్పు అని తెలియజేస్తున్నారు.

**గుంత ప్రమాదకరంగా ఉంది : ఆంజనేయులు**

నడిరోడ్డుపై మోకాలు లోతులో గుంత ఏర్పడి వర్షపు నీరు నిల్వ ఉండడంతో గుంట ఉన్నట్లు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి నడిరోడ్డుపై ఉన్న గుంతను పూడ్చివేయాలని నిత్యం వచ్చిపోయే వాహనదారులకు రోడ్డు ప్రమాదాల బారి నుంచి తప్పించాలని వేడుకుంటున్నాడు.



## ప్రభుత్వ పథకాలు ప్రజలకు వరాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ (చివ్వెంల) :** ప్రభుత్వ పథకాలు ప్రజలకు వరాలని తెలంగాణ సాంస్కృతిక సారధి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీకాంత్ అన్నారు. శనివారం చివ్వెంల మండలం బండమీది చందుపట్ల గ్రామంలో ప్రభుత్వ పథకాలు, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, అభయహస్తం, రైతు బరోసా, స్వయం సహాయక సంఘాలకు నిధులు, స్కిల్ యూనివర్సిటీలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, రూ. 500లకు వంట గ్యాస్ వంటి ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెల రాము, టీం లీడర్ పల్లెల లక్ష్మణ్, కళా బృందం సభ్యులు గంట బిక్షపతి, గద్దం ఉదయ్, మాగి శంకర్, పాక ఉపేందర్, మద్దిరాల మంజుల, సిరిపంగి రాధ, ములకలపల్లి మల్లమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.



## ముగిసిన కాంగ్రెస్ రాష్ట్ర మహిళ నాయకురాలు రూప అంతక్రియలు

మృతి పట్ల పలువురి సంతాపం..

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించిన మాజీ కౌన్సిలర్ దుబ్బ అశోక్ సుందర్ సతీమణి, కాంగ్రెస్ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప పార్థివదేహాన్ని శనివారం నల్లగొండలోని వారు నివాసంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి,నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్,మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్‌లు రావుల శ్రీనివాస రెడ్డి,మారగోని గణేష్,మైనం శ్రీనివాస్,జెపి మాజీ కోఆప్షన్ సభ్యులు జాన్ శాస్త్ర,పెరిక కరుణ్ జయరాజ్ లు సందర్శించివారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రూప మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆమె కుటుంబానికి అందరం ఎల్లవేళలా అండగా ఉంటామని పేర్కొన్నారు. అదేవిధంగా క్లాక్ టవర్ సెంటర్లో ఉన్న సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం దేవరకొండ రోడ్డులోని స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



## గంజాయి సేవించిన యువకుడు అరెస్టు

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్‌లోని స్థానిక ఆఫీసర్స్ క్లబ్ వెనుక భాగాన నిర్మానుష్యమైన ప్రదేశంలో ఒక యువకుడు గంజాయి సేవిస్తూన్నాడన్న సమాచారంతో స్థానిక పోలీసులు సంబంధిత ప్రదేశానికి వెళ్లి చూడగా సదరు వ్యక్తి ఖమ్మం జిల్లా మేడిపల్లి గ్రామానికి చెందిన బొడ్డు విక్రమ్ గా గుర్తించినట్లు స్థానిక ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. అతనికి గంజాయి తాగటం అలవాటుగా మారడంతో స్థానిక ప్రదేశానికి వచ్చి గంజాయి సేవిస్తున్నట్లు ఆయన అన్నారు. అతని వద్ద 145 గ్రాముల గంజాయి అదేవిధంగా గంజాయి తాగటానికి ఉపయోగించే బంగు బాటిల్, ఒక మొబైల్ ఫోను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి నిడమానూరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా అతనికి రిమాండ్ గురించినట్లు ఎస్ఐ తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ద్విచక్ర వాహనంపై వెళుతూ కోతి అడ్డు రావడంతో ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన భూదాన్ పోచంపల్లి మండలం జలాల్పూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానిక పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మృతుడు జలాల్‌పురం గ్రామ నివాసి గడ్డం ప్రభాకర్ అను వ్యక్తి, గత నెల 30న తన ఆక్టివా ద్విచక్ర వాహనంపై పోచంపల్లిలోని జేవీ ఫంక్షన్ హాల్‌లోని పెళ్లికి వెళ్ళి తిరిగి మధ్యాహ్నం ఇంటికి వస్తున్న క్రమంలో తన గ్రామ బస్ స్టాప్ వద్దకు వెళ్లే సరికి, అకస్మాత్తుగా కోతి అడ్డుగా రావడంతో, మృతుడు రోడ్డు మీద పడగ, తలకు ముందు భాగంలో కుడి కన్ను బొమ్మ పై బాగంలో, కుడి చేతికి రక్త గాయాలు అయి, తీవ్ర అంతర్గత గాయాలు తలకు తగిలి, ఓజోన్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. మృతుడి పెద్ద కుమారుడు గడ్డందేవి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానీ పోస్ట్ మర్టామ్ నిమిత్తం భువనగిరి హాస్పిటల్‌కి తరలించి, శవరిక్ష అనంతరం మృత దేహాన్ని మృతుని రక్త సంబందికులకు అప్పగించినట్లు తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/చండూరు :** చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో డాన్‌బోస్కో జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం శనివారం జరిగింది.కళాశాల స్థాపించి 40 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పూర్వ విద్యార్థులు అందరు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకొని పూర్వ విద్యార్థులు,యాజమాన్యాన్ని,అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ రాజేష్ పూర్వ విద్యార్థులకు స్వాగతమ్ పలికారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ విల్సన్ మాట్లాడుతూ తాను కూడా ఈ కళాశాల పూర్వ విద్యార్థి కావడం తన పూర్వ జన్మ సుకృతం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ ప్రవీణ్,డాక్టర్ కోడి శ్రీనివాసులు,గచ్చిబౌలి సిఐ క్రాంతి, రావిరాల శ్రీను,నంగనూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శివకోటి,అనంత చంద్రశేఖర్ గౌడ్,దోటి వెంకన్న,కోడి వెంకన్న,నల్లగంటి మల్లేష్,సిలివేరు రాజు, ఎస్ఐ శాంతం రెడ్డి,నగేష్,తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

## రామాలయానికి పల్లకీ బహుకరణ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** మండల పరిధిలోని లింగగిరి గ్రామంలోని రామాలయానికి స్థానిక భక్తులైన బబ్బెళ్ళపాటి వెంకట రామారావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శనివారం పల్లకి బహుకరించారు. మొదట ఆలయ సాంప్రదాయం ప్రకారం విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, కంకణ ధారణ చేశారు. నూతనంగా తయారు చేయించిన పల్లకికి సంప్రోక్షణ చేసి పూలమాలలతో, మామిడి తోరణాలతో అలంకరించారు. సీతా, లక్ష్మణ సమేత రామచంద్రస్వామి పల్లకిలో వేంచేసి దేవాలయం చుట్టూ ముమ్మారు ప్రదక్షణ గావించారు. భక్తులే బోయిలుగా దేవాలయంలో జరిగే వివిధ ఉత్సవాలలో, పండుగలలో ఈ పల్లకి వినియోగిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. దాదాపుగా రూ.50వేలతో తయారు చేయించిన కలప పల్లకి దేవాలయానికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దామోదరాచార్యులు, అరుణకుమారి, వెంకట విశ్వనాథరావు, నాగమల్లేశ్వరి, వెంకటసాయి మహేశ్వర్, వెంకట విహిత, భక్తులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## నేడు జాతీయ న్యాయ సేవల దినోత్సవం

**ప్రజాపక్షం / ఆత్మకూరు :** నేడు జాతీయ న్యాయ సేవల దినోత్సవ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జికే రాములు తెలిపారు. ప్రతి సంవత్సరం నవంబర్ 9న నిర్వహించడం జరుగుతుందని, ఈ సందర్భంగా పట్టణంలోని న్యాయస్థానం నుండి ప్రధాన వీధుల గుండా గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది కావున ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ప్రజాప్రతినిధులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించే సంస్థలను స్థాపించడానికి ఉద్దేశించిన లీగల్ సర్వీస్ అథారిటీ చట్టం 1987 నవంబర్ 9న జాతీయ న్యాయ సేవల దినోత్సవం జరుపుకుంటామని పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, చట్ట ప్రకారం సమాన రక్షణకు హామీ ఇస్తుంది, అయినప్పటికి నిరక్షరాస్యత, పేదరికం, ప్రకృతి వైపరీత్యాలు నేరం లేదా ఆర్థిక స్తోమత లేకపోవడం వంటి ఇతర అడ్డంకుల కారణంగా చాలామంది న్యాయ సేవలకు పొందలేకపోతున్నారు. సమర్థవంతమైన న్యాయ సేవలను అందించడానికి లీగల్ సర్వీస్ అథారిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## పదవ తరగతి వార్షిక పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** పదవ తరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి విద్యార్థినిలకు సూచించారు. శనివారం భూత్పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందుకుగాను రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరుకావాలన్నారు. పదవ తరగతి విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడి పాఠ్యాంశాల బోధన, ప్రత్యేక తరగతులు, మెనూ, మౌలిక వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరవుతూ సబ్జెక్టు విషయాల పట్ల ఎప్పటికప్పుడు అప్డేట్‌గా ఉండాలన్నారు. పాఠశాల నిర్వహణపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పారిశుద్ధ్యం, విద్యార్థినిల ఆరోగ్యం, భోజనం, తదితర అంశాల పట్ల ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. వంటశాలలో విద్యార్థినులకు వండిన ఆహారంను పరిశీలించారు. విద్యార్థినిలకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట తాహసీల్దార్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## మామిడి సాగు అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాపక్షం/ మక్తల్ :** ఉద్యాన శాఖ, పట్టు పరిశ్రమ శాఖ సంయుక్తంగా మామిడి సాగు చేస్తున్న రైతులకు క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం (cluster development programme)లో భాగంగా ఉద్యాన శాఖ అధికారులు పాల్గొని వారు మాట్లాడుతూ సిడిపి ప్రత్యేక సహాయాన్ని అందిస్తున్నామని ఈ కార్యక్రమంలో ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ అయిన ప్రసాద్ సీడ్స్ సహకారంతో మామిడి పండ్లకు ఉపయోగించే ఫ్రూట్ కవర్లు (fruit protection cover / bags) రైతులకు అందుబాటులోకి తెచ్చారనీ ఈ కవర్లు మామిడి పండ్లను పిట్టల నుండి, పురుగుల నుండి రక్షిస్తాయనీ. ఫ్రూట్ క్వాలిటీ మెరుగు పడి మార్కెట్ విలువ పెరుగుతుంది అన్నారు. క్లస్టర్ ప్రోగ్రాంలో భాగంగా రైతులకు 50% సబ్సిడీ ( రాయితీ) కింద ఈ కవర్లు అందజేయబడుతయన్నారు. అర్హులైన మామిడి రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని దరఖాస్తులు సమర్పించవచ్చు అన్నారు. దరఖాస్తులు ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ ఆధారంగా స్వీకరించబడతాయని పరిమిత స్టాక్ మాత్రమే అందుబాటులో ఉంటుందనీ దీనిని అందరూ రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకోసం కింది అధికారులను సంప్రదించలని ఒక ప్రకటనలో తెలియజేశారు. రామకృష్ణ ఉద్యాన శాఖ అధికారి (Horticulture officer ) 8977714457 జనార్ధన్ . హెచ్‌ఈఓ 9908417971.

## డ్రైవర్లకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ ధన్వాడ :** ధన్వాడ మండలంలో వాహనాల్లో ఓవర్లోడ్ తో వెళ్లడం వల్ల తమ ప్రాణాలకు ముప్పని ధన్వాడ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని వివిధ గ్రామాల నుంచి పత్తి పంట పొలాలకు కూలీలుగ తీసుకెళ్తున్న ఆటో, ట్రాక్టర్ బుల్లోరా వాహనాల్లో తరలించకూడదని డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ వాహనాల సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదు. ఏ వాహనమైన ఓవర్లోడ్ వల్ల ఆ యొక్క వాహనం అదుపు తప్పి ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉంటుంది. అధిక వేగం వల్ల ఒక క్షణం నిర్లక్ష్యం ప్రాణ నష్టం కలిగించవచ్చు అని తెలిపారు. డ్రైవంగ్ చేసే సమయంలో మొబైల్ ఫోన్ మాట్లాడకూడదని రోడ్డు మలుపు ధ్గర సౌండ్ హార్న్ చేస్తూ ఎటువైపు వెళ్ళనో అక్కడ ఇండికేటర్ వేస్తూ రోడ్డు నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెప్పాడు.

## 'ఫస్ట్' ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని మహిళల నైపుణ్యాభివృద్ధి కోసం, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సొంత నిధులతో, మహబూబ్ నగర్ ఫస్ట్ సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీషన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ తెలిపారు. మహబూబ్ నగర్ మధురా నగర్ లోని మహబూబ్ నగర్ ఫస్ట్ శిక్షణా కేంద్రంతో పాటు, మున్సిపల్ కార్యాలయం లోని మెప్మా కేంద్రంలో కూడా ఈ శిక్షణ తరగతులు నిర్విహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కనీస విద్యార్హతలు పదవ తరగతి పాస్ లేదా ఫేయిల్ ఆ పై విద్యార్హతలు తో పాటు 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల వయస్సు గల మహిళా అభ్యర్థుల మంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆసక్తి , అర్హతలు కలిగిన మహిళలు సంబంధిత శిక్షణ కోసం ఫోన్ నెంబర్ : 7207 9 88913,72079 88914 సంప్రదించాలని గుండా మనోహర్ కోరారు.

## వలలో చిక్కుకుని మత్స్యకారుడు మృతి



**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మండల కేంద్రం వీపనగండ్లలో విషాదం చోటు చేసుకుంది. చేపల వేటకై వేసిన వలలో చిక్కుకొని ఒక మత్స్యకారుడు మృతి చెందిన ఘటన స్థానికులను కలచివేసింది. స్థానిక ఎస్సై కె.రాణి, గ్రామస్తుల కథనం ప్రకారం వీపనగండ్ల గ్రామానికి చెందిన కొట్టం మౌలాలి (59) శుక్రవారం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. అయితే రాత్రికి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. శనివారం ఉదయం వారు పొలం వద్దకు వెళ్లి వెతికినప్పుడు కాలువ గట్టుపై మౌలాలి దుస్తులు, చెప్పులు కనిపించాయి. దాంతో అనుమానం చెంది సమీపంలోని భీమా కాలువలో గాలింపు చేపట్టగా, కాలువలో చేపలా వలలో చిక్కుకుని మౌలాలి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న ఏఎస్సై వెంకటరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన పై మౌలాలి భార్య అలివేల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కె.రాణి దర్యాప్తు చేపట్టారు. మౌలాలి చేపల వేట ద్వారానే జీవనోపాధి పొందుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛ్ఛాయ నెలకొంది. మత్స్యాకార సంఘం నాయకులు మౌలాలి కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

# ఒకట్రెండు రోజుల్లో పిసిసి సెంటర్‌లు ప్రారంభించాలి

హన్వాడ, మహమ్మదాబాద్, గండీడ్ మండలాల్లో గల రైస్ మిల్లుల తనిఖీ చేసిన రెవెన్యూ అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** గండీడ్ మండలంలో గల కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాన్ని, వేపూర్ గ్రామం హన్వాడ మండలం ఎఫ్‌పి షాప్‌ను రెవెన్యూ అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. మహమ్మాదాబాద్ మండలం దేశాయిపల్లి గ్రామంలో గల ఐకెపి నుంచి నడుస్తున్న వరి కొనుగోలు కేంద్రం తనిఖీ చేశారు. మిగిలిన అన్ని పిపిసిలు రేపటికి ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మన జిల్లాలో సిఎంఆర్ డెలివరీ ఇప్పటికి 96% పూర్తి అయింది. ఇంకా మిగిలిన 4% సంబంధించిన 5 రైస్ మిల్లులు లక్ష్మి బాలాజీ, షిర్డీ సాయి, లక్ష్మీ వెంకటేశ్వర, మంజునాథ, శ్రీరామ హన్వాడ, మహమ్మదాబాద్, గండీడ్ మండలాల్లో గల రైస్ మిల్లులను తనిఖీ చేశారు. రైస్ మిల్లులు 24 గంటలు నడిపిస్తు సిఎంఆర్ త్వరగా పూర్తి చేయాలని రైస్ మిల్లుల యాజమాన్యాన్ని ఆదేశించారు. అలాగే త్వరగా పూర్తి చేయించాలని ఆ మండలాల సివిల్ సప్లై ఎన్ఫోర్సమెంట్ డిప్యూటీ తాహసిల్దార్ ఆదిత్య గౌడ్‌కు బాధ్యత అప్పజెప్పారు. ఐదు రైస్ మిల్లులు సిఎంఆర్ పూర్తి చేయకుంటే ఖరీఫ్ 2025–26 వారికి అలాట్మెంట్ చేయొద్దని డిసిఎస్ఒ, డిఎంసిఎస్‌లను ఆదేశించారు. అలాగే గండీడ్ మండలంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేయడం జరిగింది. అక్కడ గత వారం కింద కెజిబివి సందర్శించి గుర్తించిన సమస్యలు ఎంతవరకు పరిష్కారం అయ్యాయో అని పరిశీలన చేయడం జరిగింది. ఇంకుడు గుంత పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే విద్యాలయంలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అలాగే వేపూర్ గ్రామం హన్వాడ మండలంలో గల ఎఫ్‌పి షాప్ నెంబర్ 14 తనిఖీ చేయడం జరిగింది. అక్కడ డీలర్‌కు అతేంటిఫికేషయిన్ సర్టిఫికెట్ లేకపోవడం, ఎఫ్‌పి షాప్ గురించి బోర్డు కూడా సరిగ్గా లేకపోవడం చూసి డీలర్‌కు షోకాస్ నోటీసు ఇవ్వాలని హన్వాడ తాహసీల్దార్ ను ఆదేశించారు. అక్కడ లబ్ధిదారులను బియ్యం బాగున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. భూత్పూర్ మండలం హస్నాపూర్ గ్రామంలో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో చనిపోయిన మూసాపేట్ మండలం వేముల గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్‌రెడ్డి, పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘ టించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైరర్యం కల్పించారు. ప్రభుత్వ పరంగా రావలసిన బెనిఫిట్స్ అందించుటకు చ ర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయితీ అధికారి ని ఆదేశించారు. తాహసిల్దార్ కిషన్ తదితరులు ఉన్నారు.

## సోమశీల–శ్రీశైలం క్రూయిజ్ లాంచీ ప్రయాణం పునఃప్రారంభం



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** కొల్లాపూర్ నియోజకవర్గం సోమశీల నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి కృష్ణానదిలో 6 గంటల పాటు టూరిస్ట్‌లకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే సోమశీల శ్రీశైలం క్రూయిజ్ లాంచీ ప్రయాణాన్ని శనివారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటకశాఖ అధికారి కల్వరాల నరసింహ కొల్లాపూర్ సిఐ మహేష్, ఎస్ఐ హృషికేష్ పూజలు నిర్వహించి జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో కొల్లాపూర్ ప్రాంతం పర్యాటక రంగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. తెల్లవారుజామునే హైదరాబాదు నుంచి ఏకో టూరిజం ప్రత్యేక వాహనంలో వచ్చిన 65 మంది పర్యాటకులు ముందుగా సోమేశ్వరాలయాన్ని దర్శించుకున్నారు. లాంచ్ ప్రారంభం కావడంతో నల్లమల్ల కొండల మధ్య, నిండుగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ ఒడిలో మహా పుణ్యక్షేత్రమైన శ్రీశైల పుణ్యక్షేత్రానికి క్రూయిజ్ లాంచీ బయలుదేరి వెళ్లారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ అందుబాటులో ఉన్న నాలుగు నెలలు మాత్రమే క్రూయిజ్ లాంచీ ప్రయాణం ప్రయాణీకులకు అందుబాటులో ఉంటుందని, ఆహ్లాద వాతావరణంలో శ్రీశైలం వెళ్లాలనుకునే పర్యాటకులు భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటశాఖ అధికారి కల్వరాల నరసింహ కోరారు. కార్యక్రమంలో టూరిజం యూనిట్ ఇంచార్జ్ ప్రేమ్ కుమార్, డిప్యూటీ మేనేజర్ ప్రభుదాస్, సోమశిల గ్రామం మాజీ సర్పంచ్ మద్దిలేటి, పర్యాటక, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


## సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు బహిరంగంగా ప్రకటించాలి

బిసి జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిసి జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే ద్వారా రాష్ట్రంలోని అన్ని కులాల ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, సామాజిక, ఆస్తుల వివరాలను సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం వివరాలను గ్రామ, మండల, జిల్లాల వారిగా వెల్లడించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు, భూములు ఏ సామాజిక వర్గం గుప్పెట్లో ఉన్నాయో రాష్ట్ర ప్రజలందరికీ తెలుస్తుందన్నారు. డెడికేషన్ కమిషన్, బిసి కమిషన్ చైర్మన్‌లు అందించిన నివేదికలను రాష్ట్ర ప్రజల ముందు ఉంచకుండా ఎందుకు దాపరికం చేస్తున్నారని, నిజాలు బయటికి వస్తే పాలకుల పీఠలు కదులుతాయని భయమా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత రాహూల్ గాంధీ వచ్చేశీతాకాల పార్లమెంట్ సమావేశాలలో ఇండియా కూటమి పార్లమెంటు సభ్యులతో కలిసి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిసి రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెట్టి, విద్యా, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, రాజకీయ పారిశ్రామిక, రంగాలలో చట్టబద్ధతతో కూడుకున్న రిజర్వేషన్లను కల్పించేలా ఒత్తిడి తేవాలని కోరారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ అమలు చేశాకే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రఘునందన చారి, నియోజకవర్గం అధ్యక్షులు బొల్లెమోని నిరంజన్, మండల అధ్యక్షులు నర్సిములు తదితరులు పాల్గొన్నా రు.

## క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహణ : వనపర్తి సిఐ



**ప్రజాపక్షం/వనపర్తి :** ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తు నిత్య జీవనంలో వాకింగ్, వ్యాయామం భాగం చేసుకోవాలి. శనివారం రోజు ఉదయం జిల్లా పోలీసు కార్యాలయ అవరణలోని పరేడ్ మైదానంలో జిల్లా ఎస్‌పి రావుల గిరిధర్ ఐపిఎస్ ఆదేశాల మేరకు వనపర్తి సిఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో జిల్లా ఆర్మూడ్ రిజర్వ్, సివిల్ పోలీస్ సిబ్బందికి వీక్లి పరేడ్ నిర్వహించడం జరిగింది. అనంతరం సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్ డ్రిల్, ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్, ట్రాఫిక్ డ్రిల్ సిబ్బంది ప్రదర్శనని పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రతిరోజు ఉదయాన్నే కనీసం ఒక అరగంట వ్యాయామం, నడక ఏదో ఒకటి చేయాలని, సాధ్యమైనంత వరకు బయట ఆహారం తినడం మానివేయాలన్నారు. రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేసుకోవాలని సిఐ తెలిపారు. వీక్లి పరేడ్ వల్ల సిబ్బందికి క్రమశిక్షణ, యూనిటీగా ఉండడం, ఫిజికల్ ఫిట్‌నెస్‌కి ఉపయోగపడుతుందన్నారు. క్రమశిక్షణతో డ్యూటీలు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందేలాగా పనిచేస్తూ పోలీస్ శాఖకి, జిల్లాకి మంచి పేరు తెచ్చేలాగా పని చేయాలని అన్నారు. సిబ్బందికి ఏదైనా సమస్య వుంటే ఎప్పుడైనా తనను కలుసుకొని తమ సమస్యను తెలియజేసుకోవచ్చన్నారు. ఈ పరేడ్‌లో వనపర్తి సిఐ, కృష్ణ య్య, స్పెషల్ బ్రాంచ్ సిఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్ అన్ని పోలీస్ స్టేషన్‌ల కానిస్టేబుళ్లు, ఏఎస్సైలు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేత



**ప్రజాపక్షం/వెల్దండ :** యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా గురుకుల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పె న్నులు, పాఠ్యపుస్తకాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రె స్ అధ్యక్షులు మట్టభరత్‌గౌడ్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు మూడవత్‌అనిల్‌కుమార్‌లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరున ప్రత్యేక కేక్‌కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని గడీలపాలననుండి విముక్తిచేసి కాంగ్రెస్‌పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి , ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్నిరంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. విద్య ద్వారానే సమాజంలో మంచిగుర్తింపు వస్తుందని ప్రతి విద్యార్థి మంచిగా చదువుకొని ఉన్నతస్థాయిలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మట్టశివగౌడ్, బాదేపల్లి అరుణ్, పుట్టశివ, సమీర్, అప్రోజ్, సతీష్, జీవన్, మల్లేష్, రఘు, అరవింద్ పాల్గొన్నారు.

## రహదారికి మరమ్మతులు



**ప్రజాపక్షం/వెల్దండ :** ఇటీవలకాలంలో కురిసిన భారీ వర్షాలకు అజిలాపూర్‌బైరాపూర్ ప్రధానరహదారి చాలాచోట్ల కోతకుగురై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ఈరోడ్డుపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలుజారిపడి ఇప్పటివరకు పదిమందిదాకా గాయపడ్డారు. అజిలాపూర్ గ్రామస్తులు ఈరోడ్డు బాగుచేయమని సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు , స్థానిక ఎమ్మెల్యేకి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకునేవారే కరువయ్యారు. ఈరోడ్డు ఇలాగే ఉంటే మరింత మంది వాహనదారులు ప్రమాదాల బారినపడే అవకాశం ఉన్నందున, అజిలాపూర్ గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్‌పార్టీ మండల నాయకుడు సిద్ధగౌని రమేష్‌గౌడ్ తన సొంత ఖర్చులతో మట్టిపోయించి జేసిబితో లెవల్ చేయించి రాకపోకలకు మార్గం సుగమం చేయించడం జరిగింది. కార్యక్రమంలో బిఆర్‌ఎస్‌పార్టీ నాయకులు కొప్పుకృష్ణయ్య, తిరుపతయ్య, కేశమోని గణేష్‌గౌడ్, కొరుపూరు కుమార్, కాలేనర్సింహ్మా, కాలేశ్రీశైలం, రాములు, మహేష్, వెంకటయ్య, పెద్దవెంకటయ్య, పరమేష్, బక్కయ్య పాల్గొన్నారు.

## ప్రమాదానికి గురైన కూలీల ఆటో



**ప్రజాపక్షం/ దామరగిద్ద :** దామరగిద్దకు చెందిన ఆటో అంతవార్ గ్రామం నుండి కూలీలను ఎక్కించుకొని దామరగిద్దకు వెళుతున్న సమయంలో ఆటో చిన్న చెట్రం సమీపంలో ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలు కాగా వారిని అంబులెన్స్ ద్వారా నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది.

## మైనర్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా కేంద్రంలో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య తల్లిదండ్రులు, మైనర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాల ఇ వ్వరాదని, మైనర్ పిల్లల చేత వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని తెలిపారు. వారు అవగాహన లేమితో డ్రైవింగ్ చేసి ఇతరులకు కూడా ఇబ్బందులు కలిగించి రోడ్డు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని తెలిపారు. తల్లిదండ్రు లు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని మళ్లీ రిపీట్ అయితే వాహనాలను సీజ్ చేస్తూ తల్లిదండ్రులను చట్ట ప్రకారం జైలుకు పం పించడం జరుగుతుందని సూచించారు. అలాగే, విద్యార్థులకు ట్రాఫిక్ రూ ల్స్, రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా పోలీసులు ఇలాంటి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## అభాగ్యులను అక్కున చేర్చుకున్న 'సఖి'

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి పట్టణానికిచెందిన కప్పెరలక్ష్మి(30) భర్త రాములు చనిపోవడంతో ముగ్గురు చిన్నపిల్లలు అనూష(4), కాశీం(3), కన్నయ్య(1)తోపాటు అనాథగా మిగిలిపోయింది. ఉండటానికి ఇల్లుకూడా లేకపోవడంతో బస్టాండు పరిసర ప్రాంతాల్లో దీనావస్థలో తిరుగుతుంటే కల్వకుర్తి పట్టణ బిజెపి అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్ గమనించి నాగర్‌కర్నూల్ జిల్లా సఖికేంద్రానికి తెలియజేశారు. సఖికేంద్రం లీగల్ కౌన్సిలర్ టి.సరిత తన సిబ్బందితోవచ్చి తల్లి లక్ష్మికి కౌన్సిలింగ్ ఇచ్చి తల్లితోపాటు ముగ్గురు చిన్నారులను జిల్లా సఖికేంద్రానికి తరలించారు.

# ఘనంగా సిఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు









**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినోత్సవాన్ని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆదేశాను సారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి సిఎంకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మా రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్ . పి. వెంకటేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వినోద్ కుమార్, మారేపల్లి సురేందర్ రెడ్డి హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

### జడ్చర్ల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో

సిఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జడ్చర్ల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో, శాసనసభ్యులు జానంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆదేశం మేరకు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ఆవరణలో జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత, నర్సింలు, మార్కెట్ చైర్మన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాజేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిత్యానందం, శివకుమార్, మాలిక్ షాకీర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని పుట్టినరోజు కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది.

### నారాయణపేట పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని శనివారం నారాయణపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సివిఆర్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్టివో బోర్డ్ సభ్యులు పోషల్ రాజేష్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు మహిముద్ ఖురేషి, మాజీ కౌన్సిలర్ అమీరుద్దీన్, పట్ట ణ మైనారిటీ సెల్ అధ్యక్షులు రహమాన్ చాంద్, పోర్ల మైనొద్దీన్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్వ మనోజ్, అఖిల్ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

### పెబ్బేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

పెబ్బేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పళ్ళు, బ్రెడ్లు పంచిపెట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మకూరు పట్టణంలో


ఆత్మకూరు పట్టణంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్. పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్లగొండ శ్రీనివాసులు, మని వర్ధన్ రెడ్డి, వెంకట నరసింహారావు, దామోదర్, మహేష్, గణేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

### కొండారెడ్డిపల్లిలో

రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, అభిమానులు శనివారం ఘనంగా జరుపుకున్నారు.





## మత్తు వదలరా కాంబినేషన్‌లో కొత్త సినిమా షురూ

సెన్సేషనల్ మత్తువదలరా కాంబినేషన్ మరోసారి అలరించబోతోంది. కల్ట్ హిట్ అయిన మత్తు వదలరాతో తో దర్శకుడిగా పరిచయమై, ఆ తర్వాత మరో బ్లాక్‌బ్లాస్టర్ సీక్వెల్ మత్తువదలరా 2 విజయాన్ని అందుకున్న రితేష్ రానా తన నాలుగవ చిత్రానికి శ్రీకారం చుట్టారు. యూనిక్ స్టయిల్ నరేషన్ తో ఆకట్టుకునే రితేష్ రానా మరోసారి సత్యతో జతకడుతున్నారు. ఈ చిత్రాన్ని క్లాప్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 4గా చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా ఈ చిత్రంతో తెలుగు సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఆమె పాత్ర కథలో కీలకంగా వుంటుంది. సత్యతో ఆమె జంటగా కనిపించడం ప్రేక్షకులకు ఒక ఫ్రెష్‌నెస్ ఇవ్వనుంది. మత్తు వదలరా ఫ్రాంచైజీలో భాగమైన వెన్నెల కిషోర్, అజయ్ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధిన పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సంగీతం కాల భైరవ, సినిమాటోగ్రఫీ సురేష్ సరంగం, ఎడిటింగ్ కార్తిక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైన్ నార్ని శ్రీనివాస్ పని చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ త్వరలో హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది.

## 'కలివి వనం' ట్రైలర్ ఆవిష్కరణ



వృక్షో రక్షతి రక్షితః అన్నారు పెద్దలు. ఇలాంటి మంచి సందేశాన్నిస్తూ వనాలను సంరక్షించుకోవాలనే నేపథ్యంతో పూర్తి తెలంగాణ పల్లెటూరి బ్యాక్ డ్రాప్‌లో చిత్రీకరించిన అరుదైన సినిమా కలివి వనం. హీరోయిన్‌గా నాగదుర్గ పరిచయమవుతోంది. కలివి వనం సినిమాను ఏఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్ నరేంద్ర రచనా దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి లు నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను సీనియర్ జర్నలిస్టులు ఆవిష్కారించారు. ఈ నెల 21 విడుదల అవుతున్న ఈ సినిమా రిలీజ్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా నటుడు సమ్మెట గాంధీ మాట్లాడుతూ అడవిలో చెట్లు మనకు ఎంత ఉపయోగపడతాయన్న దాని మీద ఈ సినిమా చాలా బాగా తీశారు. సినిమా కూడా చాలా బాగా వచ్చింది. మా చిత్ర, దర్శక నిర్మాతలు మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి డబ్బులకు ఎక్కడా వెనకాడకుండా జగిత్యాల పరిసర ప్రాంతాల్లో, అడవుల్లో రాత్రనక పగలనక ఎంతో కష్టపడి చిత్రీకరణ చేయడం జరిగింది. మంచి కాన్సెప్ట్ తో వస్తున్న ఈ సినిమాను ప్రమోట్ చేస్తారని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ మదీన్ ఎస్.కె ,చిత్ర దర్శకుడు రాజ్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి , నాగ దుర్గ, బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, మహేంద్ర నాథ్, సతీష్, శ్రీ చరణ్, అశోక్ తదితరులు ఈ చిత్రంలో రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయల, బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, మహేంద్ర నాథ్, సతీష్ శ్రీ చరణ్, అశోక్ తదితరులు కీలకపాత్రలు పోషించారు.



## అది ఒక గొప్ప అనుభూతి

**- దుల్కర్ సల్మాన్**

మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ పీరియాడికల్ డ్రామా 'కాంత' 14న విడుదల కానుంది. టీజర్, పాటలు అద్భుతమైన రెస్పాన్స్‌తో మంచి బజ్ క్రియేట్ చేశాయి. ట్రైలర్ రిలీజ్ తో ఇప్పుడు ఎక్సయిట్మెంట్ మరింత పెరిగింది. రెబెల్ స్టార్ ప్రభాస్ లాంచ్ చేసిన ట్రైలర్ అదిరిపోయింది. ఒక రైజింగ్ స్టార్, అతనికి దారి చూపిన గురువు మధ్య ఉన్న ఎమిషన్ని ట్రైలర్ ఆసక్తికరంగా ప్రజెంట్ చేసింది. ఈ ఇద్దరి డ్రీం ప్రాజెక్ట్ 'కాంత' దగ్గరకి వచ్చేసరికి ఇగో వార్‌గా మారుతుంది. స్నేహం, ఆశయాల మధ్య నడిచే ఈ సంఘర్షణ 'కాంత' కథపై మరింత ఆసక్తిని పెంచింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ..

నా బెస్ట్ ఫ్రెండ్ రానాతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. నేను వాళ్ళింట్లో అబ్బాయిలానే ఉంటాను. మేమిద్దరం కలసి సినిమా చేయడం చాలా ఆనందంగా వుంది. సెల్వ అద్భుతమైన కథతో వచ్చాడు. సముద్రఖనితో కలిసి వర్క్ చేయడం గొప్ప అనుభూతి. ఇందులో ఆయన మెమొరబుల్ పెర్ఫార్మన్స్ చూస్తారు. కుమారి పాత్రలో భాగ్యశ్రీ చాలా డిఫరెంట్ పెర్ఫార్మన్స్ ఇచ్చారు. ఇందులో అద్భుతమైన మ్యూజిక్ వుంది. ఇది మంచి డ్రామా, థ్రిల్లర్. డెఫినెట్‌గా థియేటర్స్‌లో చూడండి. గ్రేట్ ఎక్స్పీరియన్స్ ఉంటుంది అన్నారు. హీరో రానా దగ్గుబాటి మాట్లాడుతూ.. నేను చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చినప్పుడు ఇక్కడ ఏ స్టూడియోస్ లేవు. అందరూ విజయ స్టూడియో, వాహిని స్టూడియో, ఏవీఎన్ స్టూడియోలలో జరిగే పనుల గురించి మాట్లాడుకునే వాళ్ళు, స్టార్స్ గురించి చెప్పుకునే వాళ్ళు. ఇప్పుడైతే సోషల్ మీడియా ఉంది. అప్పుడు స్టూడియోలో జరిగే విషయాలు చాలా తక్కువ మందికి తెలిసేది. అలాంటి ఒక్క బ్యాక్ డ్రాప్‌లో సెల్వ కథ చెప్పడం జరిగింది. కథ విన్న వెంటనే కచ్చితంగా ఈ సినిమా చేయాలనిపించింది. ఇలాంటి పీరియడ్ సినిమాకి దుల్కర్ సల్మాన్ పర్ఫెక్ట్. 14 తర్వాత దుల్కర్‌ని మీరు అందరూ నటచక్రవర్తి అని పిలుస్తారు. భీమ్లా నాయక్‌లో సముద్రఖని అబ్బాయిగా చేశాను. ఇందులో మా రిలేషన్ చాలా కొత్తగా ఉంటుంది. దుల్కర్, సముద్రఖని లాంటి అద్భుత నటుల మధ్య నిల్చుంది భాగ్యశ్రీ. 14న మీ అందరినీ థియేటర్స్‌లో కలుస్తున్నాం అని అన్నారు.

భాగ్యశ్రీ మాట్లాడుతూ.. ఇప్పటివరకు నా సినిమాలు చూశారు. ఈ సినిమాలో నేను యాక్ట్ చేయడం చూస్తారు. కాంత నాకు చాలా చాలా స్పెషల్. ఈ సినిమాని థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను.

ఈ కార్యక్రమంలో నటుడు సముద్రఖని, డైరెక్టర్ సెల్వమణి, సెల్వరాజ్, ప్రొడ్యూసర్ ప్రశాంత్ పొట్లూరి తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల 29న బిజినెస్ మ్యాన్ రీరిలీజ్

సూపర్‌స్టార్ మహేష్ బాబు హీరోగా 2012లో విడుదలై ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన బిజినెస్ మ్యాన్ సినిమా మళ్లీ థియేటర్లలోకి రాబోతోంది. ఈ చిత్రాన్ని డైనమిక్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తెరకెక్కించగా, మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ థమన్ అందించిన బీట్స్ అప్పట్లో సెన్సేషన్ సృష్టించాయి. ఈ సినిమాను రి రిలీజ్ చేస్తున్న సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. ముంబయి మాఫియా బ్యాక్ డ్రాప్‌లో నడిచే ఈ కథలో సూర్య భాయ్ పాత్రలో మహేష్ బాబు కనిపిస్తాడు. నిర్మాత డా. వెంకట్ ఆధ్వర్యంలోని ఆర్ ఆర్ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత విలువైన ప్రొడక్షన్ వాల్యూస్తో తెరకెక్కించారు. ప్రొడక్షన్స్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా, పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన బ్లాక్‌బ్లాస్టర్ చిత్రం బిజినెస్ మ్యాన్ దేశవ్యాప్తంగా అల్ ఓవర్ గ్రాండ్ రీరిలీజ్ కానుంది.

## 'సైక్ సిద్ధార్థ' టీజర్ విడుదల



హీరో శ్రీ నందు తన అప్ కమింగ్ మూవీ 'సైక్ సిద్ధార్థ'కు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బ్యాకింగ్‌తో వస్తున్నారు. ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మించారు. మ్యాడ్ మాక్స్‌స్టైల్ మ్యాడ్‌నెస్‌తో యూత్‌ఫుల్ ఎంటర్టైనర్‌గా రూపొందిన సైక్ సిద్ధార్థ్‌లో హై ఎనర్జీ ఎంటర్టైన్మెంట్ వుండబోతుంది. ఈ చిత్రంలో యామిని భాస్కర్ కథానాయికగా నటించగా, ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రీ, మౌనిక కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్ర టీజర్ను లాంచ్ ద్వారా మేకర్స్ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. హీరో హైపర్‌యాక్టివ్, ప్రతి చిన్న పరిస్థితికి అనూహ్యయంగా స్పందించే యువకుడు. టీజర్ ప్రారంభంలో, అతను తన స్నేహితుడితో కలిసి వైల్ కారు ప్రయాణంలో, చిన్న చిన్న విషయాలపై తన నిరాశను చెబుతుంటాడు. విజయం సాధించడంలో నమ్మకం కోల్పోయిన ఓడిపోయిన వ్యక్తిగా తనను తాను చెప్పుకుంటాడు. టీజర్ హై ఎనర్జీతో అదిరిపోయింది. ఈ టీజర్ హ్యూజ్ బజ్‌ను సృష్టిస్తుంది. డిసెంబర్ 12న సైక్ సిద్ధార్థ గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సినిమా ఏషియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్స్ ద్వారా విడుదల కానుంది. మార్కెటింగ్‌ను రానా స్పిరిట్ మీడియా నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో హీరో శ్రీ నందు, డైరెక్టర్ వరుణ్ రెడ్డి, హీరోయిన్ యామిని పాల్గొన్నారు.

## 'ఓం వీర నాగ' సాంగ్ షూటింగ్



యంగ్ హీరో విరాట్ కర్ణ, అభిషేక్ నామా దర్శకత్వంలో కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న పాన్‌ఇండియా ఎపిక్ మైథలాజికల్ యాక్షన్ ఎంటర్టైనర్ నాగబంధంతో అలరించబోతున్నారు. విరాట్ తన పాత్ర కోసం ఎంతో డెడికేషన్ తో అద్భుతంగా ఫిజికల్ ట్రాన్స్ఫర్మేషన్ అయ్యారు. నాగబంధం ఆధ్యాత్మికత, యాక్షన్, విజువల్ స్ప్లెండర్ మిళితమైన ఓ మ్యసీవ్ సినిమాటిక్ జర్నీ. అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం భక్తి, యాక్షన్, మిస్టరీని సమపాళ్లలో కలిపి ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. స్కేల్, విజువల్స్, కాన్సెప్ట్.. ఇవన్నీ తెలుగు సినిమా సరిహద్దులను దాటేలా వుంటాయి. బడ్జెట్ పరిమితులూ లేకుండా, ప్రేక్షకులను అబ్బురపరిచే సెట్లు, విజువల్స్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది.




రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో హోం భలే ఫిలిమ్స్ నిర్మించిన కాంతారా ప్రీక్వెల్ సక్సెస్ అయిన సందర్భంగా సినిమా యూనిట్ సక్సెస్ సెలబ్రేట్ చేసుకున్నప్పటి చిత్రం ఇది.




నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్ లో వస్తున్న సినిమా 'అఖండ 2: తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం తేజస్విని నందమూరి చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలై 'అఖండ 2: తాండవం' ప్రమోషనల్ కంటెంట్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా అఖండ 2: తాండవం సాంగ్ ప్రోమో రిలీజ్ చేశారు. తమన్ పవర్ ఫుల్ బీట్స్, డివోషనలో చాంట్స్‌తో ఈ సాంగ్‌ని అద్భుతంగా కంపోజ్ చేశారు. ఒక చేతిలో త్రిశూలం, మరో చేతిలో డమరుకంతో బాలకృష్ణ చేసిన అఖండ తాండవం గూస్ బంప్స్ తెప్పించింది. ప్రోమో సాంగ్‌పై అంచనాలని భారీగా పెంచింది. ఫుల్ సాంగ్ ఈనెల 14న విడుదల కానుంది. చిత్రంలో సంయుక్త ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఆది పినిశెట్టి ఓ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనున్నారు.ఈ చిత్రానికి సి.రాంప్రసాద్, సంతోష్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, తమ్మిరాజు ఎడిటర్. ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. అఖండ 2: తాండవం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. సంయుక్త, హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఆది పినిశెట్టి, హర్షాలి మల్హోత్రా కీలకమైన పాత్రల్లో కనిపించనున్నారు.

# రియాజ్‌ను దారుణంగా చంపేశారు

### జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన తల్లి



**ప్రజాపక్షం/నిజామాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన నిజామాబాద్‌లో కానిస్టేబుల్ హత్య.. నిందితుడు రియాజ్ ఎన్‌కౌంటర్‌పై కొత్త మలుపు తిరిగింది.కానిస్టేబుల్ హత్య, రియాజ్ ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలని రియాజ్ తల్లి జాతీయ మహిళా కమిషన్ గడపతొక్కింది. ఈ మేరకు 'నా కొడుకు మెడ విరిచేశారు..పొట్టలో నుంచి పేగులు బయటకొచ్చాయని ..రియాజ్‌ను దారుణంగా చంపేశారు' అని రియాజ్ తల్లి ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. భావోద్వేగానికి గురయ్యారు. కానిస్టేబుల్ ప్రమోద్ ను కత్తితో పొడిచి చంపిన రియాజ్ ను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన విషయం తెలిసిందే. కాగ శనివారం ఢిల్లీలో రియాజ్ ఎన్‌కౌంటర్ ఒక బూటకమని అతని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తమ కుమారుడితో పాటు, తమ కుటుంబపై జరిగిన పోలీసుల అమానుష దాడిని సుమోటోగా స్వీకరించాలని జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన రియాజ్ తల్లి ఇవాళ మరోసారి భావోద్వేగానికి లోనయ్యారు. తన కుమారుడు రియాజ్‌ది బూటకపు ఎన్‌కౌంటర్ అని ఆరోపించారు. ప్రమోద్ హత్యపై లోతుగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఒకవేళ నా కొడుకే నిజంగా హంతకుడు అయితే ఆధారాలు చూపించాలన్నారు. అప్పుడే తనకు మనశ్శాంతిగా ఉంటుందని తెలిపారు. ఏ తల్లికి అయినా కొడుకు కొడుకేగా అని వ్యాఖ్యానించారు. తన కుమారుడికి జరిగినట్లుగా మరెవరికీ జరగకూడదని కంటతడి పెట్టారు. నా కొడుకు అంతిమ యాత్రలో పోలీసులు వచ్చి ఎక్కడా ఆగనివ్వకుండా పంపించేశారు. శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేస్తుంటే, ఇక్కడ చేయకూడదు అని వెళ్లగొట్టారు. ఎవరి కొడుకుకైనా ఇలాంటి పరిస్థితి రాకూడదంటూ రియాజ్ తల్లి కంటతడి పెట్టారు. రియాజ్ చనిపోయినప్పుడు, అంతిమ యాత్రలో తీసుకెళ్తుంటే పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారన్నారు.

# అగ్గికి పత్తి ఆహుతి

**ప్రజాపక్షం/బెజ్జంకి :** ప్రమాదవశాత్తూ మంటలు అంటుకుని 300 క్వింటాళ్ల పత్తి దగ్ధమైన ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. బెజ్జంకికి చెందిన రైతు బండి ఐలయ్య తన పది ఎకరాలతో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. కొద్దిరోజులుగా పత్తి తీత పనులు కొనసాగుతుండగా.. ఇంటికి తెచ్చిన పత్తిలో తడి ఆరేందుకు ఖాళీ స్థలంలో టార్పాలిన్లు వేసి ఆరబెట్టారు. మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని క్షణాల్లో పత్తి మొత్తం కాలి బూడిదైంది. రైతు ఐలయ్యతో పాటు కుమారులు రమేష్, అనిల్, ఇతర కుటుంబ సభ్యులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. సుమారు 300 క్వింటాళ్ల మేర పత్తి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ఇన్ని రోజుల కష్టం బూడిద పాలు కావడంతో బోరున విలపించారు. ఘటనా స్థలాన్ని సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను, ఎస్ఐ సౌజన్య పరిశీలించారు. కాగా, విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుడితో మాట్లాడారు. దగ్ధమైన పత్తి రైతుకు తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్ట పరిహారాన్ని అందించి ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# హెచ్-1బి దుర్వినియోగంపై 175 కేసుల దర్యాప్తు చేపట్టిన ట్రంప్

**న్యూయార్క్:** అమెరికాలో హెచ్-1 బి వీసాలు దుర్వినియోగం జరుగుతోందంటూ భారీ ఎత్తున వీసా ఫీజు పెంచిన ట్రంప్ యంత్రాంగం ఈ విషయంలో 175 కేసులు నమోదు చేసింది. ట్రంప్ యంత్రాంగం ఈ కేసుల్లో దర్యాప్తు చేపట్టింది. చాలా తక్కువ వేతనాలకు విదేశాల నుండి ఉద్యోగులను తీసుకువచ్చి అమెరికాలో ఉద్యోగాలు చేయిస్తున్నారని, ఉద్యోగులు పని ప్రదేశాలలో ఉండకుండా దూర ప్రాంతాల నుండే పనులు నిర్వహిస్తున్నారని, అదేవిధంగా పని ఇవ్వకుండా జీతం ఇచ్చి బెంచ్ మీద కూర్చోబెట్టే సంస్కృతి కూడా బాటా అమలులో ఉందనే ఆరోపణలపై 175 కేసుల్లో దర్యాప్తు ప్రారంభించారు. అర్హులైన అమెరికన్లకు ఉద్యోగాలు ఇవ్వకుండా హెచ్-1 బి వీసాలపై ఉద్యోగులను ఇతర దేశాల్లోంచి తీసుకువచ్చి తక్కువ వేతనాలతో పనులు చేయించుకుంటున్నారన్నది ట్రంప్ ప్రభుత్వం ప్రధాన ఆరోపణ. పైగా ఈ వీసాలలో 72 శాతం మేరకు భారతీయులకే ఇస్తున్నారన్నది మరో ఆరోపణ. చాలా అత్యున్నతస్థాయి నైపుణ్యం ఉంటే తప్ప ఎవ్వరికీ వీసాలు ఇవ్వకూడదన్న నిబంధనను కూడా డోనాల్డ్ ట్రంప్ ముందుకు తీసుకువచ్చారు. ఈ నైపుణ్య ఉద్యోగాల నియామకాల్లో స్థానిక అమెరికన్లకే ప్రాధాన్యం ఇస్తామని కూడా ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటినుండీ చెబుతూ వచ్చారు. ఈ ఏడాది సెప్టెంబరు 21న ట్రంప్ ఉత్తర్వులు జారీ చేస్తూ, ఇకమీదట కొత్తగా హెచ్-1బి వీసాలకు దాఖలు చేసుకునేవారు ఏకకాలంలో దరఖాస్తు ఫీజు కింద 1,00,000 డాలర్లు చెల్లించాలని కూడా నిబంధన విధించి టెక్ కంపెనీలకు గుండెదడ పుట్టించారు.

# అమెరికా బహిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

మియామీలో 2026లో జి-20 సదస్సుకు ఆతిథ్యం ఇచ్చేందుకు తానెంతో ఆసక్తిగా ఉన్నానని చెప్పారు. ట్రంప్ ఈ ఏడాది అధికారంలోకి రాగానే ఫిబ్రవరిలో ఒక ప్రకటన చేస్తూ దక్షిణాఫ్రికాను తప్పుపట్టారు. ఆ దేశంలో ఉన్న మైనారిటీ వర్గాలు అంటే అమెరికన్ల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని, వారి భూములకు కనీస నష్టపరిహారం కూడా ఇవ్వడంలేదని విమర్శించారు. ఆ దేశంలో మానవ హక్కుల దోపిడీ కొనసాగుతోందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో దక్షిణాఫ్రికాకు అమెరికా ఎలాంటి ఆర్థిక సహాయం, ఇతర రకాల సహాయం చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గత ఏడాది డిసెంబరు ఒకటో తేదీన దక్షిణాఫ్రికా జి-20 అధ్యక్ష బాధ్యతలను తీసుకుంది. ఈనెల 22,23 తేదీలలో జోహన్నెస్‌బర్గ్‌లో జి-20 సదస్సు నిర్వహిస్తోంది. 2022 డిసెంబరు నుండి 2023 నవంబరు వరకూ భారతదేశం జి-20 అధ్యక్ష బాధ్యతలు నిర్వహించి ఆ బాధ్యతలను దక్షిణాఫ్రికాకు అప్పగించింది. జి-20లో భారత్‌తోపాటు 19 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్,జర్మనీ, భారత్, ఇండోనేసియా, ఇటలీ, జపాన్, దక్షిణ కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణ ఆఫ్రికా, టర్కీ, బ్రిటన్, అమెరికా,యూరోపియన్ యూనియన్, ఆఫ్రికన్ యూనియన్‌లు సభ్యులుగా ఉన్నాయి.


# 'విశ్వగురు' వెళ్ళడం ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

విభాగాధిపతి జైరామ్ రమేశ్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. తనను తాను విశ్వగురుగా ప్రకటించుకున్న నరేంద్రమోదీ ఈనెల 22, 23 తేదీలలో జరిగే సదస్సుకు వెళతారని మేం ఖచ్చితంగా చెప్పగలమని పేర్కొన్నారు. దక్షిణాఫ్రికాలో జాతిపరంగా మైనారిటీలుగా ఉన్న అమెరికన్లు, డచ్, జర్మన్, ఫ్రాన్స్‌దేశ ప్రజలను అణచివేతకు గురిచేస్తూ మానవహక్కుల దోపిడీ చేస్తోందని, ఈ దోపడీ ఆగేవరకు తాము ఆ దేశానికి వెళ్ళేదిలేదని ట్రంప్ ప్రకటించిన తర్వాత జైరామ్ రమేశ్ పైవిధంగా స్పందించారు. ట్రంప్ వెళ్ళనందువల్ల కౌలాలంపూర్ సదస్సుకు మోదీ భౌతికంగా హాజరుకాకుండా, దృశ్యమాధ్యమ పద్ధతిలో సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. ట్రంప్‌ను ఎదుర్కోలేక మోదీ ఆయనకు తన మొహం చూపించడంలేదని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే పలుసార్లు విమర్శలు చేసింది. ఈ ఏడాది మే నెలలో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన సైనిక ఘర్షణను వాణిజ్యం అడ్డంపెట్టి తానే నివారించానని డోనాల్డ్ ట్రంప్ పదే పదే ప్రపంచవ్యాప్తంగా చాటింపు వేస్తున్నారు. కానీ భారత్ మాత్రం, ఈ ఇరుగు పొరుగు యుద్ధంలో మూడోదేశం జోక్యం లేదనీ, తమ రెండు దేశాల డిజిఎంఓ (సైనిక చర్యల డైరెక్టర్ జనరల్స్)ల మధ్య ప్రత్యక్ష సంభాషణల ద్వారా సమస్య పరిష్కరించుకున్నామని స్థిరంగా తన వాదన వినిపిస్తున్నది. 'మీరు ఇలా ఘర్షణ పడితే మీ రెండు దేశాలతో నేను వాణిజ్యం ఆపేస్తాను' అని చెప్పిన తర్వాత 'మేం యుద్ధం ఆపేశాం, ఒప్పందం కుదిరింది' అని తనకు ఫోన్ కాల్ వచ్చిందని ట్రంప్ మూడు రోజుల క్రితం కూడా తాజాగా ప్రకటించడాన్ని కాంగ్రెస్‌పార్టీ దేశ ప్రజల దృష్టికి తీసుకువచ్చింది.

# ప్రజాస్వామ్యం నిలవదు

(మొదటి పేజీ తరువాయి)



రాఘవాచారి పనిచేశారన్నారు. ఐదు వేల రూపాయలతోనే జీవనం సాగిస్తూ, రిక్షాలలో ప్రయాణం కొనసాగించేవారని గుర్తు చేసుకున్నారు. సంపాదన లేదని సంపాదకుడు రాఘవాచారి అని అన్నారు. ఇది డబ్బు కంటే విలువ, నిబద్ధత, సత్యం పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనం అని అన్నారు.

1939లో పాలకుర్తిలో శ్రీవైష్ణవ కుటుంబంలో జన్మించిన రాఘవాచారి, రామాయణం, మహాభారతం, భాగవతం వంటివి చదివి అర్థం చేసుకున్నారన్నారు. గుంటూరు వెళ్లి సంపత్ కుమార్, చల్లా సత్యానాయరణల దగ్గర శిష్యరికం చేసి, పంచ కావ్యాలను నేర్చుకున్నారన్నారు. తమిళం, సంస్కృతం, తెలుగు ఉర్దూ భాషలలో ప్రావీణ్యత సాధించారని చెప్పారు. లాలాగూడలో హైస్కూల్‌లో చదివి, ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్‌లో చేరే అవకాశం వచ్చినా కాదని, బిఎస్‌సి చేశారని, అనంతరం లాకాలేజీలో చేరి, ఎల్ఎల్ఎం పూర్తి చేశారని వివరించారు. రామాయణం, మహాభారతం చదవిన రాఘవాచారి శ్రీశ్రీ కవిత్వం పట్ల ముగ్ధుడయ్యారని, మఖ్దూం మొహియొద్దీన్‌కు శిష్యుడుగా మారారని, కమ్యూనిస్టుగా కొనసాగారన్నారు. ఏది రాయకూడదు, ఏది రాయాలనే అంశాలపై ఆయన పాఠాలు నేర్పారని చెప్పారు.

**భావ ప్రకటన స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి మూలాధారం..**

పత్రికలు, యాజమాన్యాలు, సంపాదకులకు అవినాభావ సంబంధం కలిగిన అంశాలు అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వాలు ఎన్ని నియంత్రణలు తీసుకురావాలని ప్రయత్నించినా, పత్రికల స్వేచ్ఛను ప్రజలు, కోర్టులు కాపాడాయన్నారు. ఆర్టికల్ 19(1)కు సవరణ ద్వారా నెహ్రూ ప్రభుత్వం సహేతుక నియంత్రణకు ప్రయత్నించిందని తెలిపారు. పత్రికల స్వేచ్ఛను కోర్టులు ఎల్లప్పుడూ కాపాడాయని జస్టిస్ సుదర్శన్ రెడ్డి గుర్తు చేశారు. 'భావ ప్రకటన స్వేచ్ఛ లేకుంటే ప్రజాస్వామ్యం ఉండదు', ఇది కేవలం న్యాయసూత్రం కాదు, జీవనసత్యం అని అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి మూలాధారమన్నారు. దాన్ని పూర్తిగా నియంత్రిస్తే ప్రజాస్వామ్యం సారం హీనమవుతుందన్నారు. సర్క్యులేషన్ తగ్గించడానికి ఆంక్షలు విధించాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను సుప్రీం కోర్టు తిరస్కరించిందని తెలిపారు. భావప్రకటనా స్వేచ్ఛ మానవ హక్కుల అంతర్భాగమని జాన్ మిల్టన్ కూడా చెప్పారని అన్నారు.

**సోషల్ మీడియాను నియంత్రిస్తున్న సంపన్నులు**

సోషల్ మీడియా ఇప్పుడు మీడియా చేతుల్లో లేదని సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలోని కొద్ది మంది సంపన్నులు సోషల్ మీడియాను నియంత్రిస్తున్నారన్నారు. దీన్ని ఎంతవరకు నియంత్రించవచ్చన్నదే ఇప్పుడు ముంబాయి హైకోర్టు తీర్పు నేపథ్యంలో సుప్రీం కోర్టులో చర్చ జరుగుతుందని చెప్పారు. రాఘవాచారి స్మారకోపన్యాసం ఇచ్చేందుకు నోట్ రాసుకొని వద్దామనుకున్నానని, కానీ సమయాభావం వల్ల రాయలేకపోయానని తెలిపారు. ఆయన నోట్స్ తీసుకొని చదివిన సందర్భం లేదని, ఆయనలాగే నేరుగా వచ్చి, హృదయం చెబుతున్న మాటలతోనే మాట్లాడాలని భావించానని తెలిపారు. రాఘవాచారి జీవితం మనందరికీ ఒక పాఠం అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు.

**ప్రజల పక్షాన పనిచేసేందుకే మీడియాను రాజ్యాంగంలో చేర్చలేదు : కె.శ్రీనివాస్ రెడ్డి**

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంలో మీడియా ప్రస్తావన ఎక్కడ లేదనే విషయం తెల్సిందేనని అన్నారు. రాజ్యాంగంలో మీడియా ప్రస్తావనను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వ్యతిరేకించారని తెలిపారు. మూడు అంగాలు రాజ్యాంగం పరిధిలో ఉన్నందున, రాజ్యాంగంలో మీడియాను బంధించొద్దని అంబేద్కర్ చెప్పారన్నారు. ప్రజల పక్షాన మీడియా పనిచేయాలని అంబేద్కర్ ఆకాంక్షించారని తెలిపారు. రమేష్ థాపర్ కేసులో ఆర్టికల్ 19(1)'ఎ'లో పత్రికాస్వేచ్ఛ అంతర్భాగమని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. దేశంలో చోటు చేసుకున్న పరిణామాలు, అందరి భావాలు మీడియా చెప్పుతుందన్నారు. ఎన్ని ఆవరోధాలు వచ్చినా న్యాయ వ్యవస్థ రక్షించిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పత్రికా రంగ ప్రముఖులు కె.రామచంద్రమూర్తి, ఆర్.వి.రామారావు (విశాలాంధ్ర ఎడిటర్), దేవులపల్లి అమర్ (మనతెలంగాణ ఎడిటర్), టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్‌అలీ, ఐజెయు నాయకులు ఎం.ఎ.మాజిద్, వై.నరేందర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, ట్రస్ట్ సభ్యులు కె.జ్యోత్స్న, వై.వి.కృష్ణ, ఎ.చందర్, టి.సురేశ్, బి.జమిందార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలుత ట్రస్ట్ సభ్యులు డి.సోమసుందర్ స్వాగతం పలుకగా, చివరలో డాక్టర్ సి.అనుపమ వందన సమర్పన చేశారు. వివిధ రంగాల ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com